


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 9

సోమవారం 1-4-2024


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

మంచిమాట

ఆయురన్నం ప్రయచ్ఛతి

ఏదైనా ప్రమాదం నుండి కాని, భయంకరమైన వ్యాధి నుండి కాని బయట పడితే భూమి మీద నూకలు మిగిలి ఉన్నాయి అంటారు. అంటే ఆ వ్యక్తి ఇంకా కొంత తినవలసి ఉంది. అది పూర్తిగా ఖర్చు అయ్యే వరకు బతికి ఉంటాడు. ఒకవేళ ఎవరయినా అర్థాంతరంగా శరీరం వదిలితే ఆ వ్యక్తికి నూకలు చెల్లి పోయాయి అంటారు. దీనినే శాస్త్రాలు 'ఆయురన్నం ప్రయచ్ఛతి' అని చెప్పటం జరిగింది.

అంటే మనిషికి ఆయువు ఉంటే అదే బతకటానికి కావలసిన ఆహారాన్ని తెచ్చి పెడుతుంది. ప్రాణం నిలబడటానికి కావలసినంత ఆహారం ప్రకృతి సమకూర్చుతుంది. ఆయువు తీరితే ఎదురుగా ఉన్న ఆహారం చేతి వరకు, చేతిలో ఉన్న ఆహారం నోటిదాకా రాదు. నోటిలో పెట్టుకున్నాక మింగకుండా ప్రాణాలు వదిలిన వారు కూడా ఉన్నారు. ఇటువంటి దానికి ఉదాహరణగా ఎరతో పాటు గాలం కూడా నోటిలో గుచ్చుకుని, ప్రాణాలు కోల్పోయే చేపలు, బోనులో పెట్టిన విషాహారాన్ని తిని చనిపోయే ఎలుకలు నిదర్శనం. ఆయువు ఉంటే బతకటానికి కావలసిన ఆహారం సమకూరుతుంది అనటానికి రాతిలో ఉన్న కప్పని ఉదాహరణగా చెపుతూ ఉంటారు.



అన్నం అంటే తినేది, తినబడేది అని అర్థం. జీవుల చేత తినబడుతూ ఉంటుంది. ఆయువు ఉన్నంత వరకు తినబడుతూ ఉంటుంది. ఆయువు తీరితే తనే తింటుంది. ఏ ఆహారమైతే ప్రాణాలు నిలబెడుతున్నదో, అదే ప్రాణాంతకం అవుతుంది. పరిమితంగా, కావలసినంత మాత్రమే తిన్నప్పుడు బలాన్ని కలిగిస్తుంది. అపరిమితంగా తింటే ముందు ఆరోగ్యం చెడి, ప్రాణహాని కూడా కలుగుతుంది. అందుకే ఏదైనా ప్రయోజనం కోసం కొంతకాలం శరీరం ధరించి ఉండవలసి వస్తే ఆహారాన్ని తగ్గిస్తారు. ఎందుకంటే తాము తెచ్చుకున్న నూకలు మిగుల్చుకోవటానికి. ఈ రోజుకి కూడా చెత్తకుప్పలలో అపస్మారక స్థితిలో ఉన్న పసికందులని చూసి అనాథాశ్రమాలకి అప్పచెప్పటమో, తామే పెంచుకోవటమో, ఎవరికైనా పిల్లలు లేని వారికి ఇవ్వటమో చూస్తూనే ఉన్నాం. అన్ని ఉన్నవారు ఏమౌతున్నారో కూడా ప్రత్యక్ష నిదర్శనాలున్నాయి కదా! దాక్షిణాత్యులకి, ముఖ్యంగా తెలుగు వారికి అన్నం అంటే వరి అన్నం అనే అర్థం. కాని, 'అత్' అనే ధాతువుకి తిను అని అర్థం. అన్నం అంటే తినేది ఏదైనా అని అర్థం. గోధుమ ప్రధాన ఆహారంగా ఉన్న వారికి అన్నం రొట్టెలు. జొన్న ప్రధాన ఆహారమైతే జొన్నసంకటి, జొన్నరొట్టెలు అన్నం. పాముకి ఎలుక అన్నం. ఆ ఎలుకకి మన వంటింట్లో ఉన్నవన్నీ అన్నమే. కాకపోతే పుస్తకాలు, బట్టలు. ఒక ప్రాణి బతక వలసి ఉంటే ఏదో విధంగా దానికి కావలసిన అన్నం (ఆహారం) దొరుకుతుంది. ఉండవలసినది ఆయువు. ఆహారం ఏదో ఒక రకంగా దొరుకుతుంది.

– డా.ఎస్.అనంతలక్ష్మి

ఎవరైనా వృద్ధాప్యంలో ఎక్కువగా తినేస్తు ఉంటే "తిననీయండి. తెచ్చుకున్నది పూర్తి చేయాలి కదా!" అంటారు. అంటే తెచ్చుకున్న ఆహారం పూర్తిగా వెచ్చించబడితే కాని ఆయువు తీరదు. ఆయుర్దాయానికి ఆహారానికి ఉన్న సంబంధాన్ని గుర్తించారు కనుకనే పెద్దలు ఆయుర్దాయం ఉంటే అన్నం పుడుతుంది అని అంటారు. విశ్వామిత్రుడు, మేనక తమకి జన్మించిన బిడ్డని వదిలి వెడితే పక్షులు ఆ పసికందుని కాపాడాయి. శకుంతాల చేత కాపాడబడటం వల్ల ఆ బిడ్డ శకుంతల అయింది. ఆమె జీవించి ఉండాలి కనుక పక్షులు తమకు తోచిన ఆహారాన్ని అందించాయి. అడవి జంతువుల చేత పెంచబడిన ఇటువంటి ఉదాహరణలు కోకొల్లలు.

బౌద్ధవాణి

సమజీవనం

వసంత రుతువు వచ్చేసింది. వనమంతా పూలతో పరిమళిస్తోంది. హిమాలయ ప్రాంతంలో కోలియులకు చెందిన కక్కరవస్తు నగరం అది. ఆ నగర సమీప వనంలో విశాలమైన రావిచెట్టు కింద కూర్చొని ఉన్నాడు బుద్ధుడు తన భిక్షు సంఘంతో. కోలియ యువకుడు దీర్ఘజాణుడు కూడా వచ్చి బుద్ధుని దగ్గరే కూర్చుని తన సందేహాలు తీర్చుకుంటున్నాడు. 'భగవాన్! లోకంలో హితకారి, సుఖకారి అయిన నాలుగు ధర్మాల గురించి చెప్పండి?' అని అడిగాడు. ఆ ప్రశ్నతో అక్కడ ఉన్న భిక్షువులందరూ సర్దుకు కూర్చున్నారు. అంతలో కొద్దిదూరంలో రైతులు లయబద్ధంగా అరిచే అరుపులు వినిపించాయి.

కావళ్ళకు ధాన్యం మోపులు కట్టుకుని, భుజాన మోస్తూ, వేగంగా నడుస్తూ ఉన్నా రైతులు 'ఓహోం.. ఓహోం..'' అంటూ అరుస్తూ, ఆ వూపులో వేగంగా పోతున్నారు. వారి మధ్యలో ఉన్న రైతు కావడిని కాస్త ముందుకు సర్దుకున్నాడు. దానితో వెనుక బలం పెరిగింది. గట్టు దాటే సమయంలో వెనక్కు పడిపోయాడు. మరలా లేచి కావడిబద్దను భుజానికి ఎత్తి, ముందూ, వెనుకల బరువులు సర్దుకుని వారితో నడక సాగించాడు. కానీ, వెనుకపడ్డాడు. రైతులు వెళ్ళిపోయారు.

''దీర్ఘజాణా; ఈ లోకంలో హితాన్ని, సుఖాన్ని కూర్చే ఉత్థాన సంపద, ఆరక్ష సంపద, కళ్యాణ మిత్రత, సమజీవనం– అనే నాలుగు సంపదలు ఉన్నాయి'' అన్నాడు. ''భగవాన్! వాటి గురించి చెప్పండి'' అడిగాడు దీర్ఘజాణుడు నమ్రతగా. ''దీర్ఘజాణూ! వృత్తి ద్వారా సంపాదించేది ఉత్థాన సంపద. పశుపాలనం, వ్యవసాయం, వాణిజ్యం, శిల్పకళ, ఉద్యోగం... సోమరితనాన్ని వీడి ఈ వృత్తులు నిర్వహించడంలో నేర్పరి అవుతారు. ఇలా సాధించుకున్నదే ఈ సంపద''

''అలాగే! ఒకరు తమ కండబలాన్ని ఉపయోగించి, నిరంతరం శ్రమించి, కష్టపడి చమటోడ్చి, సంపద కూర్చుకుంటాడు. తాను శ్రమించి పొందిన ఈ సంపదని రాజులు, దొంగలు కాజేయకుండా, అగ్నికి ఆహుతి కాకుండా, వరదపాలు కాకుండా రక్షించుకుంటాడు. దీన్నే ఆ రక్ష సంపద అంటారు.



''మరి, దీర్ఘజాణూ! మిత్రులు కూడా మనకు సంపదే! శీలవంతులు, సదాచారులు, శ్రద్ధావంతులు, ప్రజ్ఞానులు, త్యాగబుద్ధి కలిగిన మిత్రులు ఉంటే... మనం కూడా వారిలా శీలసంపద పొందుతాం. శ్రద్ధా సంపద సాధిస్తాం. సదాచారులై జీవిస్తాం. ఇలా శీల, జ్ఞాన సంపదలు మనకు మంచి మిత్రుల వల్ల వస్తాయి. అందుకే కల్యాణ(మంచి) మిత్రులు కూడా మనకు ఒక సంపదే.

ఇక, సమజీవనం అంటే అన్నింటికంటే మనకు హితకారి. కొందరు ఆడంబరాల కోసం తమ ఆదాయానికి మించి వ్యయం చేస్తారు. ఇంకొందరు ఎక్కువ ధనం ఉన్నప్పటికీ పిసినారితనం చూపుతారు. వీరిద్దరూ మోసే కావడి ఏదో ఒకవైపు బరువు పెరిగో, తరిగో సమతుల్యత కోల్పోతుంది. దానివల్ల మోసేవాడి భుజం పట్టు తప్పుతుంది. కావడి పడిపోతూ... మోసేవారినీ పడేస్తుంది.''

''దీర్ఘజాణూ..! అలా కాకుండా ఆదాయ వ్యయాలను సరితూచుకుంటూ జీవించే వారే 'సమజీవనం' సాగించేవారు. విలాసాలూ, విందులూ, ఇతరులతో పోల్చుకుని అతిగా వ్యయం చేయడం మాని, అవసరాల మేరకు జీవిస్తే... కొద్దిగా ఆదాయం కూడా సమకూరుతుంది. వారి జీవితం నిశ్చింతగా సాగుతుంది; దీర్ఘజాణూ! సకల గృహస్థులకు ఈ సమజీవనం చాలా అవసరం! ఎందుకంటే... ఇదే హితం! ఇదే సుఖం!'' అన్నాడు బుద్ధుడు. దూరం నుండి రైతులు కావళ్ళు మోస్తూ లయబద్ధంగా అరుస్తున్న అరుపులు వినిపిస్తున్నాయి! దీర్ఘజాణు వంగి బుద్ధుని పాదాలకు నమస్కరించాడు.

– డా. బొర్రా గోవర్ధన్

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

గుర్రాలు మాట వినవు...

ధర్మాచరణకు ప్రధానమైన ప్రతికూల పరిస్థితులు రెండు–అర్థము, కామము. ఇవి ధర్మాచరణకు నిరంతరం పరీక్ష పెడుతుంటాయి. అర్థము అంటే కేవలం డబ్బు మాత్రమే కాదు, భోగ సంబంధమైన సమస్త వస్తువుల రాశిని అర్థము అనవచ్చు. తనకు సుఖాన్నిచ్చే మంచం, కుర్చీ, ప్రయాణించే వాహనం ఏదయినా కావచ్చు. కామము అంటే – కోర్కె వేరు, అవసరం వేరు. రెండింటికీ మధ్య సున్నితమైన భేదం ఉంది. అవసరం తీరకపోతే పాపం అడ్డు వస్తున్నదని గుర్తు. దానిని తీసేయగలిగిన శక్తి ఒక్క భగవంతుడికే ఉంది. పాపం పోవడానికి యజ్ఞ యాగాదులు చేస్తారు. సంతానం కోసం అశ్వమేధం.. వంటివి.

మనం ఒక కోరిక కోరుకుంటున్నాం. అది అవసరం కూడా. దానికి భగవంతుడిని ఆశ్రయించడం తప్పు కానేకాదు. భగవంతుడు ఏమంటాడంటే... నాలుగు రకాల భక్తులు నన్ను ఎప్పుడూ ఆశ్రయించి ఉంటారు. చాలా ఆర్తి కలిగినవాళ్ళు, అసలు భగవంతుడెవరని తెలుసుకోవాలన్న కుతూహలం ఉన్న వాళ్ళు. మంచి పనులు చేయడానికి ధన సహాయం కోరుకుంటున్న వాళ్ళు. తత్త్వతః పరమాత్మను ఎరుకలోకి తెచ్చుకుని స్తోత్రం చేసేవాళ్ళు. చివరి తరగతి భక్తులగురించి శంకరాచార్యులవారు ఏమంటారంటే... సముద్ర కెరటం సముద్రాన్ని స్తోత్రం చేస్తే ఎలా ఉంటుందో తత్త్వాన్ని అవగతం చేసుకుని జ్ఞాని భగవంతుడిని స్తోత్రం చేయడం అలా ఉంటుంది –అని. ఎక్కడో కోటానుకోట్లలో ఒక్కరే కారణజన్ములుంటారు. వారికి జన్మతః వైరాగ్యం ఉంటుంది. వారికి అర్థకామముల మీద ఎటువంటి తపనా ఉండదు. ఒకవేళ ఏదయినా మనసులో ఏర్పడినా, ధర్మాన్ని రక్షించడానికి ఇలా చేద్దామన్న ఆలోచనే తప్ప వ్యక్తిగతంగా ఏమీ ఉండదు. ఏకాకిగా తనలో తాను రమిస్తూ ఉంటాడు. దేనినీ కోరుకోడు. అతడు జీవన్ముక్తుడు.



కానీ అందరూ ఆ స్థితిలో ఉంటారా !!! ఉండరు. ధర్మానికి పెద్ద పరీక్ష అర్థము. ఒక కోరిక తీర్చుకోవడానికి పరుగులు తీయడం.. చివరకు తీర్చుకుంటాడు. అది తీరిపోయింది కనుక మళ్లీ ఆ కోరిక పుట్టదు– అని చెప్పలేం. మామిడిపండు తినాలని ఆరాటపడి, చివరకు అది దొరికి తిన్న తరువాత.. అది అక్కడితో ఆగదు. అదే పండు మళ్ళీ మళ్లీ కావాలనిపించవచ్చు, ఏ పండయినా సరే అని మళ్ళీ పరుగులు మొదలు కావచ్చు. ఇది ఎలా ఉంటుంది అంటే నేతి పాత్ర పట్టుకుని వెళ్ళి అగ్నిహోత్రాన్ని చల్లార్చడానికి ప్రయత్నించినట్లు ఉంటుంది. ప్రజ్వరిల్లే అగ్ని మీద నెయ్యి చల్లితే, అది ఆరదు, మరింత విజృంభిస్తుంది. కోరికలూ అంతే. అవి ఉపశమించే అవకాశం ఉండదు.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మరి అర్థకామములు లేకుండా మనిషి ఎలా ఉంటాడు? అది సాధ్యం కాదు. అవి ఉండితీరతాయి. ఎవరికయినా భోగం అనుభవించాలన్న కోరిక ఉంటుంది. దానిని తీర్చుకోవడానికి అవసరమయిన సాధనసంపత్తిని సమకూర్చుకోవాలన్న కోరికా ఉంటుంది. దానికి సనాతన ధర్మం ఒక చక్కటి పరిష్కారం చూపింది. అర్థకామములను ధర్మంతో ముడిపెట్టింది. ఇప్పుడు ధర్మబద్ధమైన కామము, ధర్మబద్ధమైన అర్థము.. ఇవి మోక్షానికి కారణమవుతాయి తప్ప బంధాలకు, కోరికలు అపరిమితంగా ప్రజ్వరిల్లడానికి కారణం కావు. అప్పుడు మనిషి జీవితం, కుటుంబ జీవనం, సామాజిక వ్యవస్థ అన్నీ క్రమబద్ధంగా ఉంటాయి, నియంత్రణలో ఉంటాయి. చెలియలికట్ట దాటే సాహసం చేయవు.

సినిమా


● నాగచైతన్య
● పూజా హెగ్డే

పదేళ్ల తర్వాత...

హీరో నాగచైతన్య, హీరోయిన్ పూజా హెగ్డే మరోసారి జోడీగా నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. 2014లో విడుదలైన 'ఒక లైలా కోసం' సినిమాలో వీరిద్దరూ జంటగా నటించారు. దాదాపు పదేళ్ల తర్వాత మరోసారి జోడీగా నటించనున్నారని టాక్. ప్రస్తుతం చందు మొండేటి దర్శకత్వంలో 'తండేల్' సినిమా చేస్తూ బిజీగా ఉన్నారు నాగచైతన్య. ఆ తర్వాతి చిత్రాన్ని 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో చేయనున్నారట. నాగచైతన్య కోసం మిస్టరీ, పౌరాణిక, థ్రిల్లర్ అంశాలతో కథ రెడీ చేస్తున్నారట కార్తీక్ దండు. ఈ చిత్రంలో నాగచైతన్య సరసన పూజా హెగ్డేని కథానాయికగా తీసుకోవాలని మేకర్స్ అనుకుంటున్నారని భోగట్టా. ఇక 2022లో విడుదలైన 'ఆచార్య' సినిమా తర్వాత ('ఎఫ్ 3'లో ప్రత్యేక పాట చేశారు) మరో తెలుగు సినిమా కమిట్ కాలేదు పూజాహెగ్డే. నాగచైతన్యతో నటించే తాజా చిత్రం ఆమెకు తెలుగులో పెద్ద కమ్‌బ్యాక్ అవుతుందని టాక్. ప్రస్తుతం బాలీవుడ్‌లో 'దేవా' అనే సినిమా చేస్తున్నారు పూజా హెగ్డే.

ఐదు భాషల్లో డబ్బింగ్


● రష్మిక

'నేను సూడలేదని ఓ పులుపెక్కిపోతాండవట కదా..' అంటూ 'పుష్ప' సినిమాలో రష్మికా మందన్నా అదో రకం మాస్ స్టయిల్‌లో చెప్పిన డైలాగ్ చాలా పాపులర్ అయిన విషయం తెలిసిందే. ఈ కూర్గ్ బ్యూటీ 'పుష్ప' కోసం చిత్తూరు యాస నేర్చుకుని మరీ ఆ సినిమాలో తాను చేసిన శ్రీవల్లి పాత్రకు డబ్బింగ్ చెప్పారు. ఇక ఈ మధ్యకాలంలో సంచలన విజయం సాధించిన 'యానిమల్'కి హిందీలోనూ, ఆ చిత్రం తెలుగు, కన్నడ అనువాదాలకూ తన పాత్రకు సొంత గొంతు వినిపించారు. ఇప్పుడు ఏకంగా ఐదు భాషలు మాట్లాడారు రష్మికా మందన్నా. తాను లీడ్ రోల్ చేస్తున్న 'గర్ల్ ఫ్రెండ్' చిత్రం టీజర్‌కి తెలుగు, తమిళ్, మలయాళం, కన్నడ హిందీ భాషల్లో డబ్బింగ్ చెప్పారు రష్మిక. ఆమె మలయాళం మాట్లాడటం ఇదే తొలిసారి. ఐదు భాషల్లోనూ రష్మిక డబ్బింగ్ చెప్పిన విధానం అద్భుతం అని కొనియాడుతున్నారు 'గర్ల్ ఫ్రెండ్' చిత్ర దర్శకుడు రాహుల్ రవీంద్రన్. ఈ నెల 5న రష్మిక పుట్టినరోజు సందర్భంగా ఐదు భాషల టీజర్ విడుదల కానుంది. మరి.. రష్మికతో టీజర్‌కి డబ్బింగ్ చెప్పించిన రాహుల్ పూర్తి పాత్రకు ఆయా భాషల్లో డబ్బింగ్ చెప్పిస్తారేమో చూడాలి.


● విజయ్ దేవరకొండ

నా ప్రేమ విఫలమైంది!

'నా ప్రేమ విఫలమైంది' అంటూ షాకింగ్ కామెంట్స్ చేశారు హీరో విజయ్ దేవరకొండ. ఆయన హీరోగా రూపొందిన 'ఫ్యామిలీ స్టార్' ఈ నెల 5న రిలీజవుతోంది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు విజయ్ దేవరకొండ. ''జీవితంలో అందరూ ఏదో ఒక సమయంలో రిలేషన్‌షిప్‌లో ఉంటారు. నా ఫ్రెండ్స్‌లో కూడా పలువురు ప్రేమలో పడ్డారు. అయితే కొన్ని కారణాల వల్ల భాగస్వామితో విడిపోయి, ఎంతో బాధ పడ్డారు. ఆ తర్వాత మరొకరి ప్రేమలో పడి సంతోషంగా ఉన్నారు. ఒకరితో బ్రేకప్ అయ్యాక మరొకరితో ప్రేమలో ఉండటం సహజమే. అయితే ఒకే టైమ్‌లో ఇద్దరితో లవ్‌లో ఉండటాన్ని ప్రోత్సహించను. మహిళలపై నాకు చాలా గౌరవం ఉంది. ఒకరితో ప్రేమలో ఉన్నప్పుడు వేరే అమ్మాయిని నా జీవితంలోకి ఆహ్వానించను. గతంలో నేనొక అమ్మాయిని ప్రేమించాను. కానీ, ఆ ప్రేమ విఫలమైంది'' అన్నారు. కొత్త దర్శకులకు చాన్స్ ఇవ్వడం గురించి ఇదే ఇంటర్వ్యూలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''ప్రస్తుతానికి కొత్త దర్శకులతో పని చేయాలనుకోవడం లేదు. అనుభవం లేకపోతే మేకింగ్, బడ్జెట్ మేనేజ్ చేయడం కష్టం. ఒక్క మూవీ చేసిన దర్శకుడితో అయినా పని చేస్తా. ఎందుకంటే వారికి మేకింగ్‌పై అవగాహన ఉంటుంది. అయితే వారి గత సినిమా హిట్టా? ఫట్టా అనేది మాత్రం ఆలోచించను'' అన్నారు.

వినోదాల నాట్యం

సూర్య తేజ ఏలే, మీనాక్షీ గోస్వామి జంటగా 'దొరసాని' మూవీ ఫేమ్ కేవీఆర్ మహేంద్ర దర్శకత్వం వహించిన చిత్రం 'భరతనాట్యం'. పాయల్ సరాఫ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి హీరో ఆనంద్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరై, ''క్రైమ్ కామెడీ నేపథ్యంలో రూపొందిన 'భరతనాట్యం' హిట్ అవ్వాలి'' అన్నారు. ''ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అన్నారు నటి, దర్శక–నిర్మాత జీవితా రాజశేఖర్. ''భరతనాట్యం' మూవీ కడుపుబ్బా నవ్వించేలా ఉంటుంది'' అన్నారు కేవీఆర్ మహేంద్ర, పాయల్ సరాఫ్. ''మహేంద్రగారు ఈ సినిమాని అద్భుతంగా తీశారు'' అన్నారు సూర్యతేజ ఏలే.


● మీనాక్షి, సూర్యతేజ

నాకు దేశీయుడే ఇష్టం

''విదేశీ యువకుడు వద్దు... నాకు దేశీ పార్టనరే కావాలి'' అంటున్నారు కృతీ సనన్. టబు, కరీనా కపూర్‌తో కలిసి కృతి నటించిన హిందీ చిత్రం 'క్రూ' ఇటీవల విడుదలైంది. ఈ చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కెనడియన్ నటుడు ర్యాన్ గోస్లింగ్ ప్రస్తావన రాగా, ''శ్వేత జాతీయులు హాట్‌గా ఉండొచ్చు. కానీ ఇప్పటివరకూ నేను ఏ విదేశీయుడికీ ఆకర్షితురాలిని కాలేదు. భారతీయుడితోనే డేటింగ్ చేస్తా'' అని చెప్పారు కృతి. 'ఇండియన్ ఎందుకు ఇష్టం అంటే' అంటూ అదే ఇంటర్వ్యూలో కృతీ సనన్ చెబుతూ – ''నాకు భారతీయులంటేనే ఇష్టం. దేశీ వ్యక్తితో డేటింగ్‌కి ఇష్టపడతాను. మరీ ముఖ్యంగా అతనికి హిందీ అర్థం కావాలి. ఎందుకంటే నేను ప్రతిసారీ ఇంగ్లిష్ మాట్లాడలేను. అలాగే ఇంగ్లిష్ పాటలకు డ్యాన్స్ చేయలేను. నాతో కలిసి పంజాబీ, హిందీ పాటలకు డ్యాన్స్ చేసే భారతీయుడు కావాలి. అలాంటి వ్యక్తితో డేటింగ్ నాకు అభ్యంతరం లేదు'' అన్నారు. ఇదిలా ఉంటే.. కృతీ సనన్ ఆల్రెడీ కబీర్ బహియా అనే వ్యక్తితో ప్రేమలో ఉన్నారనే టాక్ ఉంది. క్రికెటర్ ధోనీకి కబీర్ సన్నిహితుడని, కృతీకంటే కబీర్ పదేళ్లు చిన్నవాడని బాలీవుడ్ టాక్.


● కృతీ సనన్

వెల్‌కమ్ టు అంజనాద్రి

ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన 'హనుమాన్' సినిమా ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ చిత్రంలో తేజా సజ్జ, అమృతా అయ్యర్ జోడీగా నటించారు. కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన 'హనుమాన్' సంక్రాంతి కానుకగా జనవరి 12న రిలీజై, పాన్ ఇండియా స్థాయిలో భారీ హిట్ సాధించి, అద్భుతమైన వసూళ్లు రాబట్టింది. 'హనుమాన్'కి కొనసాగింపుగా 'జై హనుమాన్' వస్తుందని మేకర్స్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా స్పెషల్ గ్లింప్స్‌ని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. చుట్టూ అందమైన కొండలు.. మధ్యలో పెద్ద నది.. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని చూపిస్తూ 'వెల్‌కమ్ టు అంజనాద్రి 2.0' అని పేర్కొన్నారు. అలాగే 'హ్యాష్‌ట్యాగ్ జై హనుమాన్'తో పాటు 'హనుమాన్' మూవీ నుంచి 'రఘునందన..' అనే పాటను కూడా జత చేశారు. 'జై హనుమాన్'లో ఆంజనేయ స్వామి పాత్రను ఒక స్టార్ హీరో చేస్తారని ప్రశాంత్ వర్మ చెప్పారు. దాంతో ఆ స్టార్ హీరో ఎవరు? అనే ఆసక్తి అందరిలో నెలకొంది. 2025లో ఈ సినిమా రిలీజ్ కానుంది.


● 'జై హనుమాన్' పోస్టర్

పైలం పిలగా...


సాయి తేజ, పావని కరణం జంటగా ఆనంద్ గుర్రం దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పైలం పిలగా'. రామకృష్ణ బొద్దుల, ఎస్‌కే శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని గాయకుడు, సంగీత దర్శకుడు రామ్ మిర్యాల విడుదల చేశారు. ''వ్యవసాయం చేయలేక, వలస పోయి కార్పొరేట్ బానిస అవలేక.. ఉన్న ఊళ్లోనే వ్యాపారవేత్తగా మారి పది మందికి పని కల్పించి అంబానీలా కోట్లు సంపాదించాలని కలలు కనే ఓ మధ్య తరగతి యువకుడి కథే ఈ చిత్రం'' అన్నారు మేకర్స్.


● పావని, సాయితేజ

డే డ్రింకర్‌తో నో నో...

''పొద్దున్నే పొద్దున్నే నిద్ర లేవడం లేవడమే పెద్ద రూమర్ విన్నాను'' అంటూ సామాజిక మాధ్యమం ద్వారా స్పందించారు హాలీవుడ్ నటి సిడ్నీ స్వీనీ. జానీ డెప్ హీరోగా రూపొందనున్న తాజా చిత్రం 'డే డ్రింకర్'లో హీరోయిన్‌గా సిడ్నీ స్వీనీ నటించనున్నారనే ప్రచారం హాలీవుడ్‌లో జరుగుతోంది. ఈ వార్తను ఉద్దేశించే నో నో... అంటూ సిడ్నీ పై విధంగా స్పందించారు. అది మాత్రమే కాదు... ''రూమర్స్ వస్తుంటాయి. వాటిని వదిలేయండి. మీరు (ప్రేక్షకులు) మాత్రం థియేటర్‌కు వెళ్లి ఈ మధ్య విడుదలైన నా 'ఇమ్మాక్యులేట్' మూవీ చూడండి'' అన్నారు సిడ్నీ. మైఖేల్ మోహన్ దర్శకత్వంలో సిడ్నీ స్వీనీ లీడ్ రోల్‌లో సైకలాజికల్ హారర్ మూవీగా రూపొందిన 'ఇమ్మాక్యులేట్' మంచి టాక్‌తో దూసుకెళుతోంది.


● సిడ్నీ స్వీనీ


'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 9

సోమవారం 1-4-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మెరుపుల్లేని సన్‌రైజర్స్!

గుజరాత్ టైటాన్స్ చేతిలో ఓడిపోయిన హైదరాబాద్ జట్టు - 10లో



ఎక్కడైనా నగదు రహిత వైద్యం!

అత్యవసరాల్లో అనుకూలం.. షరతుల మేరకే క్లెయిమ్ ఆమోదం - 11లో



రిషి సునాక్ గెలవడం కష్టమే

బ్రిటన్‌లో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే రిషి సునాక్, ఆయన కేబినెట్‌లోని సగం మంత్రులు ఓడిపోతారని సర్వేలో తేలింది.

- వివరాలు 6లో



విదేశాలకు వెళ్లాలా? వద్దా?

విదేశాల్లో ఉన్నత విద్య చదివేందుకు ఆర్థిక సాయం అందించే ఓవర్సీస్ విదేశీ విద్యానిధి లబ్ధిదారుల ఖరారు పెండింగ్‌లో పడింది.

- వివరాలు 12లో



'200' గెలిచి చూపించండి

లోక్‌సభ ఎన్నికల్లో దమ్ముంటే 200 స్థానాల్లో గెలిచి చూపించాలని బీజేపీకి పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ సవాల్ విసిరారు.

- వివరాలు 6లో



దక్షిణాదిన మెరుగైన ఫలితాలు..

దక్షిణాదిన మెరుగైన ఫలితాలను సాధించడం ద్వారా ప్రస్తుతం ఉన్న సీట్లకు మరిన్ని సీట్లను జత చేసుకుంటామని గడ్కరీ చెప్పారు.

- వివరాలు 6లో

కాంగ్రెస్ తెచ్చిన కరువు

రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతతోనే పంటలు ఎండిపోయాయి

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మండిపాటు

వంద రోజుల్లోనే 200 మంది రైతుల ఆత్మహత్యలు.. ఉన్నట్టుండి నీళ్ల కొరత ఎందుకు వచ్చింది?

విద్యుత్ కోతలు ఎందుకు మొదలయ్యాయి?

రాష్ట్రం ఇంత దుర్భర పరిస్థితికి వస్తుందనుకోలేదు.. సీఎంకు ఏ పట్టింపూ లేదు.. ఆయనకు ఢిల్లీ యాత్రలే సరిపోతాయి

ఎండిన పంటల లెక్కలన్నీ తీయాలి..

ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలి.. ఇచ్చేదాకా ప్రభుత్వాన్ని వెంటాడుతాం..

వరికి బోనస్ కోసం రేపు జిల్లా కలెక్టర్లకు మెమోరాండాలు.. 6వ తేదీన అన్ని నియోజకవర్గాల్లో నిరసన దీక్షలు

జనగామ, సూర్యాపేట జిల్లాల్లో ఎండిన పంటలను పరిశీలించిన కేసీఆర్



సూర్యాపేట మండలంలోని ఎర్కారంలో ఎండిన వరి పొలాలను పరిశీలించి మహిళా రైతు సరోజనమ్మతో మాట్లాడుతున్న కేసీఆర్

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- రైతులకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ భరోసా
- ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చూడాలంటూ మొరపెట్టుకున్న రైతులు

2లో

ఇది పాలకుల అసమర్థత కాదా?

రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఎందుకు? కేసీఆర్ గడప దాటగానే కట్టేసినట్టుగా బంద్ అవుతదా? ఇది పాలకుల అసమర్థత కాదా? ఆలోచించాలి. మేం టెక్నోక్రాట్లను పెట్టి విద్యుత్ శాఖను నడిపాం. ఎలా బాగా నడపవచ్చో వారికి తెలుసు కాబట్టే సమర్థంగా నడిచింది. ఇప్పుడు ఐఏఎస్‌ను నియమించారు. వారికి విషయం పట్టుబడదు.. మంత్రులు పట్టించుకోరు. తీరిక లేదు. ఈ పాలకులకు రాజకీయాల కోసం తీరిక ఉందిగానీ.. ప్రజల కోసం తీరిక లేదు.

సీఎం ఎక్కడ పడుకున్నరు?

గత డిసెంబర్ 9వ తేదీనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తమన్నరు. డిసెంబర్ 9 పోయి ఎన్నాళ్లయింది? నాలుగు నెలలు అవుతోంది. ముఖ్యమంత్రి ఎక్కడున్నరు? ఎక్కడ పడుకున్నరు? మీరు దొంగ హామీలు ఇచ్చి తప్పించుకోలేరు. మేం వెంటపడి తరుముతాం. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేదాకా విడిచిపెట్టేది లేదు. కేవలం 1.8 శాతం ఓట్లతో గెలిచావు. మిమ్మల్ని తరిమికొడతాం. నిద్ర పోనియ్యం. వెంటనే రుణమాఫీ చేసి తీరాల్సిందే.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్రంలో అసమర్థ, తెలివిలేని, చేతగాని దద్దమ్మ ప్రభుత్వం కారణంగానే పంటలు ఎండిపోతున్నాయని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆరోపించారు. ఇది వచ్చిన కరువు కాదని, అసమర్థ కాంగ్రెస్ తెచ్చిన కరువని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.25వేల చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు పరిహారం ఇచ్చేదాకా ప్రభుత్వాన్ని మిగతా 2వ పేజీలో ▶



ఎన్టీపీసీ విద్యుత్ ఇక చాలు..!

2,400 మెగావాట్ల రెండో దశ ప్లాంట్ నిర్మాణానికి ఎన్టీపీసీతో ఒప్పందంపై సర్కారు విముఖత

- ఇప్పుడు ఒప్పందం చేసుకుంటే 5–8 ఏళ్ల తర్వాతే విద్యుత్ అందుబాటులోకి వచ్చేది
- ఆలోగా యూనిట్ విద్యుత్ ధర రూ. 8–9కి పెరిగే అవకాశం.. దానివల్ల రూ. వేల కోట్ల అనవసర భారం

సాక్షి, హైదరాబాద్: ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రామగుండంలో 2,400 (3x800) మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించతలపెట్టిన రెండో దశ తెలంగాణ సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకుంటే భవిష్యత్తులో అది రాష్ట్రానికి పెనుభారంగా మారే ప్రమాదముందని ప్రభుత్వం అభిప్రాయానికి వచ్చింది. ఈ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి 5–8 ఏళ్ల సమయం పట్టనుందని, దీని ద్వారా వచ్చే విద్యుత్ ధర యూనిట్‌కు రూ. 8–9 ఎగబాకుతుందని రాష్ట్ర ఇంధన శాఖ అంచనా వేసింది. బహిరంగ మార్కెట్లో దీనికన్నా తక్కువ ధరకే విద్యుత్ లభిస్తుండగా ఇంత భారీ ధరతో 25 ఏళ్లపాటు విద్యుత్ కొనుగోలు చేసేందుకు దీర్ఘకాలిక ఒప్పందం చేసుకుంటే రాష్ట్ర ప్రజలపై రూ. వేల కోట్ల అనవసర భారం పడుతుందని తేల్చింది. ఈ నేపథ్యంలో ఎన్టీపీసీతో రెండో దశ విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. సత్వరమే ఒప్పందం చేసుకోకుంటే ఇతర రాష్ట్రాలతో ఒప్పందం చేసుకొని విద్యుత్ కేంద్రం నిర్మిస్తామని ఎన్టీపీసీ ఇటీవల రాష్ట్రానికి అల్టిమేటం జారీ చేయడంతో దీనిపై సమీక్షించిన ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయానికి వచ్చింది.

విభజన చట్టం కింద ఏర్పాటు..: రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో విద్యుత్ కొరతను తీర్చడానికి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 4,000 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పునర్విభజన చట్టం–2014లో మిగతా 5వ పేజీలో ▶



భద్రత ఉంటేనే అమెరికా చదువులకు!

రక్షణ ఉన్న యూనివర్సిటీలపై తల్లిదండ్రుల దృష్టి.. కన్సల్టెంట్లు, వ్యక్తుల ద్వారా వాకబు చేయిస్తున్న వైనం

అక్కడి పరిస్థితులపై అవగాహన వచ్చాకే చేర్పించేందుకు సంసిద్ధత

అమెరికాలో భారత విద్యార్థులపై దాడుల నేపథ్యంలో కొత్త ట్రెండ్

సాక్షి, హైదరాబాద్: విదేశాలకు తమ పిల్లలను పంపే తల్లిదండ్రులు ఇప్పుడు అక్కడి భద్రతపై దృష్టి పెడుతున్నారు. ముఖ్యంగా అమెరికాలో డిగ్రీల కన్నా తమ పిల్లలు భద్రంగా ఉంటారా లేదా అనే ఎక్కువ మంది ఆలోచిస్తున్నారు. అగ్రరాజ్యంలో ఇటీవలికాలంలో భారతీయ విద్యార్థులపై వరుస దాడుల ఉదంతాల నేపథ్యంలో ఈ తరహా జాగ్రత్త కనిపిస్తోంది. ఈ క్రమంలో సవాలక్ష సందేహాలు తల్లిదండ్రుల నుంచి వస్తున్నాయని అమెరికా వర్సిటీల్లో మన విద్యార్థులు ప్రవేశాలు పొందడంలో సాయం చేసే కన్సల్టెంట్లు చెబుతున్నారు. చేర్చాలనుకునే వర్సిటీలో వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు కొందరు తల్లిదండ్రులు ముందుగా ఓ వ్యక్తిని మిగతా 5వ పేజీలో ▶

చౌక విద్యుత్తే కొందాం

- థర్మల్‌కు బదులు చౌకగా లభించే పునరుత్పాదక విద్యుత్‌పై సర్కారు దృష్టి
- కొత్త విధానం రూపకల్పనపై కసరత్తు.. ఉత్పత్తి వ్యయం తగ్గింపే లక్ష్యం -3లో



రేపు 'బండి' రైతుదీక్ష

- కల్లాల వద్ద రైతులతో కలిసి రాత్రి బస
- దీక్షకు మద్దతివ్వాలని రైతు, ప్రజా, ఉద్యమ సంఘాలకు ఎంపీ సంజయ్ పిలుపు

2లో

సర్కారుపై 'విరమణ' భారం!

వచ్చే మూడేళ్లలో పెద్ద సంఖ్యలో రిటైర్ కానున్న ప్రభుత్వ ఉద్యోగులు

వారికి తక్షణ బెనిఫిట్ల చెల్లింపు కోసం ఏటా రూ.3,500 కోట్ల వరకు అవసరం

ఈ భారం భరించలేమనే గతంలో రిటైర్మెంట్ వయసు మూడేళ్లు పెంపు

దానితో పదవీ విరమణలకు మూడేళ్ళు గ్యాప్.. ఈ ఏడాది నుంచి మళ్లీ మొదలు


ప్రస్తుత పరిస్థితుల్లో మెడికల్ బిల్లులు, సరెండర్ లీవ్‌లకు చెల్లింపులు కూడా కష్టమే!

ఇప్పటికే నాలుగు డీఏలు పెండింగ్.. ఎంపీ ఎన్నికలయ్యే సరికి ఐదో డీఏ గడువు

నిధుల సర్దుబాటు ఎలాగన్న దానిపై ఆర్థిక శాఖ తర్జనభర్జన

ఈ ఏడాది డిసెంబర్ వరకు రిటైర్ కానున్న 7,995 మంది ప్రభుత్వ ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మూడేళ్ల తర్వాత మొదలైన ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్లతో ఆర్థిక శాఖలో ఆందోళన మొదలైంది. పదవీ విరమణ చేసే ఉద్యోగులకు ఇవ్వాల్సిన తక్షణ బెనిఫిట్లను చెల్లించేందుకు ఏటా రూ.3,500 వేలకోట్ల భారం పడనుంది ఈ మేరకు నిధులను ఎలా సర్దుబాటు చేయాలన్న దానిపై ఆర్థిక శాఖ మల్లగుల్లాలు పడుతోంది. 2021లో అప్పటి బీఆర్ఎస్ సర్కారు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 ఏళ్ల నుంచి 61 ఏళ్లకు పెంచింది. దీంతో గత మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల (క్లాస్–4 ఉద్యోగులు మినహా) రిటైర్మెంట్లు జరగలేదు. తిరిగి ఈ ఏడాది మార్చి 31వ తేదీ నుంచి ఉద్యోగుల పదవీ విరమణలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా 7,995 మంది ఉద్యోగులు రిటైర్ కానున్నట్టు సమాచారం. వీరికి ప్రభుత్వం చెల్లించాల్సిన తక్షణ మిగతా 5వ పేజీలో ▶



వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు కక్షకు పరాకాష్ట



సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ కార్యదర్శి నిమ్మగడ్డ పక్కా టీడీపీ కార్యకర్త

ఎన్నికలకు ముందే బాబు నిజ స్వరూపాన్ని బయటపెట్టాడు

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి 3లో

న్యూస్‌రీల్

రూ.వేయి కోట్లు ఇస్తేనే 'గృహ' ప్రవేశం



రాష్ట్రంలో నిరుపేదల కోసం రూపుదిద్దుకున్న రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం మూడొంతులు సిద్ధమైనా ఇప్పటికిప్పుడు ప్రజలు నివాసం ఉండే పరిస్థితి కనిపించటం లేదు. అక్కడ మౌలిక సదుపాయాలు సిద్ధం కావాలంటే ఒకటి కాదు రెండు కాదు, ఏకంగా రూ.వేయి కోట్లు కావాలి.

- వివరాలు 12లో


త్వరలో రంగంలోకి 'ఆపద మిత్ర'లు



కేంద్రం తెచ్చిన ఆపద మిత్ర పథకంలో భాగంగా తెలంగాణ అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలోనూ 'ఆపద మిత్ర'లకు శిక్షణ ఇస్తున్నట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ, అగ్నిమాపక సేవల విభాగం డీజీ వై.నాగిరెడ్డి తెలిపారు. స్థానికుల్లో కొందరిని వలంటీర్లుగా గుర్తించి వారికి 'ఆపద మిత్ర'లుగా శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు.

- వివరాలు 12లో

రామయ్య కల్యాణం టికెట్ @ రూ.10 వేలు..



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో కొలువుదీరిన శ్రీసీతారాముల వారి కల్యాణాన్ని తిలకించేందుకు దేశం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివస్తుంటారు. ఇప్పటివరకు రూ.7,500 ఉభయదాతల టికెట్ అత్యధిక ధర కాగా.. ఈ ఏడాది తొలిసారి వీవీఐపీ పేరుతో రూ.10 వేల విలువైన టికెట్లను అందుబాటులో ఉంచనున్నారు.

- వివరాలు 12లో

పోస్టల్ బ్యాలెట్ ఓటేసేందుకు ప్రత్యేక సెలవు

లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం–12 దరఖాస్తులను శిక్షణ కార్యక్రమం తొలి రోజు సమర్పించాల్సి ఉంటుందని సీఈఓ వికాస్ రాజ్ సూచించారు. 3లో





ఆదివారం ఢిల్లీలో బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వానీ నివాసంలో ఆయనకు భారతరత్న పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీముర్ము. చిత్రంలో ప్రధాని నరేంద్రమోదీ

అద్వానీకి భారతరత్న ప్రదానం

బీజేపీ దిగ్గజ నేత నివాసంలో అందజేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 6లో

బీజేపీ దిగ్గజ నేత లాల్ కృష్ణ అద్వానీ 'భారత రత్న' పురస్కారం అందుకున్నారు. ఆదివారం ఢిల్లీలోని అద్వానీ నివాసంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దేశ అత్యున్నత పౌర పురస్కారాన్ని అందజేశారు.



ఢిల్లీలో ఇండియా కూటమి నిర్వహించిన సభలో కేజ్రీవాల్ సతీమణి సునీత, ఖర్గే, శరద్‌పవార్, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

కేజ్రీవాల్, సోరెన్ అరెస్టులే నిదర్శనం

మోదీ ప్రభుత్వంపై ఇండియా కూటమి మండిపాటు

- నియంతృత్వాన్ని తరిమేద్దామంటూ పిలుపు
- రాంలీలా మైదానంలో భారీ బల ప్రదర్శన

6లో

అవినీతిపరుల కూటమి

విపక్షాలపై విరుచుకుపడ్డ మోదీ

అవినీతిపరులను అవి కాపాడుతున్నాయి

అవినీతి అంతమే ఎన్డీఏ మంత్రం

మీరట్ ర్యాలీలో ప్రధాని



రేవంత్, మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన శ్రీహరి, కావ్య

కాంగ్రెస్‌లోకి కడియం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మున్షీల సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కుమార్తె కావ్య

- అనంతరం జహీరాబాద్ నేతలతో సీఎం భేటీ
- నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్

సాక్షి, హైదరాబాద్: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో తన కుమార్తె కావ్యతో కలిసి ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మిగతా 5వ పేజీలో ▶

కాంగ్రెస్ లోక్‌సభ ఇన్‌చార్జుల నియామకం

మంత్రులతో పాటు పార్టీ ముఖ్య నేతలకు బాధ్యతలు

ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంకు మినహాయింపు



సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు కైవసం చేసుకోవాలనుకుంటున్న అధికార కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచింది. త్వరలో ప్రారంభం కానున్న ఎన్నికల ప్రక్రియను సమన్వయం చేయడంతో పాటు విజయానికి అవసరమైన వ్యూహాలు అమలు చేసేందుకు గానూ లోక్‌సభ స్థానాల వారీగా ఇన్‌చార్జులను నియమించింది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఆమోదం మేరకు రాష్ట్ర మంత్రులతో పాటు కొందరు పార్టీ ముఖ్య నేతలకు ఈ బాధ్యతలు అప్పగిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పార్లమెంటు ఇన్‌చార్జులుగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

బీఆర్ఎస్‌కు భాగ్యనగరం కంచుకోట: కేటీఆర్


అంబర్‌పేట పటేల్‌నగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్న కేటీఆర్

అంబర్‌పేట: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సాయంత్రం అంబర్‌పేట నియోజకవర్గం పటేల్‌నగర్‌లో బీఆర్ఎస్ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి పద్మారావు గౌడ్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, మాగంటి గోపీనాథ్‌తో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ గులాబీ పార్టీకి నగరం కంచుకోట అని ఈ ఎన్నికల్లో పద్మారావు గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి అంబర్‌పేట ప్రజలు అన్నివేళల అండగా ఉన్నా ఈ ప్రాంతానికి మాత్రం ఆయన ఏమీ చేయలేదని విమర్శించారు. అయిదేళ్లు కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ఒక్క కొత్త ప్రాజెక్టు తెచ్చారా అని ప్రశ్నించారు.

కాంగ్రెస్, బీజేపీలకు అభ్యర్థులే లేరా?

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



పెద్దపల్లి రూరల్: 'వందేళ్లు దాటిన కాంగ్రెస్ పార్టీ, 60 ఏళ్లు దాటిందంటున్న బీజేపీలు రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్నయ్.. కానీ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి నిలిచే అభ్యర్థులే లేరా? మా బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఇళ్ల చుట్టూ తిరిగి ఎన్నికల్లో పోటీకి నిలుపుతున్నరు.. ఇదేనా రాజకీయం'అంటూ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సారథ్యంలో చేపట్టిన 36 గంటల రైతు నిరసన దీక్ష ముగింపు కార్యక్రమంలో ఆదివారం నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీఆర్ఎస్‌లో ఎంతో గౌరవం, అధికారం పొందిన ఓ 84 ఏళ్ల నవ యువకుడు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరాడంటూ కేశవరావును ఉద్దేశించి వ్యంగ్యంగా మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ పనైపోయిందంటూ ప్రచారం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెపుతారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే రైతులకు సాగునీరు, కరెంటు కష్టాలు మొదలయ్యాయని, ఇది ప్రభుత్వ వైఫల్యమేనని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఓ భాగం కుంగితే దాన్ని భూతద్దంలో చూపిస్తూ ప్రజలకు కట్టుకథలు చెప్పేందుకు యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు.

కమలానికి 10 నుంచి 12 సీట్లు ఖాయం

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ 10 నుంచి 12 సీట్లు కచ్చితంగా గెలుస్తుందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఎమ్మెల్యే రాజాసింగ్‌తో ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ సమావేశమయ్యారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం, బీజేపీ శాసనసభా పక్షం తరఫున చేపట్టాల్సిన కార్యక్రమాలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాజాసింగ్ బిజీగా ఉన్నారని అందుకే ఇక్కడ కొంత అందుబాటులో లేరని చెప్పారు.

సీఎంకు ఓటమి భయం పట్టుకుంది

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



పాలమూరు: సీఎం రేవంత్‌రెడ్డికి అభద్రతాభావం మొదలైందని, మాటి మాటికీ తనను గద్దె దించడానికి కుట్రలు చేస్తున్నారని అనడం కేవలం సానుభూతి కోసం ఆడే డ్రామా తప్ప మరొకటి కాదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, రేవంత్‌రెడ్డికి పార్లమెంట్ ఎన్నికల కంటే ముందే ఓటమి భయం పట్టుకుందని.. ఆ భయంతోనే కొత్త రాగం మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కేవలం కేసీఆర్‌పై ఉన్న వ్యతిరేకతతో ఓట్లు వేయడంతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి అసలు ప్రధాని అభ్యర్థి లేరని, వారి అభ్యర్థి ఎవరో వారికే క్లారిటీ లేదని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే పరిస్థితి ఏమాత్రం లేదని పేర్కొన్నారు. తనను సీఎం రేవంత్‌రెడ్డి దొర సాని అని మాట్లాడటం సరికాదని, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.


ధరావత్ తండాలో విలపిస్తున్న మహిళా రైతును ఓదారుస్తున్న కేసీఆర్


వెలుగుపల్లిలో రైతు ఆంగోతు హర్షతో మాట్లాడుతున్న కేసీఆర్


జనగామ జిల్లాలో పర్యటన ముగించుకుని తిరుమలగిరికి వెళ్తుండగా.. సూర్యాపేట జిల్లా ఈదులపర్రె తండా చెక్‌పోస్టు వద్ద ఎన్నికల అధికారులు కేసీఆర్ బస్సును తనిఖీ చేశారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

రైతులకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ భరోసా

జనగామ, సూర్యాపేట జిల్లాల్లో ఎండిపోయిన పంటల పరిశీలన


రైతులను పరామర్శించేందుకు ధరావత్ తండాకు వస్తున్న కేసీఆర్. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, పల్లా తదితరులు

జనగామ/ తుంగతుర్తి/ సూర్యాపేట రూరల్: ''పంట ఎండిపోయిందని అధైర్యపడొద్దు.. ధైర్యంగా ఉండండి.. అధికారులు వచ్చినప్పుడు నష్టం వివరాలను రాయించుకోండి. మేం అండగా ఉంటాం''అని రైతులకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు భరోసా ఇచ్చారు. ఎండిన పంట పొలాల పరిశీలనలో భాగంగా.. ఆదివారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం ధరావత్ తండాలో, సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం సింగారంతండా, మొండికుంట తండా, సూర్యాపేట మండలం ఎర్కారం గ్రామాల్లో పర్యటించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. ''యాసంగిలో ఎన్ని ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎంత పెట్టుబడి పెట్టారు. కరెంటు ఎన్ని గంటలు వస్తోంది. కాలువల ద్వారా నీళ్లొస్తున్నాయా. బోర్లలో నీళ్లు ఉన్నాయా.. రైతుబంధు వచ్చిందా..'' అని అడిగి తెలుసుకున్నారు.

నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయంటూ..

కేసీఆర్‌కు రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. పొట్టదశకు వచ్చిన పంట నీళ్లు లేక ఎండిపోయిందంటూ కన్నీళ్లుపెట్టుకున్నారు. జనగామ జిల్లా ధరావత్ తండాలో మహిళా రైతు అముగోతు సత్తెమ్మ మాట్లాడుతూ.. ''సారూ.. ఎనిమిది ఎకరాల్లో వరి వేసినం. రూ.3 లక్షలకుపైగా పెట్టుబడులు అయినయి. కాలువ నీళ్లు రాక.. రూ.1.80 లక్షలు ఖర్చుచేసి నాలుగు బోర్లు వేయించినం. వాటిలోనూ నీళ్లు సరిగా పడలేదు. పంటంతా ఎండిపోతోంది. ఇక మాకు దిక్కెవరు..'' అంటూ కన్నీరు పెట్టుకుంది. కుమారుడి పెళ్లి పెట్టుకున్నామని, అప్పులు కూడా పుట్టట్లేదని వాపోయింది. దీంతో ''బిడ్డా బాధపడకు.. మళ్లీ వచ్చేది మనమే. బాధలన్నీ తీరుతయి. అందాక రూ.5లక్షల చెక్కు పంపిస్తా.. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెచ్చిస్తరు'' అని భరోసా ఇచ్చారు.

సాగు నీళ్లు రావడం లేదంటూ..

తర్వాత కేసీఆర్ సూర్యాపేట జిల్లాలోని సింగారం, మొండికుంట తండాల్లో ఎండిపోయిన పొలాలను పరిశీలించారు. రైతులు దయ్యాల వెంకటనారాయణ, ధరావత్ సురేశ్, భూక్యా శ్రీను, ఆంగోతు హర్షా, గుగులోతు సుశీలతో మాట్లాడారు. ఈ రెండు తండాల్లో 250 ఎకరాల వరకు వరి వేయగా.. పూర్తిగా ఎండిపోయిందని రైతులు తెలిపారు. గత ఐదారేళ్లు ఎస్సారెస్పీ కాలువ ద్వారా గోదావరి జలాలు రావడంతో.. పంటలు బాగా పండాయన్నారు. ఈ యాసంగి సీజన్ మొదట్లో కాల్వల ద్వారా నీళ్లు వదలడంతో.. వరి వేశామని, కానీ ఇప్పుడు నీళ్లు రాక పంటలన్నీ ఎండిపోయాయని వాపోయారు. రోజులో 16 గంటలే కరెంట్ వస్తోందని.. అదికూడా 16 సార్లు ట్రిప్ అవుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేలా చూడాలని వేడుకున్నారు. అనంతరం కేసీఆర్ సూర్యాపేట మండలం ఎర్కారం చేరుకున్నారు.

మళ్లీ అప్పుల పాలవుతున్నాం..

ఎర్కారం గ్రామంలో రైతు కొదమగుండ్ల వెంకటయ్య, సరోజనమ్మ పొలాన్ని కేసీఆర్ పరిశీలించారు. ఈ సమయంలో సరోజనమ్మ కేసీఆర్ వద్దకు వచ్చి విలపించింది. ''మీరు సీఎంగా ఉన్నప్పుడు సాగునీళ్లు వచ్చేవి. సంతోషంగా ఉన్నాం. ఇప్పుడు కష్టాలు మొదలయ్యాయి. కాలువ నీళ్లు రావట్లేదు. ఐదెకరాల్లో వరి ఎండింది. మళ్లీ అప్పుల పాలు అవుతున్నాం'' అని ఆవేదన వ్యక్తం చేసింది.

రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతా

రైతుల గోడు ఆలకించిన కేసీఆర్.. వారికి ధైర్యం చెప్పారు. ఏ రైతును పలకరించినా కన్నీరే వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టకాలంలో అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తానని.. ఎండిన వరి పొలాలకు ఎకరానికి రూ.25 వేలు నష్ట పరిహారం వచ్చేలా చేస్తానని చెప్పారు. ఎన్ని కష్టాలెదురైనా మళ్లీ 24 గంటల కరెంట్‌ను సాధించుకుందామన్నారు.

కాంగ్రెస్ తెచ్చిన కరువు

▶ మొదటి పేజీ తరువాయి

వెంటాడి, వేటాడుతామన్నారు. ధర్నాలు చేస్తామని.. అవసరమైతే ఎక్కడికక్కడ మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను నిలదీస్తామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు వరికి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై ఏప్రిల్ 2, 6 తేదీల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు. ఆదివారం జనగామ, సూర్యాపేట జిల్లాల్లో ఎండిపోయిన పంట పొలాలను కేసీఆర్ పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. అనంతరం సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడారు. ప్రెస్‌మీట్‌లో కేసీఆర్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

''జనగామ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లో ఎండిపోయిన పంటలను పరిశీలించా. చాలాచోట్ల రైతులు పెట్టుబడి పెట్టి నష్టపోయామని కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రభుత్వాన్ని డిమాండ్ చేసి పరిహారం ఇప్పించాలని కోరారు. ప్రభుత్వం నీళ్లు ఇస్తామంటేనే నమ్మి పంటలు వేశామని.. మొదటే ఇవ్వబోమని చెప్పి ఉంటే వేసుకునే వాళ్లం కాదని వాపోయారు. ప్రభుత్వం మొదట ఇచ్చి తర్వాత బంద్ చేసి నష్టం చేకూర్చిందని బాధపడ్డారు. మేం ఏడెనిమిదేళ్లలో వ్యవసాయ స్థిరీకరణతో, స్పష్టమైన విధానాలతో రైతులు బాగుపడేలా చేశాం. ఇన్నాళ్లూ ధాన్యం ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన తెలంగాణలో వంద రోజుల్లోనే దుర్భరమైన పరిస్థితిని చూస్తామనుకోలేదు. రైతులు ఇంతగా ఏడ్చే పరిస్థితి వస్తుందనుకోలేదు. వంద రోజుల్లో 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇలాంటి దుస్థితి రాష్ట్రంలో వస్తుందని కలలో కూడా అనుకోలేదు.

విద్యుత్ సరఫరా అస్తవ్యస్తం..

మేం రూ.35వేల కోట్లు వెచ్చించి అగ్రగామిగా నిలిపిన విద్యుత్ రంగం.. వంద రోజుల్లో ఇంత అస్తవ్యస్తంగా ఎందుకు మారింది? ఉన్న వ్యవస్థను ఉన్నట్టు నడిపించలేని ఈ అసమర్థత ఏందీ? ఉన్న దాన్ని ఉన్నట్టు నడిపించే తెలివిలేకపోతే ఎలా? ఇప్పుడు రాష్ట్రాన్ని పాలిస్తున్న పార్టీ, ప్రభుత్వ అసమర్థత, తెలివి తక్కువతనం, అవగాహన రాహిత్యమే. మళ్లీ జనరేటర్లు, ఇన్వర్టర్లు, కన్వర్టర్లు వస్తున్నయ్. మళ్లీ స్టెబిలైజర్లు కొనుక్కునే పరిస్థితి వచ్చింది. మేం పవర్‌గ్రిడ్‌కు అనుసంధానించి.. కరెంట్ సరఫరాలో ఇబ్బంది ఏర్పడిన సమయంలో దేశంలో ఎక్కడి నుంచైనా విద్యుత్ తీసుకునే విధంగా చేశాం. 7వేల మెగావాట్ల ఇన్‌స్టాల్డ్ కెపాసిటీని 18 వేల మెగావాట్లకు పెంచాం. అదనంగా 1,600 రామగుండంలో, 4 వేలు యాదాద్రి థర్మల్ స్టేషన్‌లో కలిపి 5,600 మెగావాట్లు అదనంగా వచ్చే పరిస్థితి కల్పించాం. ఈ ప్రభుత్వం యాదాద్రి ప్లాంట్‌ను పట్టించుకోవడం లేదు. పట్టించుకుని ఉంటే రెండు యూనిట్ల ద్వారా సొంతంగా మరో 1,500 మెగావాట్లు వచ్చేది. ఇంత ఉజ్వలమైన పవర్ సిస్టం ఉన్నా ఎందుకు ఇబ్బంది అవుతోంది?

అవసరమైనప్పుడు కరెంటు కొనాలె..

రైతుల పంటలను కాపాడేందుకు అవసరమైతే ప్రభుత్వం అప్పులు చేయాలె. పీక్ అవర్స్‌లో ఎంత షార్టేజ్ ఉంటే అంత కరెంటు కొనాలి. రైతులకు ఇవ్వాలి. మేం అదే చేశాం. అందుకే ఆనాడు రెప్పపాటు కూడా కరెంట్ పోలేదు. ప్రభుత్వం అవసరమైనంత కొంటలేదు. అందుకే కరెంటు వస్తలేదు. ఎనిమిదేళ్లుగా కాలిపోని మోటార్లు ఇప్పుడు కాలిపోతున్నాయని రైతులు చెప్పారు. అయినా సర్కారుకు చీమ కుట్టినట్టు లేదు. మేం రైతుల గురించి రూ.20, 30 వేల కోట్లు అయినా పెట్టాం.

పంటలు ఎందుకు ఎండుతున్నాయి

రాష్ట్రంలో పంటలు ఎండిపోని జిల్లానే లేదు. ఇప్పటికే 15 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే 3.5 లక్షల నుంచి 4 లక్షల ఎకరాల్లో పంట ఎండింది. ప్రతి ఊళ్లో 200 నుంచి 400 ఎకరాల దాకా ఎండిపోతోంది. సాగర్ ఆయకట్టు ఎందుకు ఎండుతోంది? ఈ రోజు కూడా సాగర్‌లో మినిమమ్ డ్రాడౌన్ లెవల్ (ఎండీడీఎల్) కంటే పైన 7 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. కింద మరో ఏడెనిమిది టీఎంసీలు వాడుకోవచ్చు. అంటే 14, 15 టీఎంసీల నీళ్లు వాడుకునే పరిస్థితి ఉంది. కానీ తెలివి హీనంగా సాగర్ ప్రాజెక్టును కృష్ణాబోర్డుకు అప్పగించి, సాగర్ కట్టమీదకు వెళ్లలేని దుస్థితిని తీసుకొచ్చారు.

ప్రభుత్వం మెడలు వంచుతాం

ఖమ్మం, మహబూబ్‌నగర్, ఇతర జిల్లాల్లో వడగళ్ల వానతో దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.10 వేల చొప్పున నష్టపరిహారం ఇచ్చాం. రూ.500 కోట్లను రైతులకు అందించాం. అప్పుడు అది సరిపోదని, రూ.20 వేల చొప్పున ఇవ్వాలని కాంగ్రెస్ వాళ్లు డిమాండ్ చేశారు. ఇప్పుడు అదే వడగళ్ల వాన పడి నష్టపోతే అడిగే దిక్కులేదు. అకాల వర్షాలతో లక్ష ఎకరాల్లో పంట దెబ్బతిన్నా.. మాట్లాడేవాళ్లు లేరు. మంత్రి పోడు, ఎమ్మెల్యే పోడు.. ఎంపీలు పోరు, అధికారుల బృందాలు పోవు.. దొంగల్లా ముఖం చాటేస్తారు. ముఖ్యమంత్రికి పట్టింపే లేదు. ఆయనకు ఢిల్లీ యాత్రలే సరిపోతాయి.

ఎకరాకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలి..

ప్రభుత్వ అసమర్థత వల్లే పంటలు ఎండిపోయాయి కాబట్టి రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి. ఎకరాకు రూ.25వేల చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలి. పరిహారం ఇచ్చే దాకా వేటాడుతాం.. వెంటాడుతాం.. ధర్నాలు చేస్తాం. ఎక్కడికక్కడ మంత్రులు, మీ ఎమ్మెల్యేలను నిలదీస్తాం. బీఆర్ఎస్ దళాలు తిరుగుతున్నాయి. కచ్చితంగా లెక్కలు తీస్తాం. మిమ్మల్ని బజారుకీడుస్తాం. హామీ ఇచ్చినట్టుగా వరికి రూ.500 బోనస్ కూడా ఇవ్వాలి. ఇందుకోసం కోసం ఏప్రిల్ 2న కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తాం. హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యేలు, మేము ఇస్తాం. 6వ తేదీన నియోజకవర్గాల్లో నిరసన దీక్షలు చేస్తాం

ఆత్మహత్యలు చేసుకోవద్దు

నేను రైతులకు చేతులెత్తి దండం పెడుతున్నా.. రైతులు ఎట్టి పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకోవద్దు. మీకోసం బీఆర్ఎస్ పార్టీ రణరంగమైనా సృష్టిస్తది. ప్రధాన ప్రతిపక్షంగా మీరు మాకు బాధ్యత ఇచ్చారు. మీ తరఫున పోరాడుతాం. హక్కులను సాధించుకుందాం..'' అని కేసీఆర్ విజ్ఞప్తి చేశారు.

కాళేశ్వరంపై తప్పుడు ఆరోపణలు

చిల్లర రాజకీయాలతో కాళేశ్వరంలోని నీళ్లను సముద్రంలోకి వదిలేస్తున్నారు. బ్యారేజీల్లో నీటిని వదిలిపెట్టి, సీపేజీలో పోయే నీటిని ఫొటోలు తీసి, వీడియోలు తీసి, ప్రాజెక్టు ఖతం అయిపోయిందని తప్పుడు ప్రచారం చేశారు. నిన్న యూపీలోనో, బిహార్‌లోనో బ్రిడ్జి కూలిపోయింది. ప్రపంచం మునిగిపోయిందా? మీ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి మాట్లాడుతున్నరు. నాగార్జునసాగర్ కుడివైపు కుంగలేదా? పునరుద్ధరించలేదా? కడెం ప్రాజెక్టు కొట్టుకుపోలేదా? అమెరికాలో ఓ డ్యాం 4 సార్లు కొట్టుకుపోయింది. వారు విడిచిపెట్టారా? కొందరు ఇంజనీర్ల తప్పువల్లనో, అనుకోకుండా ఏర్పడిన సమస్యతోనో, జియాలజీ సమస్యతోనో ఓ పిల్లర్ కింద ఇసుక కొట్టుకపోతే.. ప్రపంచం బద్దలైనట్టు చిల్లర కథలు చెప్పి నీళ్లివ్వడం లేదు. మరి సమ్మక్క బ్యారేజీకి ఏమైంది. దేవాదుల నుంచి ఎందుకు పంప్ చేయట్లేదు.

ఒక్కసారిగా నీళ్ల కొరత ఎందుకు వచ్చింది?

ప్రపంచ దేశాలు కొనియాడిన మిషన్ భగీరథ ఉండగా ఎందుకు మంచి నీళ్ల కొరత వచ్చింది? ఐదేళ్లు బ్రహ్మాండంగా నడిచిన పథకంలో ఎందుకు లోపం వస్తుంది? ఎందుకు ఇప్పుడు బిందెలు ప్రత్యక్షమవుతున్నయ్? ఎందుకు నీటి సమస్య వస్తోంది. హైదరాబాద్ సిటీలో ట్యాంకర్లు పెట్టాల్సిన దుస్థితి ఎందుకు దాపురిస్తుంది? ఇందుకు కారణం సీఎం, మంత్రులే. రాష్ట్రంలో ఏం జరుగుతోందనే సమీక్ష చేయడం లేదు. వారికి పట్టింపు లేదు. పథకాన్ని వాడుకునే తెలివి లేదు. ఏదైనా పాడైతే ఇప్పుడు 15 రోజులైనా పట్టించుకోవడం లేదు. మిషన్ భగీరథ నీళ్లు సరిగా రావాలంటే నాణ్యమైన విద్యుత్ 24 గంటల సరఫరా ఉండాలి. దానిపై దృష్టి లేదు. జూన్ దాకా అంటే మరో మూడు నెలల వరకు వానలు పడే అవకాశం లేదు. ఇంకా నీటి సమస్య తీవ్రం కాకుండా మిషన్ భగీరథను పునరుద్ధరించాలి.

కేసీఆర్ మాట్లాడుతుండగా నిలిచిన కరెంట్!

విద్యుత్ శాఖకు సంబంధం లేదన్న ఎస్ఈ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతున్న సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో 'రాష్ట్రంలో పరిస్థితి ఇలా తయారైంది..' అని కేసీఆర్ ఎద్దేవా చేశారు. దీనిపై సూర్యాపేట విద్యుత్ ఎస్ఈ వివరణ ఇచ్చారు. సూర్యాపేటలో బీఆర్ఎస్ కార్యక్రమానికి టీఎస్ఎస్‌పీడీఎల్ నుంచి విద్యుత్ సరఫరా లేదని.. జనరేటర్లు పెట్టుకుని ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారని స్పష్టం చేశారు. విద్యుత్ శాఖ తరఫున అంతరాయం అనేది పూర్తి అవాస్తవమన్నారు. మైక్ కనెక్షన్‌లో సమస్యతో కేసీఆర్ మాట్లాడుతున్నపుడు అంతరాయం ఏర్పడి ఉంటుందన్నారు.

మోదీ మళ్లీ ప్రధాని కావడం ఖాయం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సనత్‌నగర్: బీజేపీకి గల్లీగల్లీలో బలమైన నాయకత్వం ఉందని కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని బేగంపేట, భగవంతాపూర్, ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీ, బ్రాహ్మణవాడీ బస్తీలతో పాటు బేగంపేట ఆర్యసమాజ్ భవన్ ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోదీకి ఓటు వేయాలని దేశమంతా నిర్ణయించుకుందన్నారు. మోదీ మూడోసారి ప్రధాని అవడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పాలనలో పారిశ్రామికవేత్తలు కరెంట్ కోసం ధర్నాలు చేసేవారని, 6 గంటల కంటే ఎక్కువగా కరెంట్ వాడితే పరిశ్రమలు మూసివేస్తామని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే మోదీ వచ్చాక విద్యుత్ కోతలు లేని దేశం ఆవిష్కృతమైందన్నారు. గత పదేళ్లుగా దేశంలో మత కలహాలు, బాంబు పేలుళ్లు, కర్ఫ్యూలు లేవన్నారు. అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి చెందుతోందన్నారు. బేగంపేట, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లతో పాటు చర్లపల్లి టెర్మినల్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. మోదీ పాలనతో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ పాలన ఎలా ఉందో బేరీజు వేయాలన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే మోసపోవుడే!

అసలు ఆ పార్టీకి ఎందుకు ఓటెయ్యాలి?

- ఇచ్చిన హామీలు అమలయ్యాయా?
- మాజీమంత్రి హరీశ్‌రావు సూటి ప్రశ్నలు
- కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లాలు రద్దవుతాయని వ్యాఖ్య


కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం లింగంపల్లిలో ఎండిన పంటలను పరిశీలిస్తున్న హరీశ్‌రావు, పోచారం, గోవర్ధన్, సురేందర్ తదితరులు

సాక్షి, కామారెడ్డి: ''ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై తక్కువ రోజుల్లోనే ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. దీంతో లీకులు, ఫేక్ న్యూస్‌లు ప్రచారం చేస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నరు. పొరపాటున ఈసారి కూడా వాళ్లకు ఓటేస్తే మోసపోవుడే. రూ.2 లక్షలు రుణం మాఫీ చేయకున్నా, రూ.5 వందల బోనస్ ఇవ్వకున్నా, మహిళలకు రూ. 2,500 జమ చేయకున్నా తమకు ప్రజలు ఓట్లేశారని తప్పించుకునే ప్రమాదం ఉంది' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో కామారెడ్డి, లింగంపేట మండల కేంద్రంలో ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాల్లో హరీశ్‌రావు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీల్లో నాలుగు కూడా పూర్తి చేయని సీఎం రేవంత్‌రెడ్డికి ఓట్లు అడిగే హక్కులేదన్నారు.

కడియం, దానం రాజీనామా చేయాలి

బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి, దానం నాగేందర్ తమ పదవులకు వెంటనే రాజీనామా చేయాలని హరీశ్ డిమాండ్ చేశారు. నాయకులు పోయినంత మాత్రాన పార్టీకి నష్టం లేదని, కొత్త నాయకత్వాన్ని తయారు చేసుకుంటామన్న ధీమాను వ్యక్తం చేశారు. నాలుగు రోజులైతే కాంగ్రెస్ ప్రభుత్వంలో వాళ్లలో వాళ్లు తన్నుకుంటారన్నారు.

సగం జిల్లాలు తగ్గిస్తడట

పరిపాలనా సౌలభ్యం కోసం కేసీఆర్ కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారని, జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి 17 జిల్లాలు సరిపోతాయని అంటుండని, ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే మీ జిల్లా రద్దవుతుందని ఆయన హెచ్చరించారు. కన్నతల్లి లాంటి పార్టీకి ద్రోహం చేసిన బీబీ పాటిల్‌ను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కాగా, లింగంపల్లిలో ఎండిపోయిన వరి పంటను హరీశ్‌రావు పరిశీలించారు. ఎండిపోయిన పంటలకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కరువుతో కేసీఆర్ రాజకీయాలు

మంత్రి తుమ్మల ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: కరువు పరిస్థితులను రాజకీయం కోసం వాడుకుంటారా? అని మాజీ సీఎం కేసీఆర్‌ను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిలదీశారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితులను ప్రభుత్వ వైఫల్యంగా చూపాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. నీటి నిర్వహణపై దృష్టి పెట్టకుండా, మంచినీటి కోసం పక్క రాష్ట్రాలను అభ్యర్థించాల్సిన అథోగతికి మీరు కారణం కాదా? అని ప్రశ్నించారు. కేవలం రైతుబంధు పేరిట మిగతా విత్తన సబ్సిడీ, ఇన్‌పుట్ సబ్సిడీ, యాంత్రీకరణ పథకం, డ్రిప్ స్ప్రింకర్లపై సబ్సిడీలన్నీ ఎత్తేసి రైతుల్ని కోలుకోలేనివిధంగా దెబ్బతీసింది మీరు కాదా? అని ప్రశ్నించారు. తొమ్మిదేళ్ల పరిపాలనలో ఏనాడైనా ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన ఒక్క రైతునైనా ఆదుకున్నారా? అని నిలదీశారు. కనీసం గత ఎన్నికల ముందు ప్రకటించిన రూ.10,000 అయినా నష్టపోయిన రైతులందరికి ఇచ్చారా? కేవలం మొదటి విడతగా రూ.150 కోట్లు మంజూరు చేసి, రెండో విడతగా ఏప్రిల్‌లో కురిసిన వడగళ్ల వానలకు నష్టపోయిన రైతులకు జీవో ఇచ్చి డబ్బు విడుదల చేయలేదని గుర్తు చేశారు. పంటల బీమా పథకాన్ని ఎత్తేసి, అంతకన్నా గొప్ప పథకాన్ని తెస్తామని ప్రగల్భాలు పలికి, రైతుల నోట్లో మట్టి కొట్టింది కేసీఆర్ కాదా? అని తుమ్మల నిలదీశారు.

పొలం బాట ఇప్పుడు గుర్తుకొచ్చిందా?: అద్దంకి



సాక్షి, హైదరాబాద్: అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను మర్చిపోయిన కేసీఆర్‌కు విపక్షంలోకి వెళ్లిన తర్వాత పొలం బాట గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ విమర్శించారు. అధికారం కోల్పోయిన మూడు నెలల కాలంలోనే రాజకీయంగా పతనమైన తర్వాత కేసీఆర్ జనంలోకి వచ్చి ఉపయోగం లేదని వ్యాఖ్యానించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'తాను అధికారంలో ఉన్నప్పుడు రైతులు ఇబ్బందుల్లో ఉన్నా కేసీఆర్ పట్టించుకోలేదు. నాడు ధాన్యం కొనకపోవడంతో కుప్పలపైనే మొలకెత్తిన సందర్భాలున్నాయి. ఇప్పుడు రైతుల కోసం మొసలి కన్నీరు కారుస్తున్నారు'అని ఎద్దేవా చేశారు.

ఇక్కడ బీజేపీకి ఒక్క ఎంపీ సీటూ రావొద్దు

- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పిలుపు
- బీజేపీలో ఉంటే నీతిపరులు, లేదంటే అవినీతిపరులవుతున్నారని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ ప్రమాదం ముంచుకొస్తోందని... మతోన్మాద వాతావరణాన్ని సృష్టించేందుకు కుట్రలు జరుగుతున్నాయని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ తెలంగాణలో ఒక్క ఎంపీ స్థానం గెలవకుండా చూడాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గం సమావేశం జరగ్గా ఆదివారం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు ఎంబీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. బీజేపీని ఈ ఎన్నికల్లో గద్దెదించడం తక్షణ రాజకీయ కర్తవ్యమన్నారు. బీజేపీలో ఉంటే నీతిపరులు లేదంటే అవినీతిపరులు అన్నట్టుగా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. 2019లో వచ్చిన ఫలితాలు రావేమోననే భయంతోనే బీజేపీ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేసిందని ఆరోపించారు.

ఫోన్‌ట్యాపింగ్ అప్రజాస్వామికం: ఎస్ వీరయ్య

ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం అప్రజాస్వామికమని, వ్యక్తిగత గోప్యతకు ఇది భంగం కలిగించడమేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య పేర్కొన్నారు. రాష్ట్రంలో వేసవితో పాటు కరువు ప్రారంభమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎకరా కు రూ. 20 వేలు నష్టపరిహారం చెల్లించాలని కోరిన వీరయ్య.. మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామంటూ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో సీపీఐ వైఖరిని ప్రకటించాలని ఆయన కోరారు. అవసరమైతే సీపీఐ, సీపీఎం సంప్రదించుకుంటాయని, వర్తమాన రాజకీయ పరిణామాలను చూసి ఎవరికి మద్దతివ్వాలో త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని వీరయ్య వెల్లడించారు.

రేపు 'బండి' రైతుదీక్ష

కల్లాల వద్ద రైతులతో కలిసి రాత్రి బస



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ రైతుల కోసం మరోమారు జంగ్‌సైరన్ మోగించారు. అకాలవర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకు పరిహారం అందించలేదని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతో సాగునీరందక పంటలు ఎండిపోతున్నా పట్టించుకోలేదని పంటల బీమాపథకాన్ని అమలు చేయలేదని, ఎన్నికల్లో రైతులకిచ్చిన ఏ ఒక్కహామీ కూడా అమలు చేయలేదని ఆరోపిస్తూ 'రైతుదీక్ష' పేరుతో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ఆయన సిద్ధమయ్యారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ వద్ద బండి సంజయ్ ఆధ్వర్యంలో 'రైతు దీక్ష' చేయనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించే ఈ దీక్షలో సంజయ్ సహా పలువురు బీజేపీ నేతలు పాల్గొంటారు. వడ్ల కల్లాల వద్ద రైతులు పడుతున్న బాధలను, తాలు, తేమ, తరుగు పేరుతో రైతులు ఏ విధంగా నష్టపోతున్నారనే విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేసేందుకు అవసరమైతే వడ్లకల్లాల వద్ద బండి సంజయ్ బస చేయాలని యోచిస్తున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... రైతుల పక్షాన మంగళవారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో చేపట్టే 'దీక్షకు అన్ని వర్గాలు మద్దతివ్వాలని కోరారు. కాగా, సోమవారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గపరిధిలోని అన్ని మండలాల్లో అధికారులకు ఆయన వినతిపత్రాలు అందించనున్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవే

''పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలి. తక్షణమే వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించాలి. ఇతర పంటలకు సైతం బోనస్ అందించాలి. తాలు, తేమ, తరుగుతో సంబంధం లేకుండా వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ఇందిరమ్మ రైతు భరోసా కింద రైతులతో పాటు కౌలు రైతులుకు ఎకరాకు రూ.15 వేలు, భూమి లేని వ్యవసాయ కూలీలలకు రూ.12 వేలు ఇవ్వాలి. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని తక్షణమే అమలు చేయాలి. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పంటలకు అనుసంధానం చేయాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు కమిషన్‌ను ఏర్పాటు చేయాలి.''

క్లుప్తంగా...

పోస్టల్ బ్యాలెట్ ఓటేసేందుకు ప్రత్యేక సెలవు

- సీఈఓ వికాస్‌రాజ్

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోసం ఫారం–12 దరఖాస్తులను శిక్షణ కార్యక్రమం తొలి రోజు సమర్పించాల్సి ఉంటుందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్ రాజ్ సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసేందుకు ఎన్నికల సిబ్బందికి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఒక రోజు స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను మంజూరు చేసిందని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, సెక్టోరల్ అధికారులు, రూట్ అధికారులు, పోలీసు సిబ్బంది, డ్రైవర్లు, అత్యవసర సేవల ఉద్యోగులు, జర్నలిస్టులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయానికి అర్హులని వివరించారు. 85 ఏళ్లపైబడిన వృద్ధులు, శారీరక వికలాంగులు పోస్టల్‌బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఇంటి నుంచే ఓటేసే సదుపాయం కల్పిస్తామన్నారు. ఎన్నికల ఏర్పాట్లపై ఆదివారం ఆయన జిల్లా కలెక్టర్లు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటును ఎక్కడ వేయాలో ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తామన్నారు.

దేశానికే ఆదర్శం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- అసెంబ్లీ, ఎంపీ టికెట్లలో బీసీలకు పెద్దపీట వేశారు
- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



కాచిగూడ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు పెద్దపీట వేస్తోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 11 ఎంపీ సీట్లు ఇచ్చారని, అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో 60 సీట్లు కేటాయించి దేశానికే ఆదర్శవంతంగా నిలిచారని కృష్ణయ్య కొనియాడారు. జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సభలో ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీసీలకు జనాభా ప్రాతిపదికన ఎంపీ టికెట్లు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేశాయని, ఏ పార్టీ కూడా బీసీలకు సరైన న్యాయం చేయదని అన్నారు. బీసీలకు భిక్షం అవసరం లేదని, రాజ్యాంగబద్ధమైన హక్కులు కావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నేతలు నీలం వెంకటేశ్, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను చూసి నేర్చుకోవాలి

తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు



నిజామాబాద్ నాగారం: మెజారిటీ రాజకీయ పార్టీలు డబ్బున్న మారాజులు, పార్టీలు మారే ఆయా రాం గయారాంలకు పెద్ద పీట వేస్తూ.. సామాజికంగా వెనకబడిన తరగతులను మోసం చేస్తున్నా యని తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు విమర్శించారు. అలాంటి పార్టీలు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. ఆయన ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో అగ్రవర్ణాలు, వారసత్వ రాజ కీయాలకు పెద్దపీట వేస్తుంటే.. పక్కనున్న ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు సమన్యాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు.

శారీరకంగా హింసించి.. వివాహితపై అఘాయిత్యం

నల్లబెల్లి: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో ఓ వివాహితపై అత్యంత క్రూరంగా సాగిన కీచకపర్వం ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలిపై నిందితుడు అత్యాచారానికి పాల్పడటమే కాకుండా అత్యంత హేయంగా ఆమె రహస్య భాగాలను కత్తిరించిన దారుణ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రేలకుంటకు చెందిన దివ్యాంగుడికి ములుగు జిల్లా పట్వారిపల్లెకు చెందిన ఓ యువతితో రెండేళ్ల క్రితం వివాహమైంది. పట్వారిపల్లె సమీప నర్సింగపురం గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి మూడు రోజుల క్రితం రేలకుంటకు వచ్చి దివ్యాంగుడి ఇంట్లోకి చొరబడి అతని భార్యపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె ప్రతిఘటించేందుకు ప్రయత్నిస్తుండగా రహస్య భాగాలను చాకుతో కత్తిరించి పైశాచిక ఆనందం పొందాడు. ఆపై అక్కడి నుంచి పరారయ్యాడు. రక్త స్రావంతో ఇంట్లో పడిఉన్న ఆమెను కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. బాధితురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

ఐదేళ్ల తర్వాత.. అవే అవస్థలు

అవ్వాతాతలకు పెన్షన్ కష్టాలు తెచ్చిపెట్టిన బాబు బృందం

- వలంటీర్లపై నిమ్మగడ్డ సంస్థ ఫిర్యాదుతో ఈసీ ఆంక్షలు
- 2019 ఆగస్టులో వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుతో 55 నెలలుగా ఇళ్ల వద్దే పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు
- ప్రతి నెలా క్రమం తప్పకుండా టంచన్‌గా ఉదయాన్నే చేతికి డబ్బులు
- చంద్రబాబు హయాంలో కార్యాలయాల చుట్టూ పడిగాపులే

సాక్షి, అమరావతి: నడవలేని స్థితిలో ఉన్న లక్షల మంది అవ్వాతాతలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధుల బారినపడ్డ ఫించన్‌దారులకు చంద్రబాబు బృందం మళ్లీ ఐదేళ్ల తర్వాత అవే అవస్థలు తెచ్చిపెట్టింది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఐదేళ్లుగా ప్రతి నెలా ఇంటి వద్దే ఫించన్లు పొందుతున్న వారంతా ఇప్పుడు చంద్రబాబు హయాంలో మాదిరిగానే కార్యాలయాలకు చేరుకుని పెన్షన్లు డబ్బులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కనుసన్నల మేరకు నడుచుకునే రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ నేతృత్వంలోని సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంస్థ ఫిర్యాదుతో ఈసీ ఆదేశాల మేరకు కోడ్ ముగిసేదాకా ఫించన్ల పంపిణీ నుంచి వల్లంటీర్లను పక్కనపెడుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నాడు పండుటాకుల పడిగాపులు..

చంద్రబాబు అధికారంలో ఉండగా ఏ గ్రామంలో ఎప్పుడు పింఛన్ల పంపిణీ జరుగుతుందో అక్కడ లబ్ధిదారులకే తెలియని దుస్థితి నెలకొంది. నడవలేని స్థితిలో కూడా వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు కనీసం పది రోజులు పాటు పంచాయతీ కార్యాలయం, రచ్చ బండ దగ్గరకు చేరుకుని ఫించన్ల కోసం ఆరా తీయాల్సిన పరిస్థితి అందరికీ తెలిసిందే. పంపిణీ జరిగే రోజు సైతం గంటల తరబడి ఎండలోనే నిరీక్షించాల్సి వచ్చేది. సీఎం జగన్ ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టాక అవ్వాతాతలకు ఆ కష్టాలన్నీ తీరిపోయాయి. ప్రతి నెలా టంచన్‌గా ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను డబ్బులు చేతిలో పెడుతున్నారు. 2019 ఆగస్టులో వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు కాగా గత 55 నెలల్లో ఏ ఒక్క దఫా కూడా పింఛను డబ్బుల కోసం లబ్ధిదారులు గడప దాటాల్సిన అవసరం లేదు. కోవిడ్ విపత్తులో నిశ్చింతంగా ఇంటివద్దే ఫించన్లు అందుకున్నారు. ఎవరైనా లబ్ధిదారులు ఇంటివద్ద లేకుంటే వలంటీరే ఒకటికి రెండు సార్లు వెళ్లి ఆరా తీసి ఎక్కడున్నా పెన్షన్లు అందచేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు.

వలంటీర్లపై ఆది నుంచి అక్కసే..

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మొదట నుంచి వలంటీర్లను వ్యతిరేకిస్తూనే వస్తున్నారు. 'ఎందుకీ వలంటీర్లు..? మూటలు మోయడానికా..?' అని ఆరంభంలో అనుచిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు తరువాత మగవాళ్లు లేని సమయంలో వలంటీర్లు ఇంటి తలుపులు తడుతున్నారంటూ నిందలు వేశారు. రాష్ట్రంలో మహిళల అదృశ్యానికి వలంటీర్లే కారణమంటూ పవన్ అభాండాలు వేశారు. తాజాగా నిమ్మగడ్డ నేతృత్వంలోని సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంస్థ కేంద్ర ఎన్నికల సంఘానికి ఒకే నెలలో రెండు దఫాలు ఫిర్యాదులు చేయడంతో వలంటీర్లను పింఛన్ల పంపిణీ నుంచి దూరంగా ఉంచుతూ నిర్ణయం వెలువడింది.

మాస్.. లీడర్!

సాక్షి, అమరావతి:

మార్చి 27వతేదీ మిట్ట మధ్యాహ్నం.. 42 డిగ్రీల మండుతున్న ఎండలో వైఎస్సార్ జిల్లా వేంపల్లి మండలం వీరన్నగట్టుపల్లె క్రాస్ వద్ద సీఎం జగన్‌ను చూసేందుకు ఏడాదిన్నర వయసున్న చంటిబిడ్డను చంకనేసుకుని ఓ మహిళ పొలాల్లో నుంచి పరుగెత్తుతూ వచ్చింది. రోడ్ షోలో జననేతను చూసి సంతోషం వ్యక్తం చేసింది. యాత్ర ముందుకు కదులుతుంటే ఐదారు వందల మీటర్ల దూరం బస్సు వెంట పరుగులు తీసింది. చంటిబిడ్డను చంకలో వేసుకుని అలా పరుగెత్తుతున్నావ్..! కిందపడతావన్న భయం లేదా అక్కా? అని పలకరిస్తే.. "నేను నిరుపేదను. జానెడు భూమి లేదు. కూలీనాలీ చేసుకుని బతికేవాళ్లం. మాకు జగనన్న ఇంటి స్థలం ఇచ్చి కట్టిచ్చినాడు. నా పెద్ద బిడ్డకు అమ్మ ఒడి కింద, నాకు ఆసరా కింద డబ్బులు ఇచ్చినాడు. వాటితో కుట్టు మిషన్ కొనుక్కుని బట్టలు కుట్టుకుంటూ ఇబ్బంది లేకుండా బతుకుతున్నాం. మాకు జీవితం ఇచ్చిన జగనన్నను ఎంత చూసినా తనివి తీరలేదు. అందుకే పరుగెత్తుతున్నా' అని బదులిచ్చింది.

మార్చి 28 మధ్యాహ్నం 12 గంటలు.. సూర్యుడు చుర్రుమంటున్నాడు. నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం ఎర్రగుంట్ల వద్ద దివ్యాంగ దంపతులు అపర్ణ, ప్రసాద్‌లు రోడ్డుపై కూర్చున్నారు. వేడికి తారు రోడ్డు కాలిపోతోంది. ఎందుకన్నా రోడ్డుపై కూర్చున్నారని అడిగితే.. 'నేను, నా భార్య ఇద్దరూ దివ్యాంగులం. మాకు జగనన్న ఇంటి స్థలం ఇచ్చి పక్కా ఇంటిని నిర్మించి ఇచ్చారు. మా ఇద్దరికీ కలిపి పెన్షన్ నెలకు రూ.6 వేలు ఇస్తున్నారు. ఆ డబ్బులతో జీవనం సాగిస్తూ టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) పాసయ్యాం. టీచర్ ఖాళీల భర్తీ కోసం జగనన్న నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ పరీక్షలు రాస్తే మాకు ఉద్యోగాలు వస్తాయి. మమ్మల్ని ఇంటివాళ్లను చేయడంతోపాటు జీవితాన్ని ఇచ్చిన జగనన్న చూసేందుకు ఎంత ఎండలోనైనా కూర్చుంటాం' అని చెప్పారు. ఇంతలో బస్సు యాత్రతో అటువైపు వచ్చిన సీఎం జగన్ వారిని చూసి బస్సు నుంచి కిందకు దిగి ఆప్యాయంగా పలకరించడంతో దివ్యాంగ దంపతులు ఆనందపరవశులయ్యారు.

- 58 నెలలుగా తమకు కాపు కాసిన నాయకుడి కోసం జనం ఆరాటం



మార్చి 29 మధ్యాహ్నం 2 గంటలు.. 70 ఏళ్ల పార్వతమ్మ రోడ్డుపై నిలుచుని ఉంది. అవ్వా.. ఎండ కాలిపోతోంది.. రోడ్డుపై నిలబడితే వడదెబ్బ తగులుతుందన్న భయం లేదా? అని పలకరిస్తే.. 'నా భర్త చనిపోయినాడు.. నాకు పిల్లలు లేరు.. ఈ వయసులో ఏ పనీ చేయలేను.. నెలకు రూ.3 వేల చొప్పున జగనన్న ఇచ్చే పింఛన్‌తో బతుకుతున్నా.. మనవడిలా నన్ను ఆదరిస్తున్న జగనన్న మా ఊరికి వస్తున్నాడు. నా మనవడిని చూడటానికి ఎంత ఎండలోనైనా నిలబడే ఉంటా' అని ఆ అవ్వ చెప్పింది.

మార్చి 30 రాత్రి 10.40 గంటలు.. అనంతపురం జిల్లా రాప్తాడు వద్ద పెద్దక్క తన ఇద్దరు పిల్లలతో కలిసి నిలబడింది. ముగ్గురి చేతుల నిండా బంతి పువ్వులు ఉన్నాయి.. అక్కా రాత్రయింది.. పిల్లలతో కలిసి రోడ్డుపై ఎందుకు నిలబడ్డారు? అని పలకరిస్తే.. 'నా భర్త 2019 ఫిబ్రవరిలో చనిపోయినాడు. నా అత్తింటివాళ్లు, పుట్టింటివాళ్లు నన్ను పట్టించుకోలేదు. ఇద్దరు పిల్లలతో కలసి ఆత్మహత్య చేసుకుందామనుకున్నా.. జగనన్న అధికారంలోకి వచ్చాక నాకు ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు కట్టించి ఇవ్వడంతోపాటు వితంతు పెన్షన్, అమ్మ ఒడి, ఆసరా, చేయూత, రైతు భరోసా పథకాల ద్వారా సొంత అన్నలా అండగా నిలిచినాడు. నాకున్న రెండు ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ.. జగనన్న ఇచ్చిన డబ్బులతో రెండు పాడి పశువులు కొనుక్కుని పాలు అమ్ముకుంటూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నా. జగనన్న గవర్నమెంట్ బడిలో ఇంగ్లీషు మీడియంలో నా ఇద్దరు పిల్లలకు చదువులు చెప్పిస్తున్నాడు. నాకు అండగా నిలిచిన జగనన్న కోసం అర్ధరాత్రైనా వేచి ఉంటా' అని ఆత్మస్థైర్యంతో చెప్పింది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

"మేమంతా సిద్ధం..." పేరుతో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న బస్సు యాత్రలో కనిపించిన దృశ్యాల్లో ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. సూరీడు నిప్పులు గక్కుతున్నా.. ఎండ మండుతున్నా.. రాత్రి పొద్దుపోయినా చిన్నపిల్లలు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, అన్నాదమ్ములు బస్సు యాత్ర జరిగే రహదారి వెంబడి కిలోమీటర్ల కొద్దీ బారులు తీరుతున్నారు. సీఎం జగన్ తమ వద్దకు చేరుకోగానే పూల వర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. జనం కోసం నిలబడ్డ నాయకుడికి జననీరాజనం పలుకుతున్నారు.

కోడ్ ముగిసేదాకా... సచివాలయాల్లోనే పింఛన్లు

- ఈసీ ఆదేశాలతో నూతన మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఎన్నికల నేపథ్యంలో వలంటీర్ల ద్వారా ఇంటివద్దే పింఛన్ల పంపిణీకి కేంద్ర ఎన్నికల సంఘం బ్రేక్‌లు వేసినందున తిరిగి ఎన్నికల కోడ్ ఎత్తివేసే వరకు వచ్చే రెండు మూడు నెలల పాటు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా పింఛన్ల పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే పింఛన్ల పంపిణీని లబ్ధిదారుల ఇంటి వద్ద కాకుండా గ్రామ, వార్డు సచివాలయాల వద్ద చేపడతారు. సచివాలయాల వద్ద సిబ్బంది లబ్ధిదారుల ఆధార్ లేదా ఐరిస్ వివరాలను నిర్ధారించుకుని పెన్షన్లు అందచేస్తారు. ఈ మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆదివారం మార్గదర్శకాలను జారీ చేసింది. ఆర్థిక సంవత్సరం ముగింపుతో పాటు బ్యాంకులకు వరుసగా సెలవుల నేపథ్యంలో ఏప్రిల్ 3వ తేదీ నుంచి అవ్వాతాతలకు పింఛన్ల పంపిణీని ప్రారంభించాలని వారం క్రితమే ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. గతేడాది కూడా ఏప్రిల్‌లో మూడో తేదీ నుంచి పింఛన్ల పంపిణీ మొదలైంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం శనివారం జారీ చేసిన తాజా ఆదేశాల మేరకు మూడో తేదీ నుంచి పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సెర్ప్ అధికారులు వెల్లడించారు.

ఫించన్లపై బాబు డబుల్ గేమ్

- అటు అడ్డుపడి ఈసీకి ఫిర్యాదు
- ఇటు పంచాలంటూ లేఖలు
- ప్రజాగ్రహంతో బాబు బృందంలో ఆందోళన

సాక్షి, అమరావతి: అటుపక్క సామాజిక ఫించన్లను అడ్డుకోవడం.. ఇటుపక్క సకాలంలో ఇచ్చేయాలంటూ ఎన్నికల సంఘానికి లేఖలు రాయడం! ఇదీ చంద్రబాబు రెండు నాలుకల వైఖరి! సంక్షేమ పథకాలను ప్రజలకు అందకుండా చేయడం ద్వారా ప్రభుత్వంపై బురద చల్లాలన్నది చంద్రబాబు కుతంత్రం. ఈ పనిని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌కు ఆయన ప్రత్యేకంగా అప్పగించారు. నిమ్మగడ్డ రాష్ట్ర ఎన్నికల అధికారిగా ఉన్నప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా, చంద్రబాబుకు అనుకూలంగా ఏ స్థాయిలో పని చేశారో అందరికీ తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికలను టీడీపీ కోసం హఠాత్తుగా వాయిదా వేసి రాజ్యాంగాన్నే అపహాస్యం చేసిన చరిత్ర ఆయనది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూనే హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో చంద్రబాబు బినామీలు సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్‌ను కలసి చంద్రబాబు కోసం ఏం చేయడానికైనా వెనుకాడబోనని చాటుకున్నారు. పదవీ విరమణ తరువాత కూడా నిస్సిగ్గుగా చంద్రబాబుకు మేలు చేయడమే పనిగా పెట్టుకున్నారు. అందుకోసం కొంతమందిని పోగుచేసి సిటిజన్ డెమొక్రటిక్ ఫోరం పేరుతో తెర వెనుక రాజకీయాలు నడిపారు. అందులో భాగంగానే వలంటీర్ల వ్యవస్థ లేకుండా చేసేందుకు కోర్టులో కేసు వేశారు. ఫించన్ల పంపిణీకి అడ్డుపడి ఈసీకి ఫిర్యాదులు చేశారు.

ప్రజాగ్రహంతో...

పింఛన్ల పంపిణీకి అడ్డంకులు సృష్టించడంలో సక్సెస్ అయిన చంద్రబాబు, నిమ్మగడ్డ కుట్రపూరిత రాజకీయాలతో వలంటీర్లను ప్రజలకు దూరం చేయగలిగామని చంద్రబాబు బృందం చంకలు గుద్దుకున్నా ఒకటో తేదీ రావడంతో వారిలో వణుకు మొదలైంది. చంద్రబాబు, నిమ్మగడ్డ నిర్వాకాల కారణంగా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ ఆగిపోయే పరిస్థితి నెలకొంది. దీనిపై ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నట్లు పసిగట్టిన చంద్రబాబు బృందం ప్లేటు ఫిరాయించింది. తాము అడ్డుకున్న కార్యక్రమం గురించి మళ్లీ వారే ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాయడం గమనార్హం. పింఛన్ల పంపిణీకి తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలంటూ అందులో పేర్కొన్నారు.

వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు కక్షకు పరాకాష్ట

- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: ప్రభుత్వ సేవలను ప్రజలకు సమర్థవంతంగా అందించడంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన వలంటీర్ల వ్యవస్థపై కత్తికట్టిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు.. ఆయన బీ టీం అయిన సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ద్వారా దొంగదెబ్బ తీశాడని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ఇది వలంటీర్లపై చంద్రబాబుకు ఉన్న కక్షకు పరాకాష్ట అని అన్నారు. సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ కార్యదర్శి నిమ్మగడ్డ పక్తు టీడీపీ కార్యకర్త అని తెలిపారు. ఆయన ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు అధికారంలో ఉంటే ప్రజా జీవితాన్ని ఎంత విధ్వంసం చేస్తాడో, ప్రజలను ఎంత రాచి రంపాన పెడతాడో అందరికీ తెలిసిందేనని అన్నారు. ఎన్నికల్లో ప్రజల తీర్పు కోరే సమయంలో రాష్ట్రంలోని ప్రజలకు ఇబ్బంది కలిగించడం ద్వారా చంద్రబాబు నిజ స్వరూపాన్ని మరోసారి బయట పెట్టుకున్నారని తెలిపారు. సజ్జల రామకృష్ణారెడ్డి ఇంకా ఏమన్నారంటే..

ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజామునే వలంటీర్లు అవ్వాతాతల వద్దకు వెళ్లి పింఛన్ ఇచ్చే విధానాన్ని ఎన్నికల కోడ్ పేరుతో ఆపించారు. గత నాలుగేన్నరేళ్లుగా మనుమడు జగన్ ఇస్తున్న పింఛన్ తీసుకుంటున్న వృద్ధులు ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు. పింఛను కోసం అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు కాళ్లరిగేలా తిరిగిన 2014–19 మధ్య పాత రోజులు ఇంకా గుర్తుండే ఉంటాయి. చంద్రబాబు అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందో ప్రజలందరూ గమనించారు. ఆయన చేసిన చండాలపు పని ఆయనకే చుట్టుకుంటుందన్న భయంతో ఆయనకు సంబంధం లేదంటూ కొత్త పల్లవి అందుకున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చీఫ్ సెక్రటరీకి లేఖ రాస్తున్నాడు. అధికారులు ప్రత్యామ్నాయం చూపకుండా ఎందుకు ఉంటారు? ఇది చంద్రబాబు ప్రభుత్వం కాదు. జగన్ ప్రభుత్వం. నిన్నటివరకూ రాష్ట్రంలో ఉద్యోగాలే లేవన్న వ్యక్తి ఇప్పుడు సచివాలయాల్లో 1.30 లక్షల ఉద్యోగులు ఉన్నట్లు లేఖలో ఒప్పుకున్నారు. ప్రభుత్వం దగ్గర డబ్బుల్లేవంటూ కొత్త ఆరోపణలు చేస్తున్నాడు. డబ్బుల్లేవని ఆయనకెవరు చెప్పారు? ఆర్థిక సంవత్సరం ముగింపు కాబట్టి ఒకటో తేదీకి ముందు డ్రా చేయడంలో ఇబ్బంది ఉంటుంది. రెండో తేదీన డ్రా చేసి మూడో తేదీ పంపిణీ చేస్తారు. ప్రతి ఏటా ఇదే జరుగుతుంది. ఖజానాలో డబ్బంతా బిల్లులు చేసుకున్నారంటూ అచ్చెన్నాయుడో కొత్త కథ అల్లాడు. మేం పెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారానే పింఛన్లు పంపిణీ జరుగుతుంది. కాకపోతే ఇప్పుడు సచివాలయం వద్దకు వెళ్లి తీసుకోవాలి. ఓట్ల కోసమే వలంటీర్ వ్యవస్థ పెట్టాలనే ఆలోచన సీఎం జగన్‌కు ఉంటే ఆ పనికే ఉపయోగించుకునేవాడు కానీ ఇంత సంక్షేమం చేయరు కదా? ఇదే వ్యవస్థ చంద్రబాబు హయాంలో పెట్టి ఉంటే 2.60 లక్షల జలగలు తయారయ్యేవి. ఆ జలగలతో చంద్రబాబు రివర్స్‌లో ప్రజల రక్తం పీల్చేవాడు.

కాంగ్రెస్ లోక్‌సభ ఇన్‌చార్జుల నియామకం

▶ మొదటి పేజీ తరువాయి

మల్లు భట్టి విక్రమార్కను ఆ బాధ్యతల నుంచి తప్పించడం గమనార్హం. కాగా, ఏఐసీసీ నుంచి 9 స్థానాలకు రోహిత్ చౌదరి, 8 చోట్ల విష్ణునాథ్ ఇన్‌చార్జులుగా వ్యవహరించనున్నారు.

లోక్‌సభ స్థానాల వారీగా ఇన్‌చార్జులు వీరే: ఖమ్మం–పొంగులేటి శ్రీనివాస రెడ్డి, నల్లగొండ–ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కరీంనగర్–పొన్నం ప్రభాకర్ పెద్దపల్లి–డి.శ్రీధర్‌బాబు, వరంగల్–రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మహబూబాబాద్ –తుమ్మల నాగేశ్వర రావు, హైదరాబాద్– ఒబెదుల్లా కొత్వాల్, సికింద్రాబాద్ – కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి – కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నాగర్‌కర్నూల్– జూపల్లి కృష్ణారావు, మహబూబ్‌నగర్– ఎస్.సంపత్ కుమార్, చేవెళ్ల – వేం నరేందర్‌రెడ్డి, మల్కాజిగిరి– మైనంపల్లి హనుమంతరావు, మెదక్– కొండా సురేఖ, నిజామాబాద్– పి.సుదర్శన్ రెడ్డి, ఆదిలాబాద్– సీతక్క, జహీరాబాద్– దామోదర్ రాజనర్సింహ

అవకాశమిస్తే ఎంపీగా పోటీ

చిందు యక్షగాన కళాకారుడు సమ్మయ్య

జనగామ రూరల్: పార్టీలు అవకాశం కల్పిస్తే వరంగల్ ఎంపీగా లేదా ఎక్కడైనా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని పద్మశ్రీ అవార్డు గ్రహీత, చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మ య్య ప్రకటించారు. ఆదివారం ఇక్కడ మాట్లాడుతూ.. చిందు యక్షగాన కళాకారుడిగా సుమారు 20 వేల ప్రదర్శనలు ఇచ్చి ప్రజా సమస్యలను ప్రస్తావించానన్నారు. ప్రజా ప్రతినిధిగా ఎన్నికైతే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయవచ్చనే ఆలోచనతో ఉన్నట్లు పేర్కొన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు సమ్మయ్య స్పష్టం చేశారు.

చౌక విద్యుత్తే కొందాం

- థర్మల్‌కు బదులు చౌకగా లభించే పునరుత్పాదక విద్యుత్‌పై సర్కారు దృష్టి
- కొత్త విద్యుత్ విధానం రూపకల్పనపై కసరత్తు.. ఉత్పత్తి వ్యయం తగ్గింపే లక్ష్యం
- హిమాచల్‌లో సొంత జలవిద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటుకు యోచన
- 2031–32లో 27,059 మెగావాట్లకు పీక్ డిమాండ్ పెరగొచ్చని ఇంధన శాఖ అంచనా
- బిల్లు రూపంలో విద్యుత్ విధానం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఏడేళ్లలో రాష్ట్ర విద్యుత్ అవసరాలు భారీగా పెరగనున్నాయని.. రాష్ట్ర గరిష్ట విద్యుత్ డిమాండ్ 2031–32 నాటికి ఏకంగా 27,059 మెగావాట్లకు పెరగనుందని రాష్ట్ర ఇంధన శాఖ అంచనా వేసింది. 2023 మార్చి 8న రాష్ట్రంలో అత్యధికంగా 15,623 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదవగా వచ్చే ఏడేళ్లలో దాదాపు రెట్టింపు కావొచ్చని భావిస్తోంది. అందుకు తగ్గట్లుగా విద్యుదుత్పత్తి, సరఫరా, పంపిణీ వ్యవస్థల బలోపేతానికి కొత్త విద్యుత్ విధానం రూపకల్పనపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్ర విద్యుత్ సంస్థలు ఇప్పటికే దివాలా తీయడంతో భవిష్యత్తులో ఖరీదైన థర్మల్ విద్యుత్ బదులు పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని పెంచుకొనేలా కొత్త ప్రణాళికలు రచిస్తోంది.

ప్రైవేటు భాగస్వామ్యంతో ముందుకు...
విద్యుత్ రంగంలో అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని నష్టాల నుంచి బయటపడేందుకు కొత్త పాలసీ ఉపయోగపడుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. విద్యుత్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి విద్యుత్ సంస్థలను లాభాలబాట పట్టించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఇంధనశాఖ సిఫారసు చేయనున్నట్లు తెలిసింది. ప్రధానంగా తక్కువ ధరకు పునరుత్పాదక విద్యుత్ సరఫరా చేసే ప్రైవేటు కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో విద్యుదుత్పత్తి, సరఫరా వ్యవస్థల బలోపేతం వంటి లక్ష్యాలతో కొత్త పాలసీని రూపొందించనుంది. భవిష్యత్తులో వినియోగదారులపై చార్జీల భారం పడకుండా దేశానికి ఆదర్శంగా ఉండేలా తెలంగాణ పవర్ పాలసీ ముసాయిదాను సిద్ధం చేసినట్లు తెలిసింది. అలాగే సౌర విద్యుత్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్రంలో గరిష్టంగా పెరిగే విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి సౌర విద్యుత్‌పై అధికంగా ఆధారపడాలని భావిస్తోంది.



సబ్ స్టేషన్ల పరిధిలో సౌర విద్యుదుత్పత్తి...
రాష్ట్రంలోని అన్ని 33/11 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో సోలార్ ప్లాంట్లను నెలకొల్పేందుకు కొత్త పాలసీలో ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వనుంది. అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల అధ్వర్యంలో సోలార్ ప్లాంట్లు నెలకొల్పాలని భావిస్తోంది. సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకొచ్చే ప్రైవేటు కంపెనీలు, వ్యక్తులకు ఇందులో భాగస్వామ్యం కల్పించనుంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వర్సిటీలు, హాస్టళ్లు, ప్రభుత్వ కార్యాలయాల భవనాలపైనా సోలార్ యూనిట్లు నెలకొల్పేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది.

6,732 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్...
రాష్ట్రంలోని మేజర్, మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా పంప్డ్ స్టోరేజీ విద్యుత్‌ను ఉత్పత్తి చేసే అవకాశాలను ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది. ఇప్పటికే ఉన్న రిజర్వాయర్లతోపాటు నిర్మాణంలో ఉన్న వాటి పరిధిలో 6,732 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుదుత్పత్తికి అవకాశాలున్నాయని విద్యుత్ సంస్థలు గతంలోనే అంచనా వేశాయి.

హిమాచల్‌లో భారీ భారీ హైడ్రో ఎలక్ట్రిక్ ప్లాంట్..
హిమాచల్ ప్రదేశ్‌లో జలవిద్యుదుత్పత్తికి ఉన్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రభుత్వమే పెట్టుబడులుపెట్టి అక్కడ భారీ జలవిద్యుదుత్పత్తి ప్లాంట్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది. పెట్టుబడుల భారం తగ్గేందుకు ప్రైవేటు కంపెనీలను భాగస్వాములను చేసుకోవాలని... అక్కడ తక్కువ ధరకు ఉత్పత్తయ్యే విద్యుత్‌ను రాష్ట్రానికి సరఫరా చేసుకుంటే లాభదాయకంగా ఉంటుందని యోచిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలి ఢిల్లీ టూర్‌లో హిమాచల్‌ప్రదేశ్‌సీఎం సుఖ్వీందర్ సింగ్‌తో దీనిపై సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది.

బిల్లు రూపంలో విద్యుత్ విధానం..?

ముసాయిదా విద్యుత్ విధానంపై అన్ని రంగాల నిపుణులు, వినియోగదారులతో సంప్రదింపులు జరిపి వారి అభ్యంతరాలు, సలహాలు స్వీకరించాకే దానికి తుదిరూపు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బహిరంగ విచారణ కూడా నిర్వహించాలని యోచిస్తోంది. ఎన్నికల కోడ్ ముగిశాక కొత్త విద్యుత్ ముసాయిదా విధానాన్ని అసెంబ్లీలో పెట్టే అవకాశముంది. బిల్లు రూపంలో కొత్త విద్యుత్ విధానాన్ని ప్రకటించేందుకు ఉన్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది.

వచ్చే ఏడేళ్లలో పెరగనున్న రాష్ట్ర విద్యుత్ అవసరాలు, గరిష్ట డిమాండ్‌పై రాష్ట్ర ఇంధన శాఖ అంచనాలు (సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ లెక్కల ఆధారంగా)

అంశం	2023-24	2024-25	2025-26	2026-27	2027-28	2028-29	2029-30	2030-31	2031-32
విద్యుత్ అవసరాలు (మిలియన్ యూనిట్లలో)	77,503	82,316	87,414	92,967	98,578	1,04,383	1,10,971	1,15,862	1,20,549
గరిష్ట విద్యుత్ డిమాండ్ (మెగావాట్లలో)	15,704	16,877	18,138	19,529	20,968	22,488	24,215	25,639	27,059



ఒక ధార్మిక మనిషిని తాకినప్పుడల్లా,
నాకు తప్పక చేతులు కడుక్కోవాలని అనిపిస్తుంటుంది.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 1 ఏప్రిల్ 2024

ఇండియా ప్రయాణం

భారత స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని ఒక ఆంగ్లేయుడి దృష్టి కోణంలో చూపే నవల 'ఎ పాసేజ్ టు ఇండియా'. ఆంగ్ల సాహిత్యంలో వెలువడిన ఇరవయ్యో శతాబ్దపు వంద గొప్ప నవలల్లో ఒకటిగా పరిగణన పొందిన ఈ రచనకు ఇది శతాబ్ది సంవత్సరం. తన బ్రిటిష్ రాజ్ అనుభవాలతో ఇ.ఎం. ఫార్‌స్టర్ 1924లో దీన్ని రాశారు. మరాఠా సంస్థానం దేవాస్ సీనియర్‌లో (ప్రస్తుత మధ్యప్రదేశ్‌లో భాగం) మూడో తుకోజీరావ్ పవార్ వ్యక్తిగత కార్యదర్శిగా ఫార్‌స్టర్ 1921–22 మధ్య పనిచేయడమే కాకుండా, అంతకు పదేళ్ల ముందు ఒక ఏడాది పాటు ఇండియాలో పర్యటించారు. ఆ అనుభవాల సారాన్ని నవలకు వాడుకున్నారు. శీర్షికను మాత్రం అమెరికన్ కవి వాల్ట్ విట్‌మన్ కవితా సంకలనం 'పాసేజ్ టు ఇండియా'(1871) ప్రేరణతో తీసుకున్నారు. ఈ నవలను ఎంతోమంది సినిమా తీయాలని ప్రయత్నించినా, ఫార్‌స్టర్ పడనీయలేదు, సమతూకం తప్పుతారేమోనని! ఆయన చనిపోయాక(1970) అది సాధ్యపడింది. అదృష్టవశాత్తూ టైటిల్‌లోనే ఇండియా అనే మాటను నవల కలిగివుందనీ, వైభవోపేతమైన ఇండియాను గొప్పగా తెరకెక్కించవచ్చనీ ఉత్సాహపడ్డారు డేవిడ్ లీన్. 'ఎ పాసేజ్ టు ఇండియా' పేరుతోనే, నవల వచ్చిన సరిగ్గా 60 ఏళ్ల తర్వాత 1984లో సినిమా వచ్చింది. ఆ సినిమాకు కూడా ఇది నలభయ్యో సంవత్సరం.

నల్లవాళ్లను చీవాట్లు పెట్టడం అతి మామూలు వ్యవహారంగా ఉండిన కాలం. మీదకు కారును తోలినా పశ్చాత్తాపం ప్రకటించాల్సినంతటి మనుషులు వీళ్లు కాదన్న అహంకారం తెల్లవాళ్లలో ఉన్న కాలం. 'సామాజిక మేళనం' అర్థంలేనిది అనుకునే కాలం. 'వాళ్లందరూ ముందు పెద్ద మనుషులుగా ఉందామనే వస్తారు... అందరూ ఒకేలా తయారవుతారు; చెడ్డగా కాదు, మెరుగ్గా కాదు. నేను ఏ ఆంగ్లేయుడికైనా రెండేళ్లు ఇస్తాను... ఆంగ్ల మహిళకైతే ఆరు నెలలే' అంటాడు డాక్టర్ అజీజ్. అయినా వాళ్లను ఆరాధించకుండా ఉండలేకపోవడం భారతీయుల బలహీనత అని అతడికి తెలుసు. అలాంటి కాలంలో అజీజ్‌తో స్నేహంగా ఉంటాడు హెడ్మాస్టర్ ఫీల్డింగ్. అజీజ్ తబ్బిబ్బయిపోతే, అదొక పెద్ద విషయంగా భావించడమే అర్థం లేనిదంటాడు. భార్య చనిపోయాక, ఇద్దరు పిల్లల్ని ఊళ్లో తల్లిదండ్రుల దగ్గర ఉంచి, సంపాదనంతా వాళ్లకే పంపుతుంటాడు అజీజ్. తనకు మించిన భారం అయినప్పటికీ తమ చంద్రాపూర్ పట్టణానికి వచ్చిన మిసెస్ మూర్, ఆమె యువ స్నేహితురాలు అడెలాను 'మరబార్' గుహల పర్యటనకు తీసుకెళ్తాడు అజీజ్. గుహలంటే అలాంటిలాంటివి కావు. ఎత్తైనవీ, చీకటైనవీ, నిర్జనమైనవీ. పరివారము, క్యాంపులు, ఖర్చులు! సిటీ మ్యాజిస్ట్రేట్ అయిన మూర్ కొడుక్కీ అడెలాకూ నిశ్చితార్థం అయివుంటుంది. తీరా అన్నీ ఒకేలా కనబడే ఆ చీకటి గుహల్లో, ఎండ మండిపాటులో, గుండె చప్పుడు సైతం ప్రతిధ్వనించే చోట మిసెస్ మూర్ అనారోగ్యం పాలవడమూ... విధిలేని పరిస్థితుల్లో అడెలా, అజీజ్ ఇద్దరే లోపలికి దారితీయడమూ, ఆ ఇరుకులో, ఆ గందరగోళంలో, ఆ భయంలో అజీజ్ తన మీద అత్యాచారం చేయబోయాడని రక్తమోడుతుండగా అడెలా కిందికి పరుగెత్తుకురావడమూ... తెల్లమ్మాయి మీద నల్లవాడి చేయా? ఆంగ్లేయులు పళ్లు కొరుకుతారు. నల్లవాడి మీద కేసు బనాయింపా? జనాలు వీధుల్లోకొస్తారు. కోర్టు కేసు సంచలనం అవుతుంది. ఇరుపక్షాలూ నిలబడి కలబడటమే తరువాయి!

కథ ఏ బిందువు దగ్గర వచ్చి ఆగుతుంది, అక్కడి నుంచి పాత్రలు ఎలా పరిణామం చెందుతాయన్నది ఇందులో ముఖ్యం. తెల్లవాడికీ, నల్లవాడికీ మధ్య స్నేహం నిలబడుతుందా? ఒక పక్షం వహించని సమదృష్టి సాధ్యమేనా? వీటన్నింటిని మించిన మానవీయ విలువంటూ ఉండగలదా? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు ఇందులో మౌనంగా జవాబు దొరుకుతుంది. గుహల్లోకి ప్రవేశించినప్పటి నుంచీ తన తలలో మొదలైన హోరు వల్ల అడెలా స్థిరంగా ఉండలేదు. పొరబడ్డానేమో అని కేసు ఉపసంహరించుకున్నాక హోరు పోతుంది. ప్రతి తెల్లమనిషిలోనూ గుబులు రేపుతున్న భారతీయుల స్వాతంత్ర్యోద్యమపు నినాదాల హోరుకు సంకేతంగా దీన్ని తీసుకోవచ్చేమో! కేసు ఉపసంహరణ తర్వాత అడెలా ఇరవై వేల రూపాయల జరిమానా చెల్లించాల్సి వస్తుంది. నిశ్చితార్థం రద్దవుతుంది. అంత జరిమానా కట్టాలంటే అడెలా సర్వనాశనమై పోతుందనీ, దాన్ని ఉపసంహరించుకొమ్మనీ కోరినప్పుడు రెండు పక్షాలకూ హీరోగా నిలిచే డ్రామా ఆడుతున్నావని ఫీల్డింగ్‌ను నిందిస్తాడు అజీజ్. కేసు వల్ల పోయిన తన ప్రతిష్ఠ మాటేమిటని నిలదీస్తాడు. తెల్లవాళ్ల మెహర్బానీ కోసం జెంటిల్‌మన్‌గా ప్రవర్తించాల్సిన అవసరం లేదనీ, వాళ్లతో కరాఖండిగానే వ్యవహరించడం తప్పదనీ అనుకుంటాడు.

'దయ, మరింత దయ, ఆ తరువాత కూడా మరింత దయ'ను మాత్రమే ఫార్‌స్టర్ నమ్మారు. 'నా దేశాన్ని మోసం చేయడమా, నా స్నేహితుడిని మోసం చేయడమా అని ఎంపిక చేసుకోవాల్సి వచ్చినప్పుడు, నా దేశాన్ని మోసం చేసే ధైర్యం నాకుంది' అన్నారు. భారతీయులు పుట్టుకతో తాత్వికులు; రిక్షాను లాగేవాళ్లు కూడా కర్మ, పునర్జన్మల గురించి మాట్లాడుతారని మురిసిపోయారు. ఉర్దూ, హిందీ భాషలంటే ఇష్టపడే ఫార్‌స్టర్ హైదరాబాద్‌లోని ఉర్దూ హాల్ నిర్మాణానికి విరాళమిచ్చారు. ఆ గుహల్లో నిజానికి ఏం జరిగిందనేది నవల లోపల గానీ, బయట గానీ ఎప్పుడూ ఆయన వెల్లడించలేదు. అర్థవంతమైన మర్మం. 'మనం ఎన్ని మానవ ప్రయత్నాలైనా చేయొచ్చు, కానీ ఫలితం ముందే నిర్ణయమైవుంటుంది' అంటాడు నవలలో ప్రొఫెసర్ గోడ్బోలే. అడెలా ఇండియాకు రావడం కూడా అందులో భాగమేనన్నది ఆయన భావన. ఫార్‌స్టర్ ఇండియాకు వచ్చినప్పుడే ఈ నవల పుట్టుక నిశ్చితమైవుంటుంది!

ఊహకు అందని ఉక్కిరిబిక్కిరి

కామెంట్



కరణ్ థాపర్

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో 'జరగని' ఒక ఘటన ఆనాటి బ్రిటిష్ ఆధిపత్యంలోని భారత సామ్రాజ్యాన్ని వణికించింది. మద్రాస్‌కు అభిముఖంగా ఉన్న పశ్చిమ దిశ ప్రాంతమంతటా భయభ్రాంతులు వ్యాపించాయి. సింగపూర్‌ను లొంగదీసుకున్న జపాన్‌కు తర్వాతి లక్ష్యం ఈ ప్రాంతమే అనుకోవడమే దీనికి కారణం. దాంతో నగరంలోని 8 లక్షల మందిలో 7 లక్షలమంది కట్టుబట్టలతో పారిపోయారు. మద్రాసు జూ లోని సింహాలు, పులులు, నల్ల చిరుతలు, ఎలుగుబంట్లు, విషసర్పాలను కాల్చి చంపారు... బాంబులు పడితే అవి ఆ గందరగోళంలో జనాల మీద పడకుండా! ఆ యుద్ధానికి అవి మూల్యం చెల్లించాయి. ఊహాత్మకమైన దండయాత్ర ముప్పునకే ఆనాటి ప్రభుత్వం అంతగా ప్రభావితం అయిందా? అవునని ఒప్పుకోక తప్పదు.

రెండో ప్రపంచ యుద్ధం ముగిసి ఎనభై ఏళ్లు అయినప్పటికీ, ఆ యుద్ధం గురించి మనకు తెలియనిది ఏముంటుందని చాలామంది అనుకుంటారు. అది తప్పు అని ముకుంద్ పద్మనాభన్ రుజువు చేశారు. అసలేనాడూ సంభవించకనే, నిజంగానే సంభవించిందన్నంతగా ఒక అసంబద్ధమైన కలవరానికి గురిచేసిన ఒకానొక ఘటనపై తాజాగా ఆయన పుస్తకం రాశారు. దాని పేరు: 'ద గ్రేట్ ఫ్లాప్ ఆఫ్ 1942: హౌ ద రాజ్ ప్యానిక్డ్ ఓవర్ ఎ జపనీస్ నాన్–ఇన్‌వేషన్'.


1942 ఫిబ్రవరిలో సింగపూర్ పతనానంతరం... అప్పటికింకా బ్రిటిష్ ఆధిపత్యంలోనే ఉన్న భారత సామ్రాజ్యానికి–మరీ ముఖ్యంగా మద్రాస్‌కు అభిముఖంగా ఉన్న పశ్చిమ దిశ ప్రాంతమంతటా భయభ్రాంతులు వ్యాపించాయి. మలయా ద్వీపకల్పానికి మద్రాసు దగ్గరగా ఉండటమన్నది... సింగపూర్ తర్వాత జపాన్ తదుపరి దాడి ఇక మద్రాసు మీదనేనన్న సూచనప్రాయతకు తావిచ్చింది.

అసలక్కడేమీ లేకుండానే, ఊరికే ఊహించుకుని భయపడ్డామని ప్రత్యేకించి మీరు గుర్తు చేసుకున్నప్పుడు ఆ భయాందోళన స్థాయి మరింతదైన గొప్ప దిగ్భ్రమను కలిగిస్తుంది. సింగపూర్ పతనం అయ్యే సమయానికి మద్రాసులోని మూడింట ఒక వంతు జనాభా ప్రాణ భయంతో తట్టాబుట్టా వదిలి పారిపోయింది. ఆరు వారాల తర్వాత నగర జనాభా కేవలం 25 శాతమే మిగిలి ఉందని 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' రాసింది. పాల్ జయరాజన్ అనే ఐసీఎస్ అధికారి అంచనా ప్రకారమైతే మద్రాస్ జనాభా 13 శాతానికి తగ్గిపోయింది. దానర్థం 8 లక్షల మందిలో 7 లక్షలమంది కట్టుబట్టలతో నగరాన్ని వదిలి వెళ్లారని! 'ఈ లెక్క నమ్మశక్యమైనదిగా కనిపించకున్నా, నమ్మశక్యం కానిది గానూ అనిపించడం లేదు' అని ముకుంద్ పద్మనాభన్ వ్యాఖ్యానించారు.

పుస్తకంలో ఆహ్లాదం కలిగించే కథలు చెప్పుకోదగినన్ని ఉన్నప్పటికీ, వాటిల్లో ఒక్కటి కూడా మద్రాసులో జరిగిన దానిని మించి అద్భుతమైనదేమీ కాదు. "సింహాలు, పులులు, నల్ల చిరుతలు, ఎలుగుబంట్లు, విషసర్పాలను వెతికి మరీ కాల్చి చంపారు. జపాన్ విసిరే బాంబులు కనుక జంతు ప్రదర్శన శాలలను, వాటి కదలికలను నియంత్రించి ఉంచిన ఆవరణలను (ఎన్‌క్లోజర్‌లు) ధ్వంసం చేసినప్పుడు, వాటి నుంచి క్రూర జంతువులు స్వేచ్ఛగా బయటికి ఉరికి, మనుషుల మీద పడకుండా నివారించటానికి ముందస్తుగానే వాటిని చంపేయాలన్న ఆదేశాలు అమలు అయ్యాయి." చూస్తుంటే ఆనాటి జరగని ఘటనకు అత్యధిక మూల్యం చెల్లించుకున్నది జంతువులే అనిపిస్తోంది.



జపాన్‌కు సింగపూర్ సేనల లొంగుబాటు: 1942



నిజంగా ఇటువంటిదే లండన్‌లో జరిగింది. "1939 సెప్టెంబర్ ఆరంభంలో, యుద్ధం మొదలైన మొదటి వారం... విస్తుగొల్పేటంతటి స్థాయిలో 4 లక్షల నుంచి 7 లక్షల 50 వేల దాకా పిల్లులు, శునకాలను చంపేశారని అంచనా." అంటే, బ్రిటిష్ ప్రజలు తమ పెంపుడు జీవులను త్యాగం చేయటానికి కూడా సంకోచించనంతగా ప్రేమిస్తారు!

మద్రాసు గవర్నరు పారిపోయి ఉండకపోవచ్చు. కానీ మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులు చేసింది కచ్చితంగా పారిపోవటమే! సర్ సిడ్నీ వాడ్స్‌వర్త్ "రెండు కార్లలో తన సతీమణి, డ్రైవరు, బట్లరు, కుక్, మూడు పెంపుడు శునకాలతో అనంతపురం బయలుదేరారు. తమ వాహనాల పైభాగాన పరుపులను కట్టి, వాటిల్లో పింగాణీపాత్రలు, గిన్నెలు, బట్టలు, న్యాయశాస్త్ర గ్రంథాలు, వెండి దీపాల వంటి అవసరమైన, విలువైన సామగ్రిని కుక్కేశారు". తిరిగి రెండు వారాల తర్వాత ఆయన వెనక్కు వచ్చారు. ఒక మంచి ఉల్లాసభరితమైన సెలవు సమయాన్ని గడిపాక!

ఐ.సి.ఎస్. అధికారులు మద్రాసును విడిచిపెట్టి పోలేదు. బదులుగా వారు జపాన్ సేనలకు చుక్కయినా దక్కకుండా ఉండేందుకు 'గొప్ప' మార్గాలనే కనిపెట్టారు. చెట్టినాడు రాజా సాహచర్యంలో పాల్ జయరాజన్ మద్రాస్ క్లబ్బుల్లో పీకల దాకా మద్యం సేవించారు. తర్వాత, వారంతా కలిసి "మిగిలిన మద్యాన్నంతా కాలువలో పారబోశారు".

ఇక జపాన్ బాంబు దాడుల గురించి చింతించాల్సినంత భయం లేని ఢిల్లీలో కవి డబ్ల్యు.హెచ్. ఆడెన్ సోదరుడైన జాన్ బిక్నెల్ ఆడెన్ సౌత్ బ్లాక్‌ను రక్షించటానికి ఒక హాస్యాస్పదమైన తలతిక్క పథకాన్ని రూపొందించారు. సౌత్‌బ్లాక్ భవంతిని కనిపించనీయకుండా చేయటం కోసం దట్టమైన పొగ మేఘాలను సృష్టించే ఒక పరికరాన్ని తయారు చేశారు. అయితే అది కేవలం కాలుష్యాన్ని వెదజల్లడానికి మాత్రమే పనికొచ్చింది.

యునైటెడ్ ప్రావిన్సు (ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్)లో ఒక వదంతి అనియంత్రిత ఆందోళన గాడ్పులను వ్యాపింపజేసింది. "ఒక జపాన్ మనిషి ఆకాశం నుంచి భూమిపైన జరుగుతున్న ఒక వేడుకలోని జనసమూహం మధ్యకు దిగి, వారిని ఉద్దేశించి ప్రసంగించి, తిరిగి అలాగే ఆకాశంలోకి వెళ్లిపోయాడు అనే కథ అది." కళ్లారా చూసినంతగా ఆ వదంతిని అంతా నమ్మేశారు.

చివరికొచ్చేసరికి పద్మనాభన్ ముఖ్యమైన ప్రశ్నలు లేవనెత్తారు. కానీ దురదృష్టవశాత్తూ వాటికి సమాధానాలు మాత్రం చెప్పలేదు. "కేవలం ఊహాత్మకమైన దండయాత్ర ముప్పునకే భారతదేశం అంతగా ప్రభావితం అయిందా? పాలన యంత్రాంగం ఆ స్థాయిలో అప్రమత్తం అవాల్సి ఉండిందా? దేశవ్యాప్తంగా అంతగా కీకర బీకరలు అవసరమా?"

సహజంగానే విమర్శలు వచ్చాయి. "టిబెట్‌లోకి ఉపసంహరించుకోవడానికి గానీ భారత ప్రభుత్వం ఏర్పాట్లు చేసుకుంటోందా? లేక, చివరికి మనం పామిర్ పర్వతాలను అధిరోహించి, ప్రపంచ పైకప్పును గానీ చేరుకోబోతున్నామా? ఇంకా ఎక్కడైనా ధైర్య సాహసాలు మిగిలి ఉన్నాయా?" అని 'ద స్టేట్స్‌మన్' పత్రిక గొప్ప గద్దింపుతో ఉరిమింది. కానీ ఎవరూ ఆ ఉరుమును విన్నట్లు లేరు.

సరే, ఇంత జరిగినా 'ద గ్రేట్ ఫ్లాప్...' రావలసినంతగా ఎందుకు గమనింపునకు రాలేదు? ఎందుకంటే, "ఇండియా వైపు నుంచి ఒక్క అధికారిక ప్రకటన, ఒక్క పరిగణన కూడా లేకపోవడం వల్ల!" మద్రాసును వదిలి సురక్షిత ప్రాంతానికి వెళ్లిపోయిన తన తాత గారి నుంచి, తన తల్లి నుంచి పద్మనాభన్ ఆనాటి విషయాలను తెలుసుకున్నారు. వారు చెప్పిన కథల్ని ఈయన మరింతగా తవ్విపోశారు. తత్ఫలితంగా నాటి భయాలు ఎంత విస్తృతంగా, ఎంత అతిశయోక్తితో ఉండేవో, తరచు వాటి ప్రతిస్పందన ఎంత నవ్వు పుట్టించేలా ఉండేదో ఆయన కనుగొన్నారు.

ఇది కనుక మీకు డాడ్స్ ఆర్మీ (ప్రహసనం)ని గుర్తు చేసినట్లయితే, అలా గుర్తుకు రావటం తప్పేమీ కాకపోవచ్చు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఆందోళనకరమే!



ఇటలీలో 2023వ సంవత్సరంలో కేవలం 3,79,000 జననాలు సంభవించాయి. దేశ ఏకీకరణ జరిగిన 1861 తర్వాత ఇదే అత్యంత తక్కువ సంఖ్య.

– ఎలాన్ మస్క్, పారిశ్రామికవేత్త

గొప్ప పథకం



ప్రాచీన భారతదేశంలో, ఒక మఠంతో మనం ఒప్పందం చేసుకునే వీలుండేది. మీకు వారసులు లేకపోతే (లేదా వాళ్లను నమ్మకపోతే) కొంత ఆస్తిని వాగ్దానం చేయొచ్చు. వృద్ధాప్యం, అనారోగ్యాలు సంభవించినప్పుడు తప్పనిసరి సంరక్షణ, మఠపు ఆసుపత్రిలో చికిత్స దొరికేవి. శేష జీవితాన్ని ఏ చింతా లేకుండా బతకొచ్చు. మంచి బీమా కదా?

– జోసెఫ్ టి. నూనీ, థింకర్

కనబడట్లేదా?



కోవిడ్ టీకాల వల్ల సగటు మానవ ఆయుర్దాయం విజయవంతంగా 45–50 ఏళ్లకు తగ్గిపోయింది. టీకాల అనంతరం గుండె పోట్లు పెరిగాయి. సత్యం మన కళ్లముందు ఇంత స్పష్టంగా కనబడుతున్నప్పటికీ, ప్రభుత్వం, మీడియా దీన్ని నిరాకరిస్తూనే ఉన్నాయి.

– ప్రీతీ రామ్‌దాస్, పాలీమర్ సైంటిస్ట్

పన్ను చెల్లించాలా?



రాజకీయ పార్టీలు ఎందుకు పన్ను చెల్లించాలి? డబ్బులను విరాళాల రూపంలో సేకరించినప్పుడు, ఆటోమేటిగ్గా పన్ను నుంచి మినహాయింపు పొందాలికదా? రాజకీయ పార్టీలకు డబ్బుల ప్రవాహం ఉండనప్పుడు పన్ను ఎందుకు? తప్పు అనిపిస్తోంది.

– కె. సుజాతా రావు, మాజీ ఉన్నతాధికారి

సత్యకాలపు మనుషులు



నా భర్తకు ఏ రాజకీయనాయకుడు ఏ పార్టీలో చేరుతున్నారో తెలియదు. ఆయనకు ఈ తరపు క్రికెటర్లు ఎవరో కూడా తెలీదు. ఆయన సోషల్ మీడియాలో కూడా లేరు. పనికి వెళ్తారు, ఇంటికొస్తారు, భోంచేస్తూ నచ్చిన సినిమా చూస్తారు, మాతో రాత్రి నడకకు వస్తారు, నిద్రపోతారు. ఆయనలాంటి వాళ్లు ఇంకా ఉన్నారు.

– అనామిక ఎ., వ్యాఖ్యాత

భూమికి భారం కాకుండా...



భూ చరిత్రలో ఎన్నడూ లేనంత దుష్టత్వం ఇప్పుడు ప్రపంచంలో నెలకొంది. ఊహించని ప్రదేశాల్లో భూగ్రహం అనూహ్య చర్యలు చూపడం మొదలుపెడితే అప్పుడు రాగాలు తీయొద్దు. నిజానికి మనుషుల్లో కొందరికి ఈ అందమైన గ్రహాన్ని ఇంటిగా కలిగివుండే అర్హతే లేదు.

– ఫ్రాంక్ హూగెర్‌బీట్స్, పరిశోధకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఇన్ బాక్స్

ఖండిస్తున్నాం!

"ఇటీవలి కాలంలో పెరుగుతున్న మతపరమైన అసహన సంస్కృతికి అనుగుణంగా కొన్ని మతోన్మాద శక్తులు సోషల్ మీడియానీ, ఇతర సాధనాలనూ దుర్వినియోగం చేస్తూ, స్త్రీల పట్ల అశ్లీలమైన, అసభ్యకరమైన భాషను వాడుతూ ప్రగతిశీల మహిళా మేధావులు, రచయిత్రులు, జర్నలిస్టులు, యాక్టివిస్టులు, కళాకారులను లక్ష్యంగా చేసు కొని నీచమైన దాడులు చేస్తున్నాయి.

వీరి దృష్టిలో స్త్రీలు వంటింటి కుందేళ్లుగానే జీవించాలి. స్త్రీలు దేశంలో ఏర్పడుతున్న మత, రాజకీయ పరిణామాల గురించి ఆలోచించడం, తమ భావాలను వ్యక్తపరచడం ఈ అప్రజాస్వామిక, సంప్రదాయవాద సమర్థక మూకలకు నచ్చదు. స్త్రీలు తమ ఇష్టాలకు అనుగుణంగా కట్టు, బొట్టు, వేష, భాషలు చేసినప్పుడల్లా ఈ అరాచకులు రంగంలోకి దిగి, వ్యక్తిగతంగా కాల్ చేసి, తలుచుకుంటే వారి ఇళ్లపై దాడులు చేయగలమనీ, ప్రాణహాని తలపెట్టగలమనీ బెదిరింపులకు పూనుకుంటున్నారు. ఈ చర్యలను మేం ఖండిస్తున్నాం.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (ఏ) ఈ దేశ పౌరులందరికీ వాక్ స్వాతంత్ర్యాన్ని ఇచ్చింది. ఫలానా విధంగా అభిప్రాయాలు వ్యక్తపరచకూడదనీ, ఫలానా విధంగానే బతకాలనీ శాసించడం రాజ్యాంగ విరుద్ధం. ఈ ప్రాథమిక హక్కుని ప్రభుత్వంతోబాటు ఎవరూ హరించడానికి వీలులేదు. ఈవిధంగా బెదిరింపులకు, దాడులకు పాల్పడే శక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, అట్టి శక్తుల దూకుడును కట్టడి చేయాలనీ ప్రభుత్వ వర్గాలను, పోలీసు వ్యవస్థను కోరుతున్నాం."

– పౌరహక్కుల సంఘం, తెలంగాణ; మానవ హక్కుల వేదిక, విప్లవ రచయితల సంఘం, చైతన్య మహిళా సంఘం, హైదరాబాద్ విమెన్ రైటర్స్ ఫోరమ్, సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్, మంచి సినిమా గ్రూపు, వాయిస్ ఫర్ జండర్ జస్టిస్, భూమిక, సాహితీ వేదిక (ఢిల్లీ), మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం, మహిళా మరియు ట్రాన్స్ జండర్ సంస్థల ఐక్య కార్యాచరణ వేదిక, పీఓడబ్ల్యూ, అంకురం; ఇంకా పలువురు కవులు, రచయితలు, కార్యకర్తలు, న్యాయ నిపుణులు.

ఇది భూగర్భ జలాలకు ఎసరు!

అభిప్రాయం



డా॥ కె.బి. గోపాలం

భారతదేశపు పొలాలలో సూర్యుడి మీద ఆధారపడి నడిచే పంపుల విప్లవం బలంగా సాగుతున్నది. 2026 సంవత్సరం నాటికి 30 లక్షల కన్నా ఎక్కువ మంది రైతులు భూమిలో నుంచి నీటిని సోలార్ పవర్ పంపులతో తోడబోతున్నారు. అంటే నీళ్లు ఏ ఖర్చు లేకుండా వస్తాయి. ఎంత కావాలంటే అంత దొరుకుతాయి. పంటలు బాగా పండుతాయి. బతుకులు మారుతాయి. అయితే ఇదంతా భూమిలో ఉన్న నీరు అయిపోయేదాకా మాత్రమే కొనసాగుతుంది.

రాజస్థాన్ అంటే ఎడారి రాష్ట్రం అని అందరికీ తెలుసు. కనుకనే అక్కడ మరే రాష్ట్రంలో లేనన్ని సోలార్ పంపులు పనిచేస్తున్నాయి. గడచిన పదేళ్లలో ప్రభుత్వం వారే కనీసం లక్షమంది రైతులకు సబ్సిడీ కింద సోలార్ పంపులు ఇప్పించారు. ఆ పంపులు ఇప్పుడు కనీసం 10 లక్షల ఎకరాలకు నీళ్లు అందిస్తున్నాయి. వ్యవసాయం కోసం వాడే సాగునీటిలో 25 శాతం ఈ పంపుల నుంచే వస్తున్నది. ఫలితంగా భూమిలో నీటి టేబుల్ బాగా తగ్గిపోతున్నది. వాడుకుంటున్న నీటికి సమంగా తిరిగి నీరు చేరడానికి అంతగా వర్షాలు మాత్రం రావడం లేదు.

ఫలితంగా నేలలో 400 అడుగుల దాకా చుక్క కూడా తడి లేకుండా ఆరిపోయిందని లెక్క తేలింది. అంతకుమించిన లోతు నుంచి పంపులు నీళ్లు తోడలేవు. కనుక చాలా పంపులు పని లేకుండా పడి ఉన్నాయి. తరిగిపోతున్న నీటి నిల్వలను వాడుకోవడానికి పోటీ మొదలైంది. ధనవంతులైన రైతులు మరింత బలమైన పంపులను తెచ్చుకుంటున్నారు. ఆ పని చేతకానివారు చూస్తూ ఊరుకోవాలి. లేదా పెద్ద పంపులు ఉన్న రైతుల వద్ద నీళ్లు కొనాలి.

ఈ నీళ్ల కరువు పరిస్థితి ఒక్క రాజస్థాన్‌లో మాత్రమే కాదు. నీటి ఎద్దడి ఉన్న మిగతా రాష్ట్రాలన్నింటిలో కూడా ఇదే పరిస్థితి నెమ్మదిగా పెరుగుతున్నది. అదే రకంగా ఆఫ్రికా మరికొన్ని చోట్ల కూడా సోలార్ పంపుల వాడకం పెరుగుతున్నది. వెలుగు ఉన్నంత కాలం ఈ పంపులు పనిచేస్తూనే ఉంటాయి. ఫలసాయాలు పెరుగుతున్నాయి. వ్యవసాయం లాభసాటిగా ఉంటున్నది. కానీ సౌరశక్తితో నడిచే ఈ వ్యవసాయ విప్లవం భూగర్భజలాలను రాను రాను కనుమరుగు చేస్తున్నది. భూమి లోపలి నీటి నిల్వలు ఎండిపోతున్నాయి, సోలార్ పంపుల వాడకంవల్ల కలిగే లాభం కన్నా రానున్న నష్టం మరీ ఎక్కువగా ఉంది అంటున్నారు ప్రపంచ బ్యాంకు ఆర్థిక నిపుణురాలు సౌమ్యా బాలసుబ్రమణ్య.



ప్రపంచ బ్యాంకు వారి విధానాల కారణంగా 20వ శతాబ్దిలో పంట పొలాలకు కృత్రిమ పద్ధతుల ద్వారా సాగునీటిని అందించడం అన్న కార్యక్రమం బలంగా సాగింది. జలాశయాలు, కాలువలు పెద్ద ఎత్తున కట్టి వాడుకున్నారు. ఎక్కువ దిగుబడి నిచ్చే కొత్తరకాల పంటల ద్వారా హరిత విప్లవం బాగా సాగింది. పెరుగుతున్న ప్రపంచ జనాభాకు తిండి అందింది. అయితే ఈ విధానా లకు ఒక పరిధి ఉందని అర్థం అయింది. నదులు ఎండి పోయినాయి. పెట్టుబడులు కూడా ఎండిపోయినాయి. ఉష్ణ మండలం పొడి ప్రాంతాలలో గత మూడు దశాబ్దాలుగా రైతులందరూ నీటి కోసం భూగర్భ వనరుల మీద ఆధారపడడం మొదలైంది. ఈ పరిస్థితి అటు మెక్సికోలో మొదలు మధ్యప్రాచ్యం, దక్షిణ ఆసియాలోని వేడి ప్రాంతాలలో బాగా కనిపించింది.

ప్రపంచ బ్యాంకు వారు భూగర్భ జలాల వాడకం గురించి ఒక పరిశీలన చేశారు. రాళ్ల ప్రాంతాలలో వేసిన బోరు బావుల ద్వారా ప్రపంచంలోని సాగునీరు నలభయి మూడుశాతం వరకు అందుతున్నది అని తెలిసింది. భూమిలోని నీటిలో 70 శాతం వ్యవసాయానికే వాడుతున్నారు. ఏడాదికి రెండు వందల క్యూబిక్ మైళ్ళ నీరు ఈ రకంగా వాడుక అవుతున్నది. వర్షం వల్ల భూమిలోకి చేరే నీరు మాత్రం దీనికన్నా కనీసం 70 క్యూబిక్ మైళ్ళు తక్కువగా ఉంది. 40 దేశాలలో సుమారు 1700 బావుల మీద పరిశీలన జరిపి లెక్కలు తీశారు. నీటి వనరులు భయంకరంగా తరిగిపోతున్నాయి అని తెలిసింది.

క్యాలిఫోర్నియా యూనివర్సిటీలోని జలశాస్త్ర నిపుణులు స్కాట్ జషేకో చేసిన పరిశీలన ప్రకారం భారతదేశంలోని భూగర్భ జలాలు ఏటా మూడు అడుగుల ప్రకారం కిందకు పోతున్నాయి. ఇదే పరిస్థితి ఇరాన్, అఫ్గానిస్తాన్, స్పెయిన్, మెక్సికో, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, చిలీ, సౌదీ అరేబియా మరికొన్ని దేశాలలో కూడా కనిపిస్తున్నది.

భవిష్యత్తులో పరిస్థితి మరింత దారుణంగా ఉండబోతున్నదని అంటున్నారు నిపుణులు. ప్రపంచమంతటా ఆహార భద్రత విషయంగా ఈ నీటి ఎద్దడి అన్నది పెద్ద సమస్యగా మారిపోతున్నది. ఈ విషయాన్ని విశ్వవిద్యాలయంలో వ్యవసాయ భవిష్యత్తును గురించి పరిశీలిస్తున్న మేహా జైన్ అనే పరిశోధకురాలు తెలియజేశారు.

ప్రభుత్వాలు మాత్రం సౌర విద్యుత్ ద్వారా భూగర్భ జలాల వాడకాన్ని ఆపడానికి బదులు మరింత ప్రోత్సహిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి అంటున్నారు నిపుణులు. ఇది అందరికీ అపాయకరమైన పరిస్థితి.

వ్యాసకర్త సైన్స్ అంశాల రచయిత

పరోపకారమే పరమ సుఖం

మనిషి కష్టజీవి. శారీరకమైనదైనా లేక బుద్ధితో చేసేదైనా కష్టం చేస్తూ కాలం గడపడం మనిషికి దేవుడు కల్పించిన సహజ ప్రకృతి. కష్టం ఉన్న చోట సహజంగానే స్వార్థం ఉంటుంది. తాను కష్టపడి ఆర్జించిన సొమ్ము తనవాళ్ళకు మాత్రమే చెందాలనే ఆలోచన విపరీతం అనిపించుకోదు. కనుకనే కుటుంబం అనే వ్యవస్థలో వ్యక్తులు కష్టపడి సంపాదించి కూడబెట్టడం జరుగుతుంది. అలా కూడబెట్టిన సంపదతో సుఖించేది తనవాళ్ళే అన్న భావన కష్టం చేసే వ్యక్తి చిత్తానికి ఆనందాన్ని, ఊరటను కలిగిస్తుంది. అయితే, అలా సంపాదించి సంపదను నిరుపయోగం చేయడం, నేలమాళిగల పాలుచేయడం సరైన పని కాదనీ, అలా చేయడం వలన చిత్తం ఎప్పటికైనా అశాంతి పాలవుతుందే తప్ప సాంత్వన చేకూరదనీ ఆధ్యాత్మిక దృక్పథం ఉపదేశిస్తుంది. కొన్ని శతాబ్దాలుగా ఈ ఆధ్యాత్మిక దృక్పథం మనిషి ఆలోచనలో మెదులుతూ వస్తున్నదనడానికి 'మనిషి ఎంత సంపాదించినప్పటికీ ఆ సంపాదనలో అతడికి ఉపయోగపడేది మాత్రం అతడు ఎంత తింటాడో అంత మాత్రమే!' అనే అర్థంలో తెలుగునాట స్థిరపడిపోయిన సామెతలు సాక్ష్యంగా నిలుస్తాయి. ఆ సామెతలలో ఒక వినసొంపైన సామెతను ఆలంబనగా చేసుకుని 'కుచేలోపాఖ్యానము' కావ్యం, ప్రథమాశ్వాసంలోని ఒక కంద పద్యంలో ఆ కావ్యకర్తయైన గట్టు ప్రభువు సంగతినంతా సంక్షిప్తీకరించి చెప్పాడు:



జ్యోతిర్మయం

కాంతలు మేనులు సతమని
వంతులతో గూర్తు రఖిల వస్తువుల నరుల్
ఎంత గడించిన గూటికి
నెంతటివాడైన గాటి కిందునిభాస్యా!

యవ్వనం, సుఖం శాశ్వతం అన్న భ్రమ మనసును ఆవహించగా ఎన్నెన్నో పాట్లుపడి డబ్బు, వస్తువులు గడించి కూడబెడతారు. అయితే 'ఎవడు ఎంత సంపాదించినా అందులో అతడికి ఉపయోగపడేది ఎంత?' అని ప్రశ్న వేసుకుంటే 'తాను ఆ పూటకు తిన్నంత!' అని ఎలాగైతే సమాధానం వస్తుందో, అలాగే 'ఎవడు ఎంతటి మహామహుడైనా, వీరుడైనా, శూరుడైనా చివరికి చేరేది ఎక్క డికి?' అనే ప్రశ్నకు 'శ్మశానానికే!' అనే సమాధానం కూడా అంత కచ్చితంగానూ వస్తుంది. కనుకనే 'ఎంత గడించినా కూటికే, ఎంతటివాడైనా కాటికే!' అనే సామెతలో వాస్తవాన్ని నిక్షిప్తం చేసి చెప్పిన మన పూర్వీకులు, ఆ సామెత ద్వారా కూడబెట్టడంలో కూడా విజ్ఞతను పాటించి కొంతలో కొంతైనా సంపదను తోటివాడి అవసరానికి ఉపయోగపడేలా చేసి సుఖపడమని హితవు పలికారు.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.సప్తమి సా.4.37 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** మూల రా.7.07 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** సా.5.33 నుండి 7.05 వరకు, తదుపరి తె.4.32 నుండి 6.04 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.29 నుండి 1.17 వరకు, తదుపరి ప.2.57 నుండి 3.45 వరకు, **అమృతఘడియలు:** ప.12.41 నుండి 2.13 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.59, **సూర్యాస్తమయం:** 6.08.

క్లుప్తంగా...

జోగుళాంబ సన్నిధిలో మీనారామనాథన్



బాలబ్రహ్మేశ్వరుడికి పూజలు చేస్తున్న మీనారామనాథన్

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపురం శ్రీ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను ఆదివారం రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఇన్‌చార్జి అధ్యక్షుడు మీనారామనాథన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈవో పురేందర్ కుమార్ ఆలయ అర్చకులతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ముందుగా ప్రధాన ఆలయమైన బాలబ్రహ్మేశ్వరుడి స్వర్ణలింగానికి ఏకవార రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం అమ్మ వారికి త్రిశతి అర్చనలు జరిపారు.

కడియం కులంపై విచారించాలి

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌మాదిగ



ముషీరాబాద్: మాజీ మంత్రి కడియం శ్రీహరి కులంపై సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కడియం శ్రీహరి ఒకసారి తాను మాదిగని.. మరోసారి తనది బైండ్ల కులమని.. మరోసారి పద్మశాలినని.. ఇలా ఒక్కొక్కసారి ఒక్కోరకంగా చెబుతున్నారని చెప్పారు. ఆయన కులంపై పలు అనుమానాలున్నాయని సందేహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మోత్కుపల్లి నర్సింహులును, బీఆర్‌ఎస్‌లో తాటికొండ రాజయ్యను, ఆరూర్ రమేశ్‌ను, పసునూరి దయాకర్‌ను బలి పశువును చేసిన శ్రీహరి.. ఇప్పుడు బీఆర్‌ఎస్ పార్టీకే ద్రోహం చేసి కాంగ్రెస్‌లో చేరారని అన్నారు.

శ్రీహరిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న యువకుడిని అడ్డుకుంటున్న సహచరులు

ధర్మసాగర్: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవద్దని జన పోరాట సమితి సభ్యుడు దార విజయ్‌కాంత్ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే మిగతా జన పోరాట సమితి సభ్యులు అతన్ని అడ్డుకొని పెట్రోల్ బాటిల్ లాక్కున్నారు. హనుమకొండ జిల్లా ధర్మ సాగర్ మండల కేంద్రంలో జన పోరాట సమి తి వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు భరత్ ఆదివా రం విలేకరులతో మాట్లాడుతున్నప్పుడు ఈ సంఘటన జరిగింది. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి లాంటి పొలిటికల్ క్రిమినల్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం ఏ మాత్రం సరికాదన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అంటి పెట్టుకొని గెలుపు కోసం పనిచేసిన సింగపురం ఇందిరకు వరంగల్ ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరారు.

భద్రాద్రి ఫొటోల కేసులో పురోగతి

భద్రాచలంటౌన్: భద్రాచలం దేవస్థానంలో స్వామివారి మూలమూర్తుల ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టిన ఘటనపై పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. ఈ అంశంపై భక్తుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతుండడంతో పోలీసులు దర్యాప్తుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. మాజీ ఎంపీ, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్ శనివారం రామయ్య దర్శనానికి వచ్చిన సందర్భంగా కొందరు మూలమూర్తుల ఫొటోలను తీసిన విషయం తెలిసిందే. పోలీసులు ఆదివారం ఆలయంలో సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా బాధ్యుడిని గుర్తించారు.

అయిందేదో అయింది!

- నా ఆరోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకోండి
- 'ట్యాపింగ్'కేసులో రాయబారాలు ప్రారంభించిన ఎస్‌ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు
- ఇప్పటికే ఓ ఉన్నతాధికారికి ఫోన్ చేసి భంగపాటు
- ఇప్పుడు ప్రభుత్వ పెద్దల దగ్గరకు ఆయన ప్రతినిధులు
- ఈ కేసులో జోక్యం చేసుకోబోనన్న ఓ ముఖ్య నేత
- కొనసాగుతున్న ఇద్దరు అదనపు ఎస్పీల విచారణ



సాక్షి, హైదరాబాద్: అక్రమ ట్యాపింగ్ కేసులో తన చుట్టూ ఉచ్చు బిగుస్తుండటంతో విదేశాల్లో తలదాచుకున్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్‌ఐబీ) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు రాయబారాలు మొదలు పెట్టారు. అయిందేదో అయింద ని.. తన ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా కఠిన చర్యలు తీసుకోవద్దని కోరుతూ కొందరు ప్రతినిధులను ప్రభుత్వ పెద్దల వద్దకు పంపినట్టు తెలిసింది. కానీ ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించిన 'ముఖ్య' నాయకుడు ఈ దశలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేసినట్టు సమాచారం. మరోవైపు తమ కస్టడీలో ఉన్న అదనపు ఎస్పీలు నాయిని భుజంగరావు, మేకల తిరుపతన్నలను సిట్ అధికారులు ఆదివారం కూడా లోతుగా ప్రశ్నించారు.

ఉన్నతాధికారి వద్ద భంగపడటంతో..

ఎస్‌ఐబీ కార్యాలయంలో ఫోన్ ట్యాపింగ్ ఆధారాల ధ్వంసంపై అంతర్గత విచారణ గత ఏడాది డిసెంబర్‌లోనే మొదలైంది. దీనిపై ఆ విభాగంలోని తన మనుషుల ద్వారా సమాచారం అందుకున్న ప్రభాకర్‌రావు.. ఓఎస్డీ పదవికి రాజీనామా చేసి గుట్టుచప్పుడు కాకుండా అమెరికా వెళ్లిపోయారు. తర్వాత అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదవడం, ప్రణీత్‌రావు అరెస్టు తదితర పరిణామాలు జరిగాయి. పంజగుట్ట పోలీసులు గత నెల మూడో వారంలో ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు, ఓ మీడియా అధినేతలపై లుకౌట్ సర్క్యులర్లు జారీ చేశారు. కేసులో అనుమానితులుగా ఉన్నవారి ఇళ్లలో సోదాలు చేసి పలు ఆధారాలు సేకరించారు. దీనితో ఇలాంటి చర్యలు వద్దంటూ అమెరికా నుంచే ప్రభాకర్‌రావు ఓ పోలీసు ఉన్నతాధికారికి ఫోన్ చేశారు. ఆయన సమాధానం విని కంగుతిని ఫోన్ కట్ చేశారు.

రాధాకిషన్‌రావు అరెస్టుతో మారిన సీన్..

తర్వాత కొందరితో ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపిన ప్రభాకర్‌రావు మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. అక్రమ ట్యాపింగ్‌కు తానే ఎలా బాధ్యుడిని అవుతానని? తనపై ఉన్న అదనపు డీజీ, డీజీపీలకూ బాధ్యత ఉంటుందనే ధోరణిలో మాట్లాడారు. ఎస్‌ఐబీ, ఇంటెలిజెన్స్‌ల్లో పనిచేసిన అదనపు ఎస్పీలు తిరుపతన్న, భుజంగరావులతోపాటు మరో కీలక నిందితుడిగా ఉన్న హైదరా బాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావునూ అరెస్టు చేశారు. దీనితో ప్రభాకర్‌రావు హడలిపోయారు. స్వదేశానికి తిరిగొచ్చాక తనకూ ఇది తప్పదని భావించి.. ప్రభుత్వ పెద్దలు, 'ముఖ్య' నాయకుడి వద్దకు రాయబారం ప్రారంభించారు. తమ సామాజిక వర్గానికి చెందిన కీలక నాయకుల ద్వారా కొందరు మధ్యవర్తులను పంపారు. వారు ఇటీవల ప్రభుత్వ పెద్దలను, 'ముఖ్య' నాయకుడిని కలిశారు. అప్పటి పరిస్థితులు, ఒత్తిళ్ల కారణంగా ట్యాపింగ్, ఇతర చర్యలకు పాల్పడాల్సి వచ్చిందని, తదుపరి చర్యలు కఠినంగా లేకుండా చూడాలని ప్రభాకర్‌రావు కోరుతున్నట్టు వివరించారు. కానీ సదరు 'ముఖ్య' నాయకుడు తాను జోక్యం చేసుకోబోనని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ అంశంలో పోలీసులు చట్టప్రకారం వ్యవహరిస్తున్నారని.. స్వదేశానికి తిరిగొచ్చి, దర్యాప్తు అధికారుల ఎదుట పూర్తి వాస్తవాలు బయట పెట్టాల్సిందేనని పేర్కొన్నట్టు సమాచారం. మరోవైపు ప్రభాకర్‌రావుకు సమీప బంధువైన ఓ మహిళ.. సీనియర్ ఐపీఎస్‌లను, ఉన్నతాధికారుల భార్యలను కలుస్తూ ప్రభాకర్‌రావు తరఫున రాయబారాన్ని ప్రయత్నించినట్టు అయితే అన్ని ప్రయత్నాలూ బెడిసికొట్టడంతో ఒకట్రెండు రోజుల్లో స్వదేశానికి తిరిగి రావాలని ప్రభాకర్‌రావు భావిస్తున్నట్టు తెలిసింది.

ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల పరిశీలన

సిట్ అధికారులు తమ కస్టడీలో ఉన్న భుజంగరావు, తిరుపతన్నలను మూడో రోజు ఆదివారం వివిధ కోణాల్లో ప్రశ్నించారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను విశ్లేషిస్తున్నారు. ఎస్‌ఐబీ, ఇంటెలిజెన్స్‌లలో వీరి కింద పనిచేసిన పలువురు అధికారులు, సిబ్బందిని సిట్ ప్రశ్నించి.. వాంగ్మూలాలు నమోదు చేస్తోంది. గత ఎన్నికల సమయంలో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్‌తోపాటు ఎస్‌ఐబీ పోలీసులు తమ వాహనాల్లో ఓ పార్టీకి సంబంధించిన నగదు రవాణా చేసినట్టు ఇప్పటికే దర్యాప్తు అధికారులు గుర్తించారు. దానికి సంబంధించి అదనపు వివరాలు సేకరించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది.

పోలీసులు X గిరిజనులు

- పోడు విషయంలో గిరిజన వర్గాల మధ్య వాగ్వాదం
- అడ్డుకునేందుకు వెళ్లిన పోలీసులపై దాడి
- సత్తుపల్లి సీఐ కిరణ్, కానిస్టేబుళ్లకు గాయాలు
- ఖమ్మం జిల్లా చంద్రాయపాలెంలో ఉద్రిక్తత



సీఐ కిరణ్, పోలీసు సిబ్బందిని చుట్టుముట్టి దాడి చేస్తున్న గిరిజనులు

సత్తుపల్లి: గిరిజన వర్గాల మధ్య చోటుచేసుకున్న వివాదాన్ని పరిష్కరించేందుకు వెళ్లిన సత్తుపల్లి పోలీసులపై గిరిజనులు దాడికి దిగారు. ఘటన పూర్వాపరాలిలా.. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడు శివారు చంద్రాయపాలెం అటవీ ప్రాంతంలోని 400 హెక్టార్లలో కొంతకాలంగా స్థానిక గిరిజనులు, స్థానికేతర గిరిజనుల మధ్య పోడు వివాదం నడుస్తోంది. గిరిజనులకు నేతృత్వం వహిస్తున్న కూరం మహేంద్రను అటవీశాఖ అధికారుల ఫిర్యాదు మేరకు శనివారం సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌కు సీఐ టి.కిరణ్ పిలిపించి విచారించి పంపించారు. ఈక్రమంలో చంద్రాయపాలెంకు చెందిన గిరిజనులు ఆదివారం ఉదయం డయల్ 100కు ఫోన్ చేసి స్థానికేతర గిరిజనులు తమ భూముల్లోకి వస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. దీంతో తొలుత ఎస్సై రాజు, ముగ్గురు పోలీసు సిబ్బంది వెళ్లారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్న సమాచారంతో సీఐ టి.కిరణ్ మరో ఇద్దరు కానిస్టేబుళ్లతో కలిసి చేరుకున్నారు.

సీఐ కిరణ్‌పై మెరుపుదాడి..

అదే సమయంలో గిరిజన నేత కూరం మహేంద్ర ఫోన్‌లో మాట్లాడుతుండగా, 'నిన్ననే కదా నీతో మాట్లాడి పంపించింది.. మళ్లీ గొడవ ఏమిటి' అంటూ సీఐ కిరణ్ ఆయన ఫోన్ స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో ఇరువురి మధ్య వాగ్వాదం, తోపులాట జరిగాయి. ఇంతలో ఒక్కసారిగా గిరిజన మహిళలు కోపోద్రిక్తులై సీఐ కిరణ్‌ను చుట్టుముట్టి పిడిగుద్దులతో దాడికి పాల్పడ్డారు. ఘటనా స్థలంలో ఉన్న కానిస్టేబుళ్లు పి.నర్సింహారావు, ఇమ్రాన్, సత్యనారాయణ, నరేష్ కలిసి సీఐ కిరణ్‌ను కాపాడుకునే ప్రయత్నంలో చుట్టూ రక్షణ కవచంలా నిలిచి పోలీస్ వ్యాన్ వైపు తీసుకొస్తుండగా గిరిజనులు కర్రలతో వెంబడించి దాడి చేశారు. అతి కష్టం మీద అక్కడి నుంచి సీఐ కిరణ్‌ను పోలీసులు తీసుకొని బయ టపడ్డారు. ఈ ఘటనలో సీఐ కిరణ్ చొక్కా చిరిగిపోయింది.

పోలీస్ పికెట్ ఏర్పాటు

విషయం తెలుసుకుని కల్లూరు ఏసీపీ రఘు, రూరల్ సీఐ వెంకటేశం, డివిజన్‌లోని ఎస్సైలు, పెద్ద సంఖ్యలో సిబ్బంది చంద్రాయపాలెం బయలుదేరారు. మార్గమధ్యలో బుగ్గపాడు శివారులో పోలీసులపై దాడి చేసిన గిరిజనులు గుంపులుగా వస్తుండగా పోలీసులు వారిని చుట్టుముట్టారు. గిరిజనులు ప్రతిఘటించటంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పి కూరం మహేంద్రతో సహా గిరిజనులను అదుపులోకి తీసుకున్నారు. ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

భద్రత ఉంటేనే అమెరికా చదువులకు!

▶ మొదటి పేజీ తరువాయి

పంపి అక్కడి పరిస్థితుల గురించి వాకబు చేయిస్తున్నారు. 2024 అడ్మిషన్ల ఫలితాలు వెల్లడవుతున్న తరుణంలో ఇలాంటి భయాలు తల్లిదండ్రుల్లో ఎక్కువయ్యాయని కన్సల్టెంట్లు అంటున్నారు. అమ్మాయిలను అమెరికాలో పైచదువులకు పంపే తల్లిదండ్రులు మరింత ఎక్కువగా విచారణ చేయిస్తున్నారని బెంగుళూరుకు చెందిన ఓ కన్సల్టెన్సీ సంస్థ సీఈవో ఆదర్శ ఖండేల్వాల్ తెలిపారు. 'ప్రస్తుతం అడ్మిషన్ ఫలితాలు వెలువడుతున్నాయి. 2024లో భద్రత అనేది ఒక ప్రధాన అంశంగా మారింది' అని ఆయన వ్యాఖ్యానించారు.

క్రైం రేటుపై వాకబు..

అమెరికాలోని ఏయే యూనివర్సిటీల పరిధిలో ఎంత క్రైం రేటు ఉంది? ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి? డ్రగ్స్ ప్రభావం ఏమైనా ఉందా? అనే అంశాలను తల్లిదండ్రులు ఎక్కువగా పరిశీలిస్తున్నారు. అండర్ గ్రాడ్యుయేట్ చదువుల కోసం పిల్లలను పంపే తల్లిదండ్రుల్లో నేరాలపై ఎక్కువ ఆందోళన కనిపిస్తోంది. తొలిసారి దేశానికి, కుటుంబానికి దూరంగా ఉండాల్సి రావడమే దీనికి ప్రధాన కారణమని విదేశీ కన్సల్టెన్సీలు విశ్లేషిస్తున్నాయి. షికాగో, బోస్టన్, ఇండియానా వంటి ప్రాంతాల్లో భారతీయ విద్యార్థులపై దాడులతోపాటు అక్కడ ఎక్కువ హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తాజా నివేదికలు ఇవే వెల్లడించడంతో ఈ ప్రాంతాలకు పంపాలంటే తల్లిదండ్రులు వెనుకంజ వేస్తున్నారు. అమెరికా వెళ్లే భారతీయ విద్యార్థుల భద్రతకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని పెప్సికో మాజీ సీఈఓ ఇంద్రా నూయి ఇటీవల ఓ వీడియో విడుదల చేయడం కలకలం రేపింది.

సమస్యాత్మకం కాని వర్సిటీల వైపే

అమెరికన్ యూనివర్సిటీలకు వస్తున్న దరఖాస్తులను పరిశీలిస్తే తక్కువ సమస్యాత్మకమైన వాటినే భారతీయ విద్యార్థులు ఇష్టపడుతున్నారు. దీనిపై సమగ్ర అవగాహన కలిగాకే విదేశీ చదువులపై ప్రణాళిక రచిస్తున్నారని విదేశాల్లోని స్టడీ కెరీర్ కన్సల్టెన్సీ వ్యవస్థాపకుడు కరణ్ గుప్తా తెలిపారు. పెద్ద నగరాలు లేదా తక్కువ సమస్యాత్మకమైనవిగా గుర్తించే యూఎస్ వర్సిటీల ఆఫర్లను మాత్రమే ఇష్టపడుతున్నారని తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ విద్యార్థి ఫ్లోరిడాలోని 'చి' యూనివర్సిటీని ఎంపిక చేసుకున్నాడు. అయితే ఆ ప్రాంతంపై సమగ్ర సమాచారం సేకరించిన తల్లిదండ్రులు తమ కుమారుడిని ఆ వర్సిటీలో కాకుండా ఎన్‌వైయూ యూనివర్సిటీ మంచిదని అందులో చేర్పించారు. 95% కేసుల్లో, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం తల్లిదండ్రులు స్వీయ నిర్ణయాలు తీసుకుంటున్నారని మరో కన్సల్టెంట్ గుప్తా తెలిపారు. ఆరిజోనా, ఒహాయో, టెక్సాస్, లాస్ ఏంజిలెస్, కాలిఫోర్నియా, డాలస్ వంటి ప్రాంతాలకు తమ పిల్లలను పంపాలనుకొనే తల్లిదండ్రులు ఎక్కువ జాగ్రత్తలు కోరుతున్నారు. వరంగల్‌కు చెందిన ఓ విద్యార్థి కాలిఫోర్నియాలోని క్లేర్‌మాంట్ మెక్‌కెన్నా కాలేజీలో చేరాలని ఇష్టపడ్డాడు. కానీ అతని తల్లిదండ్రులు మాత్రం దానికి బదులుగా బోస్టన్ విశ్వవిద్యాలయం నుంచి ఆఫర్‌ను తీసుకోవాలని పట్టు బట్టారు, విద్యార్థి మేనమామ అక్కడ నివసిస్తున్నాడని, అది భద్రత కల్పిస్తుందని భావించారు.

కన్సల్టెన్సీల్లోనూ ఆందోళన

భారతీయ విద్యార్థులపై ఆందోళనల నేపథ్యంలో కన్సల్టెన్సీలూ జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తోంది. విద్యార్థుల తల్లిదండ్రులను మెప్పించే రీతిలో వ్యవహరించేందుకు ప్రయతిస్తున్నాయి. ఇందులో భాగంగా కన్సల్టెన్సీలన్నీ కలిపి తొలిసారిగా విద్యార్థుల భద్రత కోసం కొన్ని మార్గదర్శకాలు రూపొందించాయి. ముందుగా విద్యార్థుల భద్రతపై అవగాహన కల్పిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో ఆయా ప్రదేశాల సమాచారం అందుబాటులోకి తేవడంతోపాటు అవసరమైతే విద్యార్థులు, తల్లిదండ్రుల బృందాలు కూడా ఆయా వర్సిటీలను సందర్శించేందుకు, అక్కడి సీనియర్ విద్యార్థులతో సంప్రదింపులు జరిపేందుకు అవకాశం కల్పిస్తున్నాయి.

కాంగ్రెస్‌లోకి కడియం

▶ మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీలు ఆయనతో పాటు కావ్యకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జహీరాబాద్ నేతలతో భేటీ

కడియం శ్రీహరి పార్టీలో చేరిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ నేతలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో అనుసరించాల్సిన ఎన్నికల వ్యూహంపై సీఎం రేవంత్ మార్గనిర్దేశం చేశారు. సోమవారం ఆయన మెదక్ నేతలతో సమావేశం కానున్నారు.

నేడు ఢిల్లీకి సీఎం: కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) భేటీలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీ వెళ్లనున్నారు. వాస్తవానికి, లోక్‌సభ అభ్యర్థుల ఖరారు కోసం ఢిల్లీలో సీఈసీ సమావేశం ఆదివారమే జరగాల్సి ఉన్నప్పటికీ అది వాయిదా పడడంతో సీఎం రేవంత్ ఆదివారం ఢిల్లీ పర్యటన రద్దయింది. సోమవారం జరిగే సమావేశంలో పాల్గొనేందుకు గాను ఆయన మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీ వెళ్లనున్నట్టు సీఎంవో వర్గాలు వెల్లడించాయి. ఆయనతో పాటు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సీఈసీ సభ్యుడు, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లనున్నారు. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఖమ్మం, కరీంనగర్, హైదరా బాద్, వరంగల్ స్థానాలకు అభ్యర్థులను ఈ సమావేశంలో ఖరారు చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

సర్కారుపై 'విరమణ' భారం!

▶ మొదటి పేజీ తరువాయి

బెనిఫిట్ల కింద రూ.3,200 కోట్ల వరకు అవసరమని ఆర్థిక శాఖ అంచనా. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగుల మెడికల్ బిల్లుల చెల్లింపు కూడా కష్టమవుతుండటం, ఇక నుంచి ఏటా రిటైర్మెంట్ల భారం మరింత పెరగనుండటం ఆర్థిక శాఖను కలవరపెడుతోంది.

సరాసరి రూ.40 వేల మూల వేతనం

ఈ ఏడాది రిటైర్మెంట్లను పరిశీలిస్తే 1,419 మంది గెజిటెడ్ స్థాయి, 5,360 మంది నాన్ గెజిటెడ్ స్థాయి, 1,216 మంది క్లాస్–4 ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్నారు. నాన్ గెజిటెడ్ వారు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో.. రిటైరయ్యే వారి సగటు మూల వేతనం రూ.40వేల వరకు ఉంటుందని అంచనా. దీనికి హెచ్‌ఆర్‌ఏ, సీసీఏ, డీఏలు కలిపితే ఈ మొత్తం రూ.60 వేల వరకు ఉంటుంది. రిటైరయ్యే ప్రతి ఉద్యోగికి లీవ్ శాలరీల కింద 10 నెలల వేతనాన్ని.. అంటే రూ.6 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుంది. దీనికితోడు గ్రాట్యుటీ కింద రూ.12 లక్షలు, కమిటేషన్ కింద రూ.20 లక్షలు ప్రభుత్వ ఖజానా నుంచి చెల్లించాలి. అంటే సగటున ప్రతి రిటైర్డ్ ఉద్యోగికి రూ.38లక్షల నుంచి రూ.40 లక్షల వరకు తక్షణ బెనిఫిట్లను వారి హక్కుగా ఇవ్వాలి. ఈ ఏడాది రిటైరయ్యే 7,995 మందికి ఈ బెనిఫిట్లను చెల్లించాలంటే రూ.3 వేల కోట్లకుపైగా అవసరం. ఇక 2025లో 9,630 మంది, 2026లో 9,719 మంది, 2027లో 9,443 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేస్తారని లెక్కలు చెప్తున్నాయి. అంటే వారికి తక్షణ బెనిఫిట్ల కింద సగటున ఏటా రూ.3,500 కోట్ల వరకు చెల్లించాలి. దీనితో ఖజానాపై భారం పడుతుందని ఆర్థిక శాఖ వర్గాలు చెప్తున్నాయి.

ప్రస్తుత పరిస్థితేమిటి?

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన మెడికల్ బిల్లులు, సరెండర్ లీవ్స్‌లకు కూడా చెల్లించే పరిస్థితి లేదని ఆర్థిక శాఖ వర్గాలు చెప్తున్నాయి. వీటికితోడు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2022 జూలై, 2023 జనవరి, జూలై, 2024 జనవరిలో చెల్లించాల్సిన నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత ఐదో డీఏ (జూలై, 2024) కూడా ముందుకు వస్తుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో.. ఈ నాలుగు డీఏల చెల్లింపును సర్కారు వాయిదా వేస్తూ వస్తోంది. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ ఉద్యోగులు సాధారణ జీవిత బీమా (జీఎల్ఐ) కింద జమ చేసుకున్న నిధులను కూడా వాడుకోవాల్సి వచ్చిందని ఆర్థికశాఖ వర్గాలు చెప్తున్నాయి. ఇప్పుడు రిటైరైన ఉద్యోగులకు వారి జీఎల్ఐతోపాటు జీపీఎఫ్‌పై వడ్డీ చెల్లించాలని.. ఇవన్నీ కలిపితే చాలా భారం పడుతుందని ఆర్థిక శాఖ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. గత ప్రభుత్వం పదవీ విరమణ వయసు పెంచి అప్పటికి ఈ భారం నుంచి గట్టెక్కిందని.. ఇప్పుడు చెల్లించక తప్పదని తెలిపారు. ఈ చెల్లింపుల కోసం నెలకు రూ.250 కోట్లదాకా అవసరమన్నారు.

ఎప్పటికప్పుడే బెనిఫిట్లు చెల్లించాలి: ఉద్యోగ సంఘాలు

రిటైర్మెంట్లతో సర్కారుపై భారమన్న ప్రచారంపై ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రతి ఉద్యోగి రిటైరవడానికి మూడు నెలల ముందే బెనిఫిట్ల కోసం దరఖాస్తు చేసుకుంటారని, ఉద్యోగుల హక్కు కింద ప్రభుత్వం వాటిని ఎప్పటికప్పుడే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి. పదవీ విరమణ వయసును మరోసారి పెంచడం వంటి ఆలోచనలు చేయవద్దని కోరుతున్నాయి.

టీవీ–5 సాంబశివరావుపై ఫిర్యాదు


- ప్రణీత్‌రావు, ప్రభాకర్‌రావు, భుజంగరావులపై కూడా..
- తనను వేధించారన్న సంధ్య కన్వెన్షన్ అధినేత శరణాల శ్రీధర్‌రావు
- న్యాయ సలహా తర్వాత చర్యలు చేపడతామన్న పంజగుట్ట పోలీసులు

బంజారాహిల్స్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులైన ప్రణీత్‌రావు, ప్రభాకర్‌రావు, భుజంగరావుతోపాటు టీవీ–5 యాంకర్ సాంబశివరావు తనను వేధింపులకు గురిచేశారని.. వారిపై చర్యలు తీసుకోవాలంటూ ప్రముఖ వ్యాపారవేత్త, సంధ్య కన్వెన్షన్ అధినేత శరణాల శ్రీధర్‌రావు పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు న్యాయ సలహా అనంతరం తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.

వ్యాపారంలో సాయం చేస్తానంటూ...

ఈ ఫిర్యాదులోని వివరాలు ప్రకారం.. జూబ్లీహిల్స్‌లోని నందగిరిహిల్స్‌లో నివసించే శరణాల శ్రీధర్‌రావు మూడు దశాబ్దాలుగా పలు వ్యాపార సంస్థలు నిర్వహిస్తూ రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ, ఫుడ్ కోర్టులు, స్వచ్ఛంద సేవా సంస్థలను నిర్వహిస్తున్నారు. 2017–18 మధ్య సాంబశివరావు అనే వ్యక్తి శ్రీధర్‌రావు వద్దకు వచ్చి 'మీకు వ్యాపారంలో కావాల్సిన సహాయం చేస్తా.. ఆర్థిక కష్టాల్లో ఉన్న నన్ను ఆదుకోవాలి' అని కోరాడు. అందుకు శ్రీధర్‌రావు ఒప్పుకొని సాంబశివరావు ఉంటున్న ఇంటికి సైతం నెలనెలా కిరాయి చెల్లిస్తూ వచ్చారు. అలాగే సాంబశివరావు జీవన భృతి కోసం తనకు చెందిన కమర్షియల్ ప్లాట్లలో ఒక దాన్ని పెట్రోల్ బంకు పెట్టుకోవడానికి ఇచ్చారు. అయితే సాంబశివరావు కొన్ని సెటిల్‌మెంట్ల వ్యవహారంపై పోలీస్ అధికారి భుజంగరావు వద్దకు శ్రీధర్‌రావును తీసుకువెళ్లగా ఆ వాతావరణం నచ్చక ఆయన వెనక్కి వచ్చేశారు. దీంతో వ్యాపారం ఎలా చేస్తావో చూస్తామంటూ శ్రీధర్‌రావును వారు బెదిరించారు. ఆయన వ్యాపారాల్లో తలదూర్చడం, పోలీస్‌స్టేషన్లలో తప్పుడు ఫిర్యాదులు చేసి పలు పోలీస్‌స్టేషన్ల అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించడం వంటివి చేశారు. తద్వారా శ్రీధర్‌రావును దారికి తెచ్చుకొని ఆర్థిక లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు చేశారు. కొన్ని కేసుల్లో నోటీసులు జారీ చేయకుండా అరెస్టులు చేయడంపై న్యాయస్థానం పోలీసులను తప్పుబట్టింది. అయినప్పటికీ వ్యాపార లావాదేవీల గురించి శ్రీధర్‌రావు ఎవరితో మాట్లాడినా వారి ఫోన్ నంబర్లు సేకరించడం, ఆపై శ్రీధర్‌రావుకు, వారికి మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరించడం వంటి చర్యలకు సాంబశివరావు, భుజంగరావు పాల్పడుతూ వచ్చారు. సెల్‌ఫోన్‌ను ట్యాప్ చేయించి శ్రీధర్‌రావు ప్రతి కదలికను తెలుసుకొని తదనుగుణంగా ఆయన్ను మానసికంగా హింసించారు. ఈ మొత్తం వ్యవహారంలో టీవీ5 సాంబశివరావు, భుజంగరావులతోపాటు ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావుల హస్తం ఉన్నట్లు శ్రీధర్‌రావు పోలీసులను ఆశ్రయించారు.

ఎన్టీపీసీ విద్యుత్ ఇక చాలు!



▶ మొదటి పేజీ తరువాయి

కేంద్రం హామీ ఇచ్చింది. అందులో తొలి దశ కింద 1,600 (2X800) మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణాన్ని ఇటీవల ఎన్టీపీసీ పూర్తి చేసింది. రెండో దశ కింద 2,400 మెగావాట్ల ప్లాంట్లను నిర్మించాల్సి ఉంది. తొలి దశ ప్లాంట్ విద్యుత్ ధర యూనిట్‌కు రూ. 5.90 ఉండగా ఒప్పందం కారణంగా కొనుగోలు చేయకతప్పని పరిస్థితి ఉంది.

గత సర్కారు తప్పిదమే!

రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన 4,000 మెగావాట్ల ఎన్టీపీసీ విద్యుత్‌లో 2,400 మెగావాట్ల విద్యుత్ రాష్ట్రానికి అందకపోవడానికి కారణం కూడా గత ప్రభుత్వ తప్పిదమేనని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు ఆరోపిస్తున్నాయి. రెండో దశ కింద 2,400 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి వీలుగా ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోకుండా పదేళ్లపాటు కాలయాపన చేయడమే దీనికి కారణమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అప్పట్లో ఒప్పందం చేసుకొని ఉంటే ఇప్పటికే నిర్మాణం పూర్తై తక్కువ ధరకు విద్యుత్ రాష్ట్రానికి వచ్చేదని స్పష్టం చేస్తున్నాయి. ఇప్పుడు ఒప్పందం చేసుకుంటే భవిష్యత్తులో రాష్ట్రానికి గుదిబండగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గత సర్కారు అధిక ధరతో విద్యుత్ కొనుగోళ్లు చేయడంతోపాటు విచ్చలవిడి విధానాలను అనుసరించడం వల్ల గత పదేళ్లలో రాష్ట్ర విద్యుత్ సంస్థలు దివాలా తీశాయని కాంగ్రెస్ సర్కారు ఆరోపిస్తోంది.

ఇక కొత్త థర్మల్ ప్లాంట్లకు స్వస్తి..

దామరచర్లలో తెలంగాణ జెన్‌కో నిర్మిస్తున్న 4,000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నాలుగేళ్ల కిందే పూర్తికావాల్సి ఉండగా ఇంకా పనులు కొనసాగుతున్నాయి. ఈ జాప్యంతో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం మెగావాట్‌కు రూ. 6–10 కోట్లకు పెరిగింది. కాలంచెల్లిన సబ్–క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన భద్రాద్రి విద్యుత్ కేంద్రం వ్యయం సైతం భారీగా పెరగడంతో దాని విద్యుత్ ధరలు కూడా భారీగా పెరిగిపోయాయి. యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్ల నిర్మాణంలో తీవ్ర అవినీతి ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ సర్కారు న్యాయ విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మళ్లీ కొత్త థర్మల్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం జోలికి వెళ్లొద్దని ప్రభుత్వం ఓ అభిప్రాయానికి వచ్చింది. ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో రూ. 2–4కు యూనిట్ చొప్పున లభిస్తున్న పునరుద్పాదక విద్యుత్‌తో రాష్ట్ర విద్యుత్ సామర్థ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించింది. ఇందు కోసం సౌర, జల, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజీ విద్యుత్‌పై సర్కారు దృష్టిపెట్టనుంది.

ఎన్టీపీసీ రామగుండం స్టేజీ-1లో తొలి యూనిట్ షట్‌డౌన్

జ్యోతినగర్ (రామగుండం): ఎన్టీపీసీ రామగుండం తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజీ–1లోని మొదటి యూనిట్‌ను ఆదివారం నిలిపివేశారు. 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల యూనిట్‌లో వార్షిక మరమ్మత్తుల కోసం విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశారు. 15 రోజులపాటు మరమ్మతులు కొనసాగనున్నట్లు సమాచారం.



ఇండియా కూటమి ర్యాలీలో పాల్గొన్న నేతలు ఖర్గే, పవార్, సోనియా, రాహుల్, భగవంత్ మాన్, ఫరూక్ అబ్దుల్లా, తేజస్వి, కేసీ వేణుగోపాల్, చంపాయ్ సోరెన్, తిరుచ్చి శివ తదితరులు

అహంకారానికి అంతం తప్పదు

''సత్యం కోసం చేసిన యుద్ధంలో రామునికి అధికారం లేదు, వన రుల్లేవు. అయినా అవన్నీ ఉన్న రావణుడిపై గెలిచాడు. అధికారం శాశ్వతం కాదని, అహంకారం వీడాలని రాముని జీవితం నేర్పుతోంది. రాముని భక్తులమని ప్రకటించుకునే వారికి ఇది చెప్పాలనుకుంటు న్నా. అహంకారం అణగక తప్పదు''

- కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

కేజ్రీవాల్, సోరెన్ అరెస్టులే నిదర్శనం ● వ్యవస్థలను నాశనం చేస్తున్న మోదీ ● మండిపడ్డ ఇండియా కూటమి నేతలు

రాంలీలా మైదానంలో భారీ బల ప్రదర్శన
నియంతృత్వాన్ని తరిమేద్దామంటూ పిలుపు
ఎన్డీఏ దోస్తులుగా ఈడీ, ఐటీ, సీబీఐ: ఖర్గే
మోదీ సొంత వ్యక్తులకు ఈసీలో చోటు
ఎన్నికల ఫిక్సింగ్‌కు యత్నం: రాహుల్
ప్రధానాకర్షణగా కేజ్రీవాల్, సోరెన్ భార్యలు
బీజేపీని ఓడించాలన్న సునీత, కల్పన

సాక్షి, న్యూఢిల్లీ: మోదీ పాలనలో దేశంలో రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ నాశనమవుతున్నాయని విపక్ష ఇండియా కూటమి ఆరోపించింది. దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని విపక్షాలను, నేతలను వేధిస్తున్నారని మండిపడింది. ఢిల్లీ సీఎం, ఆప్ సారథి అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ అరెస్టును తీవ్రంగా ఖండించింది. వారికి అండగా నిలుస్తామని ప్రకటించింది. నియంతృత్వ పాలనను తరిమికొట్టి దేశాన్ని కాపాడుకుందామంటూ పిలుపునిచ్చింది. ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్ కూటమి మహా ర్యాలీ నిర్వహించింది. 'తానాషాహీ హటావో, లోక్‌తంత్ర్ బచావో (నియంతృత్వాన్ని రూపుమాపాలి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి)' పేరుతో జరిగిన ఈ ర్యాలీ విపక్షాల బల ప్రదర్శనకు వేదికగా మారింది. ఇండియా కూటమిలోని 28 పార్టీల నేతలు ఇందులో పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికలను మోదీ నియంతృత్వానికి, ప్రజాస్వామ్యానికి మధ్య జరుగుతున్న పోరుగా అభివర్ణించారు. దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పి ఎన్నికల్లో విపక్షాలను నిర్వీర్యం చేసేందుకు అధికార బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ ప్రయత్నాలను అడ్డుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, పంజాబ్ సీఎం, ఆప్ నేత భగవంత్‌మాన్ సింగ్, అఖిలేష్ యాదవ్ (సమాజ్‌వాదీ), డెరిక్ ఒబ్రియాన్ (టీఎంసీ), తిరుచ్చి శివ (డీఎంకే), తేజస్వీ యాదవ్ (ఆర్జేడీ), శరద్ పవార్ (ఎన్సీపీ-పవార్), ఉద్ధవ్ ఠాక్రే (శివసేన-యూబీటీ), ఫరూక్ అబ్దుల్లా (ఎన్సీ), మెహబూబా ముఫ్తీ (పీడీపీ), సీతారాం ఏచూరి (సీపీఎం), డి.రాజా (సీపీఐ) తదితరులు వీరిలో ఉన్నారు. కేజ్రీవాల్ సతీమణి సునీత, హేమంత్ సోరెన్ సతీమణి కల్పన వేదికపై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో వారిద్దరూ రాజకీయాల్లోకి రావచ్చనే చర్చ ఊపందుకుంది. వారితో సోనియా వేదికపై చేతిలో చేయి కలిపి మాట్లాడారు. తన పక్కనే కూచోబెట్టుకున్నారు. విపక్షాలన్నీ ఒక్కటై బీజేపీని ఓడించాలని స్టాలిన్, ఫరూక్ అబ్దుల్లా పిలుపునిచ్చారు. స్టాలిన్ తరఫున ఆయన సందేశాన్ని డీఎంకే నేత తిరుచ్చి శివ చదివి వినిపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా పోరాడదామని శరద్ పవార్ అన్నారు. దేశం పెను సంక్షోభంలో ఉందని డి.రాజా అన్నారు. ఈ ర్యాలీతో రాజకీయాల్లో కొత్త శక్తి పుట్టిందని ఏచూరి అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే బీజేపీకి వ్యతిరేకంగా ఓటేయాలని అఖిలేశ్ పిలుపునిచ్చారు. తృణమూల్ విపక్ష ఇండియా కూటమిలోనే ఉందని ఒబ్రియాన్ చెప్పారు.

కూటమి డిమాండ్లు...

కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, విపక్ష నేతల అరెస్టులు, ఎన్నికల బాండ్ల పేరుతో బలవంతపు వసూళ్లు, విపక్షాలే లక్ష్యంగా ఆదాయ పన్ను నోటీసులు, నిత్యావసరాల ధరల పెరుగుదల, పెరుగుతున్న నిరుద్యోగం, రైతులకు అన్యాయం వంటి ఏడు అంశాలపై కూటమి డిమాండ్లను ప్రియాంక చదివి ప్రస్తావించారు. విపక్షాలపై దర్యాప్తు సంస్థల చర్యలను నిలిపేయాలని కోరారు. బీజేపీ ఎన్నికల బాండ్ల క్విడ్ ప్రో కో వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్ వేయాలని డిమాండ్ చేశారు.

ఆరెస్సెస్, బీజేపీ విషతుల్యం

''ఆరెస్సెస్, బీజేపీ విషం వంటివి. పొరపాటున కూడా వాటిని రుచి చూడొద్దు. ఇప్పటికే దేశాన్ని ఎంతో నాశనం చేసిన విచ్ఛిన్న శక్తులవి. మరింత సర్వనాశనం చేయకుండా చూడాల్సిన బాధ్యత విపక్షాలదే. పరస్పరం కుమ్ములాడుకోకుండా ఏకమైతేనే బీజేపీని ఓడించడం సాధ్యం. ప్రజాస్వామ్యం, నియంతృత్వాల్లో ఏది కొనసాగాలో నిర్ణయించే కీలక ఎన్నికలివి. ప్రజాస్వామ్యంపై మోదీకి నమ్మకం లేదు. అధికార వ్యవస్థలను విపక్షాలపైకి ఉసిగొల్పి బెదిరిస్తున్నారు. ప్రభుత్వాలను పడదోస్తున్నారు. హేమంత్ సోరెన్‌ను బీజేపీలో చేరనందుకే అరెస్టు చేయించారు. తనకు లొంగడం లేదనే ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌నూ జైలుపాలు చేశారు. కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. ఇలా ప్రతిపక్షాలకు బీజేపీతో సమానంగా ఎన్నికల్లో తలపడే అవకాశం లేకుండా చేస్తున్నారు. రూ.14 లక్షల నగదు డిపాజిట్లకు సంబంధించి కాంగ్రెస్‌కు ఏకంగా రూ.135 కోట్ల జరిమానా విధించారు. రూ.42 కోట్ల నగదు డిపాజిట్లు అందుకున్న బీజేపీకి అదే సూత్రం ప్రకారం రూ.4,600 కోట్ల జరిమానా విధించాలి''

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

నిర్ణాయక ఎన్నికలివి...

''అంపైర్లపై ఒత్తిడి పెట్టి, కెప్టెన్‌ను, ఆటగాళ్లను కొనేస్తే మ్యాచ్ గెలిచినట్టే. క్రికెట్లో దీన్ని మ్యాచ్ ఫిక్సింగ్ అంటారు. లోక్‌సభ ఎన్నికల వేళ అంపైర్లను (కేంద్ర ఎన్నికల కమిషనర్లను) ఎంపిక చేసిందెవరు? మ్యాచ్ మొదలైనా కాకముందే ఇద్దరు ఆటగాళ్లను (సీఎంలను) అరెస్టు చేయించిందెవరు? ఇవన్నీ చేసింది ఒక్కే ఒక్క శక్తి. ప్రధాని మోదీ! ముగ్గురు నలుగురు బిలియనీర్ల సాయంతో కలిసి ఇలాంటి చర్యలకు పాల్పడటం ద్వారా లోక్‌సభ ఎన్నికలను మ్యాచ్ ఫిక్సింగ్ చేసేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలను దేశమంతా గమనిస్తోంది. మ్యాచ్ ఫిక్సింగ్, ఈవీఎంల సాయంతోనే 400 సీట్లు నెగ్గుతామని బీజేపీ ధీమాగా అంటోంది. అదే జరిగితే దేశమే సర్వనాశనమవుతుంది. దేశ గుండె చప్పుడైన రాజ్యాంగం కనుమరుగవుతుంది. తద్వారా దేశాన్ని ముక్కలు చేయడమే బీజేపీ లక్ష్యం. మ్యాచ్‌ఫిక్సింగ్, ఈవీఎంలు, మీడియాను బెదిరించడం, కొనేయడం జరగకుంటే బీజేపీకి 180 సీట్లు కూడా రావు. కానీ ఇవేం ఎన్నికలు? విపక్షాలను నిర్వీర్యం చేసి నెగ్గజూస్తున్నారు. ప్రచార వేళ అతి పెద్ద విపక్షమైన కాంగ్రెస్ ఖాతాలను స్తంభింపజేశారు. ఈడీ, ఐటీ, సీబీఐ బెదిరింపులు, బల ప్రయోగాలతో దేశాన్ని పాలించలేరు. కానీ దేశం గొంతును అణచలేరు. ప్రజల గళాన్ని అణచే శక్తి ప్రపంచంలోనే లేదు. మోదీ అసమర్థ పాలనలో దేశంలో నిరుద్యోగం 40 ఏళ్లలో గరిష్ట స్థాయికి చేరింది. దేశ సంపదంతా ఒక్క శాతం సంపన్నుల చేతిలో పోగుపడింది. ఈ నిరంకుశత్వాన్ని పారదోలేందుకు, రాజ్యాంగాన్ని కాపాడేందుకు జరుగుతున్న ఎన్నికలివి''

- కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ

కేజ్రీవాల్ సింహం: సునీత



''కేజ్రీవాల్ సింహం. ఆయనను ఎక్కువ రోజులు జైల్లో పెట్టలేరు. దేశ ప్రజలంతా ఆయన వెంట ఉన్నారు'' అని ఆయన భార్య సునీత అన్నారు. మోదీ ప్రభుత్వంపై ఆమె విరుచుకుపడ్డారు. ఈడీ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్ పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. లోక్‌సభ ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రకటించారు.

మా రక్తంలోనే పోరాటం: కల్పన



రాజ్యాంగ హక్కులన్నింటినీ మోదీ సర్కారు కాలరాస్తోందని జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ భార్య కల్పన మండిపడ్డారు. ''అధికారాన్ని పూర్తిగా గుప్పెట్లో పెట్టుకున్నామని కొన్ని పార్టీలు అపోహ పడుతున్నాయి. కానీ నిజమైన అధికారం ప్రజలదే. మేం గిరిజనులం. త్యాగం, పోరాటం మా రక్తంలోనే ఉన్నాయి. మా సుదీర్ఘ చరిత్రను తలచుకుని గర్వపడతాం'' అన్నారు.

అవినీతిపరుల కూటమి

విపక్షాలపై విరుచుకుపడ్డ మోదీ
- అవినీతిపరులను అవి కాపాడుతున్నాయి
- అవినీతి అంతమే ఎన్డీఏ మంత్రం
- అందుకోసమే నా పోరాటం
- మీరట్ ర్యాలీలో ప్రధాని

మీరట్/ లక్నో: సార్వత్రిక సమరానికి షెడ్యూల్ మొదలయ్యాక ఉత్తరప్రదేశ్ వేదికగా ప్రధాని మోదీ తొలి ఎన్నికల ప్రచార సభలో పాల్గొని విపక్షాల 'ఇండియా'కూటమిపై విమర్శల వాగ్బాణాలు సంధించారు. ఆదివారం మీరట్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. ఈడీ అరెస్ట్‌తో కేజ్రీవాల్, జేఎంఎం చీఫ్ హేమంత్ సోరెన్ కటకటాల వెనక్కి వెళ్లిన వేళ ఢిల్లీ రాంలీలా మైదానంలో ఆదివారం విపక్ష 'ఇండియా' కూటమి 'లోక్‌తంత్ర బచావో' ర్యాలీ చేపట్టిన కొద్దిసేపటికే మోదీ విపక్షాల కూటమిపై విమర్శల జడివాన కురిపించారు. ''అవినీతిపై నేను పూర్తిస్థాయి యుద్ధం ప్రకటించగానే విపక్ష నేతలంతా కలిసి ఇండియా కూటమిగా పోగయ్యారు. నన్ను భయపెట్టొచ్చని భావించారు. కానీ నా భారతదేశమే నా సొంత కుటుంబం. అవినీతి నుంచి దేశాన్ని రక్షించేందుకు యుద్ధం మొదలుపెట్టా. అందుకే వాళ్లంతా ఇప్పుడు ఊచలు లెక్కపెడుతున్నారు. వాళ్లకు సుప్రీంకోర్టు నుంచి కూడా కనీసం బెయిల్ దొరకడం లేదు. ఈసారి రెండు శిబిరాల మధ్యనే సార్వత్రిక ఎన్నికల సమరం కొనసాగబోతోంది. నా మంత్రం 'భ్రష్టాచార్ హటావో' (అవినీతి అంతం). వాళ్ల తంత్రం 'భ్రష్టాచార్ బచావో' (అవినీతిని కాపాడుకోవడం). పేదల కోసం ఉద్దేశించిన డబ్బు అవినీతిపరులకు దక్కకుండా పదేళ్లుగా మా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అవినీతిని కూకటివేళ్లతో పెకలిస్తున్న ఎన్డీఏ ఒకవైపు ఉంటే, అదే అవినీతి నేతలను కాపాడేందుకు అలుపెరగక కష్టపడుతున్న 'ఇండియా' కూటమి నేతలు మరోవైపు ఉన్నారు. అవినీతికి అంతం పలకాలో వద్దో మీరే నిర్ణయించుకోండి' అన్నారు. ''అవినీతిపరులకు చెప్పేదొక్కటే. కుటుంబం లేదంటూ నన్నెంతగా అవమానించినా, ఎన్ని ఆరోపణలు గుప్పించినా, బీజేపీ నేతలపై దాడులు చేసినా అవినీతిపై నేను పోరాటం ఆపబోను. అవినీతికి పాల్పడింది ఎంత పెద్ద నేతలైనా సరే కఠిన చర్యలు ఖాయం. దేశాన్ని లూటీ చేసిన వారు తిరిగి ఆ సొమ్ము కక్కాల్సిందే. ఇదే మోదీ గ్యారెంటీ'' అని అన్నారు. ప్రజల కోసం ఆశల పల్లకీని మోసుకొచ్చామంటూ సభకు ముందు మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ''పదేళ్లలో దేశవ్యాప్తంగా నా కుటుంబసభ్యులందరి ఆకాంక్షలూ తీర్చాం. కొంగొత్త కోరికలను తీర్చేందుకు మళ్లీ మీ ముందుకొచ్చాం. ఆశలు నెరవేర్చిన ఎన్డీఏ కూటమికే ఓటేయాలని ప్రజలు నిర్ణయించుకున్నారు'' అన్నారు.



పదేళ్ల అభివృద్ధి ట్రైలరే

''ఈసారి లోక్‌సభ ఎన్నికలు కొత్త ప్రభుత్వాన్ని మాత్రమే ఎన్నుకోవు. ఈ ఎన్నికలు వికసిత భారత్‌కు పునాది వేయనున్నాయి. మూడోసారి ప్రభుత్వ ఏర్పాటుకు మేం ఇప్పటికే కసరత్తు ప్రారంభించాం. మా ప్రభుత్వం వచ్చే ఐదేళ్లకు మార్గసూచీని రూపొందిస్తోంది. ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి 100 రోజుల్లో అమలుజరపాల్సిన పనులపై ఆలోచిస్తున్నాం. గత పదేళ్లకాలంలో మీరు చూసిన అభివృద్ధి ట్రైలర్ మాత్రమే. ఇప్పుడు దేశాన్ని మరింత శరవేగంతో అభివృద్ధి పథంలో ఉరకలెత్తిస్తాం. నేను పేదరికంలో జీవించా కాబట్టే పేదల గురించి తెల్సు నాకు. ప్రతి ఒక్క పేదవాడి బాధలు, కష్టాలను అర్థంచేసుకోగలను. అందుకే పేదలకు లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలను రూపొందించి అమలుచేశాం. ఈ పథకాలు పేదల సాధికారతకు మాత్రమే బాటలు వేయవు. అవి పేదలకు ఆత్మగౌరవాన్ని తిరిగి తెచ్చి ఇచ్చాయి'' అని మోదీ అన్నారు. ''అయోధ్యలో రామాలయం అసాధ్యమని చాలామంది అన్నారు. నేడు రోజూ లక్షలాది మంది అయోధ్య రామాలయాన్ని దర్శించుకుంటున్నారు. ట్రిపుల్ తలాక్‌పై కఠిన చట్టం, ఆర్టికల్ 370 రద్దు, మహిళా రిజర్వేషన్ బిల్లుకు మోక్షం అసాధ్యమన్నారు. మేం చేసి చూపాం' అని మోదీ అన్నారు.

ఈసారి రిషి గెలవడం కష్టమే

- కన్జర్వేటివ్ పార్టీ ఓటమి ఖాయం
- బ్రిటన్ ఎన్నికల సర్వేలో వెల్లడి

లండన్: బ్రిటన్‌లో ఇప్పటికిప్పుడు సాధారణ ఎన్నికలు జరిగితే భారత సంతతికి చెందిన రిషి సునాక్‌తోపాటు ఆయన కేబినెట్‌లోని సగానికి పైగా మంత్రులకు పరాజయం తప్పదని ముందస్తు సర్వేలో తేలింది. అధికార కన్జర్వేటివ్ పార్టీకి 100 పార్లమెంట్ స్థానాలు కూడా దక్కడం గగనమేనని, అదే సమయంలో ప్రతిపక్ష లేబర్ పార్టీ 468 సీట్లు గెలుచుకుని, 286 సీట్ల మెజారిటీ సాధిస్తుందని కూడా అంచనా వేసింది. బెస్ట్ ఫర్ బ్రిటన్ తరఫున సర్వేషన్ సంస్థ 15,029 మందితో తాజాగా సర్వే జరిపింది. ఇందులో పాల్గొన్న వారిలో 45 శాతం మంది ప్రతిపక్ష లేబర్ పార్టీకే ఓటేశారు. పాయింట్ల వారీగా చూస్తే అధికార కన్జర్వేటివ్ పార్టీ కంటే లేబర్ పార్టీ 19 పాయింట్లు ముందంజలో ఉంది. గత ఏడాది డిసెంబర్‌లో చేపట్టిన పోలింగ్‌తో పోలిస్తే ఇది మూడు పాయింట్లు ఎక్కువ. కన్జర్వేటివ్ పార్టీ 100 లోపే సీట్లు గెలుచుకోవడం, అంటే 250 ఎంపీ స్థానాలను కోల్పోవడం ఇటీవలి కాలంలో ఇదే మొదటిసారవుతుందని నిర్వాహకులు విశ్లేషిస్తున్నారు. సొంత సీటు రిచ్‌మండ్ అండ్ నార్త్‌అల్లెర్టన్‌లో ప్రధాని రిషి సునాక్‌కు లేబర్ పార్టీ కంటే 2.4 శాతం మాత్రమే ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. ఈ పోలింగ్‌లో ఎటు వైపూ మొగ్గు చూపని 15 శాతం మంది ఓట్లను పరిగణనలోకి తీసుకోలేదని 'సర్వేషన్'తెలిపింది. కన్జర్వేటివ్ పార్టీ పరిస్థితి ముందుముందు మరింత దారుణంగా ఉంటుందని ఓ విశ్లేషకుడు అన్నారు. ఇలా ఉండగా, మే 2వ తేదీన స్థానిక కౌన్సిళ్లు, మేయర్ ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ పేలవమైన ఫలితాలను సాధించిన పక్షంలో ప్రధాని రిషి సునాక్‌పై సొంత పార్టీలోనే తిరుగుబాటు రావడం ఖాయమని కూడా అంటున్నారు.

గవర్నర్ పదవి ఆషామాషీ కాదు

- వారు రాజ్యాంగానికి లోబడి నడుచుకోవాలి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న

హైదరాబాద్: ఎన్నికైన ప్రభుత్వాలు పంపిన బిల్లులను గవర్నర్లు ఆమోదించకుండా జాప్యం చేస్తున్న ఘటనలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఆమె పంజాబ్ గవర్నర్ తీరును ఉదహరించారు. ఒక రాష్ట్ర గవర్నర్ చర్యలు, లోపాలను రాజ్యాంగ న్యాయస్థానాల ముందు పరిశీలనకు తేవాల్సిరావడం రాజ్యాంగం ప్రకారం ఆరోగ్యకరమైన ధోరణి కాదన్నారు. ఇటువంటివి సాధ్యమైనంత మేర తగ్గాలని అభిప్రాయపడ్డారు. ఒక పని చేయమని లేదా చేయవద్దని గవర్నర్లకు న్యాయస్థానాలు చెప్పాల్సి రావడం ఇబ్బందికరమైన అంశమన్నారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీలో జరిగిన సదస్సులో జస్టిస్ బీవీ నాగరత్న ప్రసంగించారు. 2016లో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నోట్ల రద్దు అంశాన్ని ప్రస్తావిస్తూ జస్టిస్ నాగరత్న..రూ.500, రూ.1,000 నోట్ల రద్దును బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చుకునేందుకు ఒక మార్గంగా భావించానన్నారు. నోట్ల రద్దుకు సానుకూలంగా సుప్రీంకోర్టు ధర్మాసనం వెలువరించిన మెజారిటీ తీర్పును జస్టిస్ నాగరత్న వ్యతిరేకించిన విషయం తెలిసిందే.

అద్వానీకి భారతరత్న

ఆయన నివాసంలో అందజేసిన ముర్ము

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ దిగ్గజం, మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ (96) భారతరత్న పురస్కారం అందుకున్నారు. ఆదివారం ఢిల్లీలోని అద్వానీ నివాసంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనకు పురస్కారాన్ని అందజేశారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. అద్వానీకి భారతరత్న ప్రదాన కార్యక్రమంలో పాల్గొనడం తనకు చాలా ప్రత్యేకమైన సందర్భమని మోదీ అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. భారతరత్న ప్రదాన సమయంలో కూర్చొని ఉండటం ద్వారా రాష్ట్రపతిని మోదీ ఘోరంగా అవమానించారని కాంగ్రెస్ మండిపడింది.

లంకకు దీవినే రాసిచ్చిన ఇందిర

మోదీ ఆరోపణలు.. తిప్పికొట్టిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: దాదాపు అర్ధ శతాబ్దం క్రితం నాటి ద్వీపం ధారాదత్తం ఉదంతం సార్వత్రిక ఎన్నికల వేళ మొట్టమొదటిసారిగా తెరమీదకొచ్చింది. దేశ భద్రతను ఏమాత్రం పట్టించుకోకుండా, స్పృహలేకుండా ఇందిరాగాంధీ ప్రభుత్వం శ్రీలంకకు కచ్చాతీవు ద్వీపాన్ని అప్పగించిందని ప్రధాని మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) ద్వారా తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై సంపాదించిన అధికారిక పత్రాలు తాజాగా ఒక జాతీయ వార్తసంస్థ కథనం ద్వారా వెలుగు చూశాయి. అధికార, విపక్షాల పరస్పర ఆరోపణలతో ఈ భౌగోళిక, దౌత్య అంశం ఒక్కసారిగా రాజకీయరంగు పులుముకుని పెద్ద చర్చనీయాంశమైంది. కచ్చాతీవు అంశంపై ఆదివారం మోదీ 'ఎక్స్' వేదికగా నాటి కాంగ్రెస్, డీఎంకే ప్రభుత్వాలపై విమర్శలు ఎక్కుపెట్టారు. ' కళ్లు తెరిపించే ఘటన ఇది. కచ్చాతీవు ద్వీపంపై పరిపాలనా హక్కులను ఎంత నిర్లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం వదులుకుందనేది కొత్తగా వెలుగుచూసిన నిజాలతో వెల్లడైంది. ఇది ప్రతి ఒక్క భారతీయుడికి ఆగ్రహం తెప్పించే విషయం. కాంగ్రెస్‌ను ఎన్నటికీ నమ్మొద్దని ప్రజల మనసుల్లో స్థిరపడిపోయింది. దేశ ఐక్యత, సమగ్రత, ప్రయోజనాలను కాంగ్రెస్ పణంగా పెట్టి 75 ఏళ్లు దాటిపోయింది. కాంగ్రెస్ పెద్ద తప్పు చేసింది. ఆ పాపం వల్లే నేడు తమిళనాడు జాలర్లు ఇప్పటికీ ఆ దీవి సమీపంలో చేపలు పట్టుకోలేకపోతున్నారు. అటుగా వెళ్తే శ్రీలంక తీరగస్తీ బలగాలు అరెస్ట్‌చేసి జైలులో పడేస్తున్నాయి' అని మోదీ ఆరోపించారు.

అది స్నేహపూర్వక ఒప్పందం: ఖర్గే

మోదీ వ్యాఖ్యలకు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే దీటుగా బదులిచ్చారు. '' మీ ప్రభుత్వం సైతం బంగ్లాదేశ్‌తో ఒప్పందం చేసుకుని 111 ప్రాంతాలను బంగ్లాకు, 55 ప్రాంతాలను భారత్‌కు పరస్పరం బదిలీచేసుకున్న విషయం మర్చిపోయారా?. 1974 సంవత్సరంలో జరిగింది కూడా అచ్చంగా అలాంటి ఒడంబడికే'' అన్నారు.

ఎమిటీ కచ్చాతీవు కథాకమామిషు?

కచ్చాతీవు తమిళనాడులోని రామేశ్వరం నుంచి శ్రీలంక దిశగా 55 కిలోమీటర్ల దూరంలో పాక్ జలసంధిలో ఉన్న 163 ఎకరాల అతి చిన్న ద్వీపం. మధ్యయుగంలో శ్రీలంకలోని జాఫ్నా అధీనంలో ఉండేది. బ్రిటిష్ వారి రాకతో శ్రీలంక, భారత్ రెండింటి ఏలుబడిలోకి వచ్చింది. 1948 దాకా తమిళనాడులోని రామనాథపురం జమీందారీ కింద ఉండేది. తర్వాత మద్రాస్ రాష్ట్ర పాలనలోకి వచ్చింది. చేపల వేట పెరగడంతో అది తమదంటే తమదని శ్రీలంక, భారత్ ప్రకటించుకున్నాయి.

ఎలక్షన్ బీట్



ఎన్నికల విచిత్రం

ఆదివారం ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి ర్యాలీ వేదిక నుంచి కేజ్రీవాల్ ఫ్లెక్సీని తొలగిస్తున్న దృశ్యం. ఇది ఒక వ్యక్తి కేంద్రంగా జరుగుతున్న ర్యాలీ కాదనే ఉద్దేశంతో ఈ చర్య చేపట్టినట్టు తెలుస్తోంది.

200 స్థానాలు గెలిచి చూపించండి

బీజేపీకి తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ సవాల్

పశ్చిమ బెంగాల్: 400 లోక్‌సభ స్థానాలు గెలుస్తామంటున్న బీజేపీకి దమ్ముంటే 200 సీట్లు గెలిచి చూపించాలని పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత బెనర్జీ సవాల్ విసిరారు. 2021లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 200కు పైగా స్థానాలు గెలుస్తామని బీరాలు పోయారని, 77 దగ్గరే ఆగిపోయారని గుర్తు చేశారు. పార్టీ కృష్ణానగర్ అభ్యర్థి మహువా మొయిత్రా ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కృష్ణానగర్‌లో ఆమె మాట్లాడారు. పార్లమెంటులో బీజేపీకి వ్యతిరేకంగా మహువా మొయిత్రా పోరాటాన్ని ప్రశంసించారు. పశ్చిమ బెంగాల్లో కాంగ్రెస్, సీపీఎం, బీజేపీ చేతులు కలిపాయని ఆరోపించారు. ''రాష్ట్రంలో ఇండియా కూటమి ఉనికిలో లేదు. ఇక్కడ లెఫ్ట్-కాంగ్రెస్-ఐఎస్‌ఎఫ్ అభ్యర్థులకు ఓటేస్తే బీజేపీకి వేసినట్టే''అన్నారు. పౌర సవరణ చట్టం (సీఏఏ) అమలును బెంగాల్లో తిరస్కరిస్తున్నట్టు మమత పునరుద్ఘాటించారు. సీఏఏపై ప్రజల మనసుల్లో భయాలు ఆమె సృష్టిస్తున్నారని బీజేపీ ఎంపీ సామిక్ భట్టాచార్య విమర్శించారు.

సుమలతతో కుమారస్వామి భేటీ

బెంగళూరు: జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి ఆదివారం మాండ్య సిట్టింగ్ ఎంపీ సుమలత అంబరీశ్‌తో భేటీ అయ్యారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సుమలత బీజేపీ టిక్కెట్‌ను ఆశించారు. అయితే, పొత్తులో భాగంగా బీజేపీ మాండ్య, కోలార్, హస్సన్ సీట్లను జేడీఎస్‌కు కేటాయించింది. జేడీఎస్ తరఫున హెచ్‌డీ కుమారస్వామి మాండ్య నుంచి బరిలోకి దిగనున్నారు. అయితే, వచ్చే ఎన్నికల్లో పోటీకి దిగే విషయమై ఏప్రిల్ 3వ తేదీన మద్దతుదారులతో చర్చించి, నిర్ణయం ప్రకటిస్తానంటూ సుమలత రెండు రోజుల క్రితం ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే కుమారస్వామి ఆదివారం సుమలతతో ఆమె నివాసంలో భేటీ అయ్యారు. ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరినట్లు అనంతరం కుమారస్వామి చెప్పారు. ఏప్రిల్ 4న మాండ్య స్థానానికి నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. 2019 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన బహు భాషా నటి సుమలత బీజేపీ మద్దతుతో, అప్పటి సీఎం కుమారస్వామి కుమారుడు నిఖిల్‌పై విజయం సాధించారు.

దక్షిణాదిన మెరుగైన ఫలితాలు.. 370 సీట్ల లక్ష్యాన్ని సాధిస్తాం: గడ్కరీ

నాగ్‌పూర్: దక్షిణ భారత దేశంలో మెరుగైన ఫలితాలను సాధించడం ద్వారా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 370 స్థానాలను గెలుచుకుంటుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదివారం ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ 400 పైగా సీట్లను సాధిస్తుందన్నారు. మోదీ మూడో విడత ప్రధాని అవుతారన్నారు. విపక్షాలు ముందు తమ మధ్య విభేదాలను సరిదిద్దుకోవాలని ఎద్దేవా చేశారు. బీజేపీకి కేవలం ఇద్దరే ఎంపీలున్నప్పుడు కూడా సానుభూతి కోసం పాకులాడలేదని చెప్పారు.

ఇండియా కూటమిని వీడిన అప్నాదళ్(కె)

లక్నో: ప్రతిపక్ష పార్టీల 'ఇండియా' కూటమి నుంచి వైదొలుగుతున్నట్లు అప్నాదళ్(కామెరవాది) ఆదివారం ప్రకటించింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అసదుద్దీన్ ఒవైసీ సారథ్యంలోని ఏఐఎంఐఎంతో కలిసి పోటీ చేయనున్నట్లు తెలిపింది. తమ రెండు పార్టీలు కలిసి పీడీఎం న్యాయ్ మోర్చాను ఏర్పాటు చేశాయని పేర్కొంది. వెనుకబడిన, దళిత, ముస్లిం వర్గాల ప్రజలకు న్యాయం కోసం పనిచేస్తామని పేర్కొంది. సమాజ్ వాదీ పార్టీతో తెగదెంపులు చేసుకుంటున్నట్లు అప్నాదళ్(కె) నేత పల్లవీ పటేల్ చెప్పారు. ఆదివారం పల్లవీ పటేల్ తన తల్లి కృష్ణా పటేల్, ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీతో లక్నోలో మీడియాతో మాట్లాడారు. బిహార్ రాష్ట్రం కౌశాంబి జిల్లాలోని సిరాంతు నియోజకవర్గం నుంచి పల్లవీ పటేల్ ఎస్పీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు.

రాజ్‌గఢ్‌లో బ్యాలెట్ పత్రాలతోనే ఎన్నికలు

కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్

మధ్యప్రదేశ్: రాజ్‌గఢ్ నియోజకవర్గంలో బ్యాలెట్ పత్రాల ద్వారా ఎన్నికలు జరిగేందుకు ప్రయత్నిస్తానని కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ తెలిపారు. 400 మంది బరిలో ఉంటే ఎన్నికలు బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహిస్తారని, అందుకే 400 మందితో పోటీ చేయించేందుకు తాను ప్రయత్నిస్తున్నానని తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ లోకసభ స్థానం నుంచి పోటీచేస్తున్న దిగ్విజయ్.. చాలా కాలం తరువాత ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. 'వాదా నిభావో యాత్ర' ఎనిమిదిరోజుల పాదయాత్రలో మొదటి రోజైన ఆదివారం సుస్నేర్ జిల్లా కచ్నరియా గ్రామంలో కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికలు ఈవీఎం ద్వారా జరగాలా? బ్యాలెట్ పేపర్ ద్వారా జరగాలా అని ప్రజలను ఆయన ప్రశ్నించగా.. 'బ్యాలెట్ పేపర్' అంటూ వారు స్పందించారు. 400 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేస్తేనే అది సాధ్యం అవుతుందన్నారు. ఈవీఎంల వల్లే భారతీయ జనతాపార్టీ ఎన్నికల్లో గెలుస్తోందని ఆయన మరోమారు విమర్శించారు.

బీజేడీలో చేరిన బీజేపీ ఎమ్మెల్యే

భువనేశ్వర్: ఒడిశాలో బీజేపీ ఎమ్మెల్యే సుకాంత నాయక్ బీజేడీలో చేరారు. బీజేపీతో సరిపడక తిరిగి వచ్చానన్నారు. ఆయన శుక్రవారం బీజేపీని వీడటం తెలిసిందే. 2014లో ఆయన బీజేడీ టికెట్‌పైనే ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019 ఎన్నికల ముందు బీజేపీలో చేరి గెలిచారు. మాజీ ఎమ్మెల్యే బృందావన్ మాఝీ కూడా బీజేడీలో చేరారు. బీజేడీ మాజీ ఎమ్మెల్యే కోరేయ్ ఆకాశ్ దాస్ నాయక్ బీజేపీలో చేరారు.

కాంగ్రెస్‌కు మళ్లీ ఐటీ నోటీసులు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీకి ఆదాయ పన్ను శాఖ నుంచి తాజాగా నోటీసులు అందాయి. 2014-15 నుంచి 2016-17 సంవత్సరం వరకు జరిగిన లావాదేవీలపై రూ.1,745 కోట్ల పన్ను చెల్లించాలంటూ పేర్కొన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తాజా నోటీసులతో కలిపి కాంగ్రెస్‌కు ఐటీ శాఖ పంపిన పన్ను నోటీసుల మొత్తం రూ.3,567 కోట్లకు చేరింది. 2014-15కు రూ.663 కోట్లు, 2015-16కు రూ.664 కోట్లు, 2016-17కు రూ.417 కోట్ల పన్ను చెల్లించాలని తాజా నోటీసుల్లో పేర్కొన్నారు. పార్టీలకు పన్ను మినహాయింపులను ఎత్తేసినందున కాంగ్రెస్ ఆదాయంపై పన్ను విధించినట్లు అధికారవర్గాలు తెలిపాయి.

సాక్షి
హైదరాబాద్
సోమవారం । 1 । ఏప్రిల్ । 2024

రన్ ఫర్ పీస్

రన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు



పరుగును ప్రారంభిస్తున్న వికాస్ రాజ్ తదితరులు



ప్రపంచ శాంతిని కోరుతూ ఆదివారం జలవిహార్ నుంచి పీవీ నరసింహారావు మార్గ్ వరకు నిర్వహించిన అహింసా 2వ ఎడిషన్ రన్‌ను చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ వికాస్ రాజ్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య పండగలో పాల్గొని రానున్న ఎన్నికల్లో అందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఐఐఎఫ్ఎల్ జీతో హైదరాబాద్ చైర్మన్ సుశీల్ సంచేటి, ప్రధాన కార్యదర్శి పరేష్ షా, కోశాధికారి బీఎల్ బండారీ, వీణా జైన్, సెక్రటరీ టీనా షా తదితరులు పాల్గొన్నారు. – ఖైరతాబాద్







ఇఫ్తార్ విందుల పేరిట పర్యటనలు | రోజుకో డివిజన్‌కు అసదుద్దీన్ | పోలింగ్ శాతం పెంపుపైనే నజర్ | వ్యూహాత్మకంగా అడుగులు

మజ్లిస్ దూకుడు



సాక్షి, సిటీబ్యూరో: పార్లమెంట్ ఎన్నికల కోసం మజ్లిస్ పార్టీ దూకుడు పెంచింది. ఇప్పటికే పాదయాత్రలతో ముందస్తు ప్రచారానికి శ్రీకారం చుట్టిన మజ్లిస్ పార్టీ.. రంజాన్ మాసం ఇఫ్తార్ విందులను సైతం సద్వినియోగం చేసుకుంటోంది. రోజుకో డివిజన్‌లో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులో ఆ పార్టీ అధినేత అసదుద్దీన్, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు హాజరు కావడం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. మజ్లిస్ పార్టీకి హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో గెలుపుపై ఎలాంటి అనుమానాలు లేనప్పటికీ.. పోలింగ్ భారీగా జరిగేలా సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఇఫ్తార్ విందుల్లో సైతం పోలింగ్ ప్రస్తావన తీసుకొని రావడం ఇందుకు బలంచేకూరుతోంది. గత ఎన్నికల్లో సైతం పాదయాత్రలు, బహిరంగ సభల్లో పోలింగ్ శాతం పెంపు ప్రస్తావన ప్రధానాంశంగా కొనసాగించింది. ఈసారి సైతం పోలింగ్ పెంపుపై దృష్టి సారించినట్లు కనిపిస్తోంది.

మెజారిటీ కోసం..

హైదరాబాద్ లోక్‌సభ పరిధిలో మెజారిటీ ఓటర్లు ముస్లిం సామాజిక వర్గం వారే. పోలింగ్ ఎంత ఎక్కువగా నమోదైతే అంతే స్థాయిలో మెజారిటీ పెరుగుతుందని మజ్లిస్ పార్టీ భావిస్తోంది. ఎన్నికల్లో మజ్లిస్ పార్టీకి పోలింగ్ శాతమే మెజారిటీపై ప్రభావం చూపుతోంది. హైదరాబాద్ లోక్‌సభకు తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో మజ్లిస్ పక్షాన అప్పట్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో దిగిన అబ్దుల్ వాహెద్ ఓవైసీ, ఆ తర్వాత బరిలో దిగిన సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీల ఓటములకు పోలింగ్ శాతమే ప్రభావం చూపింది. ఆ తర్వాత పోలింగ్ శాతం పెంపుపై దృష్టి సారించడంతో సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ జైత్రయాత్ర ప్రారంభమైంది. అనంతరం అసదుద్దీన్ ఒవైసీ విజయ పరంపర కొనసాగుతోంది. క్రమంగా పెరుగుతున్న పోలింగ్ శాతం మజ్లిస్‌ను ఎదురు లేని శక్తిగా తయారు చేసినట్లయింది. గత నాలుగు పర్యాయాల్లో పాతబస్తీపై గట్టి పట్టు సాధించి ఎన్నికలను ఏకపక్షంగా మార్చినప్పటికీ పెరుగుతున్న ఓటర్లకు అనుగుణంగా మెజారిటీ పెరగకపోవడం మింగుడు పడని అంశంగా తయారైంది. దీంతో అత్యధిక మెజారిటీ కోసం పోలింగ్ శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది మజ్లిస్ పార్టీ.

నిప్పు.. ముప్పు

భగ్గున మండుతున్న ఎండలు

- పెరుగుతున్న అగ్నిప్రమాదాలు
- తరచూ వెలుగుచూస్తున్న ఘటనలు
- పెద్ద ఎత్తున ఆస్తినష్టం
- ప్రాణాల మీదికి తెస్తున్న నిర్లక్ష్యం
- ఇళ్ల మధ్యే స్క్రాప్ గోదాంలు.. రసాయన పరిశ్రమలతో భయంభయం

సాక్షి, సిటీబ్యూరో: ఎండలు భగ్గున మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకు నమోదవుతోంది. చెట్ల ఆకులు రాలుతున్నాయి. రాలిన ఆకులను, పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ కవర్లను ఒకచోట కుప్పగా పోసి తగలబెడుతుండటంతో పాటు ఆయా సంస్థల్లో పని చేస్తున్న సిబ్బంది బీడీ, సిగరెట్ తాగి పీకలను వాటిలో పడేస్తుండడంతో మంటలు అంటుకుంటున్నాయి. ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం ఏసీలు, కూలర్లు ఆన్ చేయడం, సామర్థ్యానికి మించి విద్యుత్‌ను వినియోగిస్తుండటంతో షార్ట్‌సర్క్యూట్ తలెత్తి అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో మంటలు ఆర్పేందుకు అనువైన వ్యవస్థ అందుబాటులో లేకపోవడంతో ఫైర్ ఇంజిన్లు ఘటనా స్థలానికి చేరుకునే లోపే ఆస్తులు బుగ్గి అవుతున్నాయి. కొన్ని సంస్థల్లో అగ్ని మాపక వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నా నిర్వహణ లోపాలతో పని చేయడం లేదు. స్క్రాప్ దుకాణాలు, టింబర్ డిపోలు, సినిమా హాళ్లు, హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, ప్లాస్టిక్ పరిశ్రమలు, వాణిజ్య భవన సముదాయాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

నిర్వహణ సరిగా లేకనే..

జిల్లాలో హయత్‌నగర్, మహేశ్వరం, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, మాదాపూర్, చేవెళ్లలో ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 2021–22లో 382 అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. రూ.32.18 కోట్ల ఆస్తినష్టం వాటిల్లింది. 26 మంది మృత్యువాత పడ్డారు. శేరిలింగంపల్లి, కాటేదాన్, హయత్‌నగర్, చేవెళ్ల, షాద్‌నగర్, శంషాబాద్ లోనే అత్యధిక ప్రమాదాలు వెలుగు చూశాయి. అగ్నిమాపక కేంద్రాలకు 2023లో 3,151 ఫోన్‌కాల్స్ రాగా, 2024లో 2,550 కాల్స్ వచ్చాయి. గత ఏడాది అగ్నిమాపక శాఖ నుంచి 3,060 ఆస్పత్రులు, విద్యా సంస్థలు, పరిశ్రమలు, షాపింగ్ మాల్స్ నిరభ్యంతర పత్రాలు పొందాయి. వీటిలో అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసినప్పటికీ మెజార్టీ భవనాల్లో



నిర్వహణ మరిచి పోయారు. తరచూ ఇంట్లో వెలుగు చూసే ప్రమాదాలకు రిఫ్రిజిరేటర్, ఓవెన్, గ్యాస్ లీకేజీలు కారణమవుతుంటే.. స్క్రాప్ గోదాములు, టింబర్ డిపోలు, ప్లాస్టిక్ పరిశ్రమల్లో వెలుగు చూసే ప్రమాదాలకు కార్మికులు పీల్చి వదిలేసే బీడీ, సిగరెట్ ముక్కలు కారణమవుతున్నాయి. వాణిజ్య సంస్థలు, హోటళ్లలో వెలుగు చూసే అగ్ని ప్రమాదాలకు ఏసీలు, గ్రీజర్లు, ఇతర ఎలక్ట్రికల్ పరికరాలు, లూజ్ కాంటాక్టులు కారణమవుతున్నాయి. సినిమా హాళ్లు, ఐటీ అనుబంధ సంస్థలు, పరిశ్రమల్లో వెలుగు చూసే ప్రమాదాలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు, హీటెక్కుతున్న యంత్రాలు కారణమవుతున్నాయి. నిజానికి ఆయా యజమానులు భవన నిర్మాణ సమయంలో అగ్నిమాపక చర్యలు చేపడుతున్నారు. వాటర్, గ్యాస్ పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. సీఓటు గ్యాస్ నింపిన సిలిండర్లు గోడలకు అమర్చుతున్నారు. సీలింగ్ కింది భాగంలో రెయిన్ స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. కానీ మెజార్టీ యజమానులు వాటి నిర్వహణ మర్చిపోతున్నారు. చాలా పరిశ్రమల్లో ఫైర్ అలారం పని చేయడం లేదు. ట్యాంకుల్లో సరిపడా నీళ్లు ఉండటం లేదు. సిలిండర్లలో రసాయనాలు కన్పించడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో మంటలను ఆర్పేందుకు విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది యత్నించినా ఉపయోగం ఉండటం లేదు. అప్పటికే నష్టం వాటిల్లుతోంది.

నివారణ చర్యలు ఇలా..



- అగ్ని మాపక వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు అన్ని వేళల్లో పని చేస్తుందో లేదో పరిశీలించాలి.
- మంటలు ఆర్పే పరికరాలు పని చేస్తున్నాయో లేదో గుర్తించాలి.
- ఎయిర్ కండిషనింగ్ ద్వారా మంటలు వ్యాప్తి చెందకుండా డ్యాంపర్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి.
- విద్యుత్ వైరింగ్, ఉపకరణాలు, స్విచ్‌లు, ఇతర పరికరాలను పరిశీలించి లోపాలుంటే వెంటనే సరి చేసుకోవాలి.
- అతుకులు ఉన్న విద్యుత్ తీగలు, వదులుగా ఉన్న వైరింగ్‌ను ఉపయోగించొద్దు.
- ఫ్రిజ్, ఓవెన్‌లను వంటగదిలో కాకుండా గాలి, వెలుతురు తగిలే చోట ఉంచాలి.
- ఎలక్ట్రిక్ వైర్లను కార్పెట్ల కింద, చాపల కింద నుంచి పోనివ్వొద్దు.
- అధిక ఓల్టేజీ విద్యుత్ ఉపకరణాలు వాడే సమయంలో ఎర్తింగ్ ఉన్న త్రీపిన్ సాకెట్స్‌ను తప్పని సరిగా వాడాలి.
- చెత్తకుప్పలకు నిప్పు పెట్టకూడదు.

– శ్రీనివాసరావు, సీఈఐజీ

ఇటీవల జరిగిన కొన్ని ప్రమాదాలు

- శంషాబాద్ మండలం రాళ్లగూడలోని కేబీఎన్ స్క్రాప్ గోదాంలో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. పక్కనే ఉన్న ప్రియాంక గ్యాస్ ఏజెన్సీకి ఎగబాకాయి. సిబ్బంది వెంటనే అప్రమత్తమై 80పైగా సిలిండర్లను సురక్షిత ప్రాంతానికి తరలించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు చెత్తకు నిప్పు పెట్టడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు.
- వట్టినాగులపల్లిలోని ఓ కార్ల గోదాంలో షార్ట్ సర్క్యూట్‌తో భారీగా మంటలు చెలరేగాయి. గోదాంలో పార్కింగ్ చేసిన 20కిపైగా కార్లు దగ్ధం అయ్యాయి. సమీపంలోనే ఫైర్ స్టేషన్ ఉండటం, వెంటనే అగ్నిమాపక చర్యలు చేపట్టడంతో ప్రాణ నష్టం తప్పింది.
- రాజేంద్రనగర్ కాటేదాన్ పారిశ్రామిక వాడలోని రవి ఫుడ్స్ కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. నిత్యం 500 మందికిపైగా పని చేసే ఈ కంపెనీలో అగ్నిమాపక చర్యలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పది ఫైరింజిన్లు సుమారు 12 గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పాల్సి వచ్చింది.
- ఆదివారం శేరిలింగంపల్లిలోని ఆలిండ్ పరిశ్రమలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఎండిపోయిన చెట్లు తగలబడి పోయాయి. ఫైర్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై, మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది.
- షాద్‌నగర్‌లోని మిలీనియం టౌన్‌షిప్ సమీపంలో రెండు రోజుల క్రితం తుక్కుగోదాంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తలెత్తింది. ప్లాస్టిక్ సామగ్రి పూర్తిగా దగ్ధమైంది.
- తుర్కయంజాల్ మున్సిపల్ పరిధి తొర్రూర్‌లోని గీతా టింబర్‌డిపోలో రెండు రోజుల క్రితం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.
- మార్చి 24న శంకర్‌పల్లిలోని ఓ కిరాణ దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించింది. సుమారు రూ.10 లక్షల విలువ చేసే ఆస్తి దగ్ధమైంది. మార్చి 15న టోలిచౌకిలోని ఓ ఆయిల్ గోదాంలో అగ్ని ప్రమాదం జరిగింది.

ఆస్తిపన్ను ఆదాయం రూ.1914 కోట్లు

ఆదివారం రాత్రి 11 గంటల వరకు..

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ఖజానాకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.1914.87 కోట్ల ఆస్తిపన్ను వసూలైంది. ఆదివారం రాత్రి 11 గంటల వరకు ఈ మొత్తం వసూలైంది. ఈ ఆర్థిక సంవత్సర ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యం రూ.2100 కోట్లు కాగా, గత నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు, త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల వల్ల ట్యాక్స్ సిబ్బంది ఎన్నికల విధులు కూడా నిర్వహించాల్సి వచ్చింది. అయినప్పటికీ కమిషనర్ తదితర అధికారులు ఎప్పటికప్పుడు తగిన ఆదేశాలివ్వడం, చర్యలు తీసుకోవడంతో ఈ మొత్తం వసూలైంది. ఆస్తిపన్ను వసూళ్ల కోసం వందల సంఖ్యలో వాణిజ్య భవనాలకు అధికారులు తాళాలు కూడా వేశారు. ఆస్తిపన్ను వసూళ్లకు సంబంధించి కచ్చితమైన వివరాలు సోమవారం తెలియనున్నాయి.

మా ప్రభుత్వానికి ప్రజాదరణ

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

లింగోజిగూడ: వంద రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆదరాభిమానాలను చూరగొందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎల్‌బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని ఆదివారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ అధ్యక్షతన కర్మన్‌ఘాట్‌లోని కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి గత ఎన్నికలలో సీఎం రేవంత్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించారని, ఈసారి పట్నం సునీతా రెడ్డిని అదే రీతిలో గెలిపించాలని కోరారు. త్వరలో తుక్కుగూడ రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీలతో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో డివిజన్ వారీగా సమావేశాలు నిర్వహించి బూత్ స్థాయి నుంచి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. మధుయాష్కీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదేళ్ల దుర్మార్గ పాలనకు.. వంద రోజులుగా కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనకు మధ్య తేడాను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన ఆస్తులను కాపాడుకోవడానికి తిరిగి కాంగ్రెస్‌లోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్, రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు జయమ్మ, కార్పొరేటర్ సుజాత నాయక్, మాజీ కార్పొరేటర్లు సామ రమణారెడ్డి, ప్రకాశ్‌గౌడ్, నాయకులు ఎస్వీ కృష్ణప్రసాద్, మల్లారపు శ్రీనివాస్, బుడ్డ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అబిడ్స్‌లోని సెయింట్ జోసెఫ్ చర్చిలో..



భక్తిశ్రద్ధలతో ఈస్టర్

ఏసుక్రీస్తు పునరుత్థానం చెందిన ఈస్టర్ పుణ్యదినాన్ని ఆదివారం నగరంలోని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.





ప్రత్యేక ప్రార్థనలు

మేయర్ ఇంటి వద్ద కరెంటు పోలేదు

సరఫరా నిలిచిపోయిందనడంలో నిజం లేదు

బంజారాహిల్స్: 'విద్యుత్‌పై సమీక్ష చేసి.. ఒక్క నిమిషం కూడా కరెంటు పోనియ్యం.. అని సచివాలయంలో చెప్పి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఇంటికి సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లగానే కరెంటు పోయింది.. ప్రొటోకాల్ ప్రకారం సీఎం ఉన్న ఏరియాలో కరెంటు పోవద్దు.. రేవంత్‌రెడ్డి మీకే దిక్కు లేదు.. మీరు ప్రజలకేం గ్యారంటీ ఇస్తారు' అని బీఆర్ఎస్ నేత వై.సతీష్‌రెడ్డి ఆదివారం చేసిన ట్వీట్‌తో విద్యుత్ అధికారులు స్పందించారు. శనివారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీనగర్‌లో కేకే, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వచ్చారని, ఆయన ఉన్నంతసేపు ఎలాంటి కరెంటు అంతరాయం కలగలేదని, టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారులు రీట్వీట్ చేశారు. ఇంటర్నల్ వైరింగ్ లోపంతో టెంపరరీగా ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్లు వెలుగుతూ ఆరిపోయాయని, ఇది కరెంటు వైర్ సమస్య వల్ల తలెత్తిందని, అసలు కరెంటు పోలేదని స్పష్టం చేశారు. మేయర్ ఇంటి ముందు, పరిసర ప్రాంతాల్లో వీధి దీపాలు నిరంతరాయంగా వెలిగాయన్నారు. ఇదిలా ఉండగా కరెంటు పోయినట్లుగా వచ్చిన వార్తల పట్ల మేయర్ నివాస సిబ్బంది కూడా స్పందించారు. సీఎం ఉన్నంతసేపు అసలు కరెంటు పోలేదని, ఒక వైర్ కదలిక వల్ల ఫ్లడ్ లైట్లు ఆరుతూ వెలిగాయన్నారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఇంటికి 11 కేవీ ఫీడర్‌తో స్పెషల్‌గా కరెంటు సరఫరా ఉందని బంజారాహిల్స్ ఏడీఈ ఆర్.హైమానంద వెల్లడించారు. శనివారం సీఎం వచ్చిన సమయంలో మేయర్ ఇంటితో పాటు ఎన్‌బీటీనగర్‌లో కరెంటు అంతరాయం కలగలేదని స్పష్టం చేశారు. మేయర్ ఇంటి వద్ద సీఎం ఉన్న సమయంలో మూడుసార్లు కరెంటు పోయిందంటూ జరుగుతున్న దుష్ప్రచారంలో ఎంతమాత్రం వాస్తవం లేదన్నారు.

మద్యం మత్తులో సినీ కార్మికుడి హత్య

బంజారాహిల్స్: మద్యం మత్తులో జరిగిన గొడవలో స్నేహితుడిని దారుణంగా పొడిచి చంపిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. పంజగుట్ట వెంకటరమణ కాలనీలో నివసించే జె.మునిరాజు (28) సినీ పరిశ్రమలో సెట్ వర్క్ చేస్తుంటాడు. ఆయనకు 2012లో వివాహమైంది. మూడేళ్లుగా కృష్ణానగర్ ప్రాంతంలో ఒంటరిగా ఉంటున్నాడు. శనివారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో తన మిత్రుడితో కలిసి జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–5లోని అన్నపూర్ణ స్టూడియో పెట్రోల్ బంకు సమీపంలో మద్యం తాగుతున్నారు. ఈ క్రమంలో స్నేహితుడితో గొడవ జరిగింది. దీంతో బీరు బాటిల్‌ను పగులగొట్టిన స్నేహితుడు.. మునిరాజును పొత్తి కడుపులో పొడిచి హత్య చేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు. హత్యలో ఒక్కరే పాల్గొన్నట్లుగా ప్రాథమిక అంచనాకు వచ్చారు. హత్య చేసింది ఎవరనేది ఇంకా తెలియరాలేదని, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఇక్కడ సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ కార్మికుల జీవితాల్లో వెలుగులు



సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ కార్మికులకు ఒక్కతాటిపైకి తీసుకువచ్చి.. వారి జీవితాల్లో వెలుగులు నింపడంలో తెలంగాణ విద్యుత్ వర్కర్స్ యూనియన్ (బి–2871) ముందు వరుసలో ఉందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ జేఏసీ చైర్మన్ కె.రఘుతో కలిసి మింట్ కాంపౌండ్‌లో గత ప్రభుత్వం సీజ్ చేసిన తెలంగాణ విద్యుత్ వర్కర్స్ యూనియన్ (బి–2871) ఆఫీసును ఆదివారం ఆయన పునఃప్రారంభించారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. విద్యుత్ కార్మికులకు యూనియన్ అండగా నిలిచిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో కలిసికట్టుగా పోరాటం చేయడంలో ముందుందన్నారు. యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గాంబో నాగరాజ్, ప్రధాన కార్యదర్శి నాగం సంతోష్‌రెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, ఉపాధ్యక్షుడు మురళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్, వెంకటేష్, సత్యం, బాల సిద్ధులు, దుర్గా ప్రసాద్, లక్ష్మణ్, బాల కృష్ణ, మనోజ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

షియా ముస్లింల షహదత్ సంస్మరణ ర్యాలీ



చార్మినార్: ఇస్లాం పరిరక్షణ కోసం మహ్మద్ ప్రవక్త అల్లుడు హజ్రత్ ఇమామ్ అలీ అలైహి సలాం ప్రాణాలర్పించిన సందర్భంగా పాతబస్తీలో షియా ముస్లింలు ఆదివారం సంస్మరణ ర్యాలీ నిర్వహించారు. ఇమామ్ అలీ ఆత్మకు శాంతి కలగాలంటూ చార్మినార్ నుంచి ప్రారంభమైన సంస్మరణ ర్యాలీ దారుషిఫా మీదుగా కాలికబర్, దారుషిఫా ద్వారా చాదర్‌ఘాట్ వరకు కొనసాగింది. షహదత్ ర్యాలీ సందర్భంగా దక్షిణ మండలం పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా.. షహదత్ ర్యాలీ మదీనా చౌరస్తాకు చేరుకోగానే హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలత ర్యాలీకి స్వాగతం పలికారు. ఆలంకు పూలు దట్టీలు సమర్పించారు.

సికింద్రాబాద్ ఇన్‌చార్జిగా కోమటిరెడ్డి – మల్కాజిగిరికి మైనంపల్లి

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఆదివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. సికింద్రాబాద్‌కు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, మల్కాజిగిరికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, హైదరాబాద్‌కు ఒబేదుల్లా కొత్వాల్, చేవెళ్లకు నరేందర్ రెడ్డిలను నియమితులయ్యారు. అదేవిధంగా ఏఐసీసీ ఇన్‌చార్జిలుగా హైదరాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గాలకు రోహిత్ చౌదరి, మల్కాజిగిరి, చేవెళ్ల నియోజకవర్గాలకు విష్ణునాథ్ నియమితులయ్యారు.

ఎంబీఏ సీట్లు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం

నిందితుడిపై కేసు నమోదు

అమీర్‌పేట: నగరంలోని టాప్ కళాశాలల్లో ఎంబీఏ కోర్సులో చదువుకునేందుకు సీటు, 15 రోజుల్లో అమెజాన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం చేసిన వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైకోర్టు యూనిట్‌లో పని చేసే టీఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్ నరేందర్ జీఎస్‌పీఎఫ్–98 బ్యాచ్ వాట్సాప్ గ్రూపులో టాప్ 10 కళాశాలల్లో ఎక్కడైనా ఎంబీఏ సీటు ఇప్పిస్తానని పోస్టులు పెట్టాడు. దీంతో హయత్‌నగర్‌కు చెందిన బి.అరుణ వాట్సాప్ గ్రూప్ ద్వారా నరేందర్‌ను సంప్రదించింది. అమీర్‌పేట సత్యం థియేటర్ సమీపంలోని తన కార్యాలయానికి రావాలని చెప్పడంతో అరుణ తన కొడుకు మనోజ్‌కుమార్‌తో కలిసి వచ్చింది. మంచి కళాశాలలో సీటు ఇప్పిస్తానని వారిని నమ్మించిన నరేందర్ తన కోడలు సరిత అకౌంట్‌కు రూ.2.80 లక్షలు బదిలీ చేయించుకున్నాడు. మనోజ్‌కు చెందిన సర్టిఫికెట్లన్నింటినీ తీసుకున్నాడు. మరోసారి బాధితులకు ఫోన్ చేసి అమెజాన్‌లో మంచి ఉద్యోగం ఉందని, మరో రూ.2.80 లక్షలు ఇస్తే 15 రోజుల్లో ఆఫర్ లెటర్ ఇప్పిస్తానని చెప్పి రెండోసారి తన కోడలు అకౌంట్‌లోకి బదిలీ చేయించుకున్నాడు. అంతే కాకుండా జేఎస్‌టీయూలో సబ్జెక్ట్స్ రీ కరెక్షన్ చేయిస్తానని చెప్పడంతో అరుణ తన రెండో కుమారుడి కోసం రూ.4.15 లక్షలు సరిత అకౌంట్‌కు బదిలీ చేసింది. మొత్తం రూ.9.75 లక్షలు చెల్లించి 8 నెలలు గడిచినా పని జరగకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.



సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే మేరీ రవీంద్రనాథ్

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ మాజీ ఎమ్మెల్యే మేరీ రవీంద్రనాథ్ ఆదివారం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెతో పాటు గ్రేటర్ హైదరాబాద్ టీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు కట్టెల శ్రీనివాస్ యాదవ్ సైతం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదం సుజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

1, 2 తేదీల్లో పీఓ, ఏపీఓలకు శిక్షణ

జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్

హిమాయత్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలు సమర్థ నిర్వహణ కోసం పీఓ, ఏపీఓలకు ఈ నెల 1, 2 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం సమయంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణలో భాగంగా పీఓ, ఏపీఓలు శిక్షణ తరగతులకు హాజరు కావాలని ఆయన సూచించారు. ఓటరు ఎపిక్ కార్డు నంబర్, ఓటరుగా నమోదు అయిన నియోజకవర్గంలోని ఓటరు జాబితాలోని పార్టు నంబర్, సీరియల్ నంబర్ కూడా తీసుకురావాలన్నారు.

ప్రియురాలితో చనువుగా ఉంటున్నాడని..

యువకుడిపై మరో యువకుడి దాడి

అత్తాపూర్: తన ప్రియురాలితో చనువుగా ఉంటున్నాడనే కారణంతో ఓ యువకుడిపై మరో యువకుడు దాడి చేసిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చింతల్‌మెట్ సల్వా అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ముస్తఫా నిర్మాణ రంగంలో పనిచేస్తున్నాడు. అతడికి టోలిచౌకికి చెందిన అఫ్నాన్ అహ్మద్, అనోస్ స్నేహితులు. అఫ్నాన్ మహ్మద్ ప్రియురాలితో ముస్తఫా చనువుగా ఉంటున్నట్లు గుర్తించిన అఫ్నాన్ పలుమార్లు అతడిని హెచ్చరించాడు. అయినా అతడి వైఖరిలో మార్పు రాలేదు. ఆదివారం ముగ్గురు స్నేహితులు ముస్తఫా ఇంట్లో మద్యం తాగారు. ఈ సందర్భంగా తన ప్రియురాలితో చనువుగా మాట్లాడుతున్న విషయమై అఫ్నాన్ ముస్తఫాను నిలదీశాడు. మాటా మాటా పెరగడంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో ముస్తఫాపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితుడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




ఉత్సాహంగా స్ట్రీట్ కాజ్ 5కే రన్

రన్ ఫర్ ఏ కాస్ పేరుతో స్ట్రీట్ కాజ్ ఆధ్వర్యంలో ఆదివారం పీపుల్స్ ప్లాజా వేదికగా రన్‌ను నిర్వహించారు. 15 ఏళ్లుగా స్ట్రీట్ కాజ్ హైదరాబాద్‌లో అగ్రగామి విద్యార్థుల ఎన్జీఓ సంస్థగా 15వందల ప్రాజెక్టులు విజయవంతంగా అమలు చేస్తోందని, 5 కోట్లు, 40కి పైగా కళాశాల విభాగాలు యూనిట్లుగా విస్తరించిందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రన్ ఫర్ ఏ కాజ్ పేరుతో పదో ఎడిషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5కే రన్‌తో పాటు జుంబా డ్యాన్స్, స్టాండ్ అప్ కామెడీలను ప్రదర్శించారు. కార్యక్రమంలో నటుడు నవదీప్, దిల్‌రాజు తదితరులు పాల్గొన్నారు. -ఖైరతాబాద్

ఎవరొస్తారో..?

ఓయూకు నూతన వీసీ ఎంపికపై కసరత్తు
- 93 మంది ప్రొఫెసర్ల దరఖాస్తు
- రిటైరైన వారే అత్యధికం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు వచ్చే (మే) నెలలో కొత్త వీసీ రానున్నారు. వీసీ పదవీ కోసం దరఖాస్తు చేసుకున్న 93 మంది ప్రొఫెసర్లలో అత్యధికంగా రిటైరైన అధ్యాపకులు. కొందరు ప్రొఫెసర్లు ఓయూతో పాటు ఇతర వర్సిటీలకు కూగా దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుత వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణతో పాటు గతంలో వీసీలుగా, ఇతర అధికారులుగా పనిచేసి సీనియర్ అధ్యాపకులు, ప్రొఫెసర్లు ఉన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రొఫెసర్ల వివరాలపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. మాజీ వీసీ ప్రొ.డీసీ రెడ్డి తర్వాత 25 ఏళ్లుగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అధ్యాపకులకు వీసీగా అవకాశం దక్కలేదు. గత 25 ఏళ్లలో వెలమ, బీసీ, ముస్లిం మైనార్టీ వర్గాలకు చెందిన అధ్యాపకులు వీసీలుగా పని చేశారు. ఇదిలా ఉండగా 107 ఏళ్ల ఓయూకు ఇంత వరకు ఎస్సీ, ఎస్టీ ప్రొఫెసర్లు వీసీలుగా నియమించలేదు. సామాజిక న్యాయంలో భాగంగా ఈ సారీ ఎస్సీ లేదా ఎస్టీలకు ప్రొఫెసర్లకు వీసీ పదవి దక్కుతుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు. వీసీ పదవికి దరఖాస్తు చేసుకున్న ప్రముఖుల్లో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, దూరవిద్య డైరెక్టర్ ప్రొ.జీబీ రెడ్డి, కామర్స్ సీనియర్ ప్రొ.అప్పారావు, పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగా రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రాజ్‌కుమార్ తదితరులతో పాటు విశ్రాంత ప్రొఫెసర్లు, పలువురు మాజీ వీసీలు, రిజిస్ట్రార్లు ఉన్నారు.

తుని టు హైదరాబాద్..

- అక్రమంగా హష్ ఆయిల్ సరఫరా
- ముగ్గురు యువకుల అరెస్ట్
- 2.2 లీటర్ల హష్ ఆయిల్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ శ్రీనివాస్

జీడిమెట్ల: హష్ ఆయిల్‌ను నగరానికి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు యువకులను ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదివారం పేట్‌బషీరాబాద్ డీసీపీ కార్యాలయంలో బాలానగర్ డీసీపీ డి.శ్రీనివాస్, ఎస్ఓటీ డీసీపీ నర్సింహారెడ్డి, అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. విశాఖపట్నం జిల్లా, గోకులకుంట గ్రామానికి చెందిన గొల్లు కుమారస్వామి బతుకుదెరువు నిమిత్తం నగరానికి వసల వచ్చి గండిమైసమ్మలోని ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. అతనికి వచ్చే జీతం జల్సాలకు సరిపోకపోడంతో గంజాయి, హష్ ఆయిల్‌ను సరఫరా చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో తుని ప్రాంతానికి చెందిన నాగేశ్వర రావు అలియాస్ నాగును సంప్రదించి హష్ అయిల్‌ను కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. తన గ్రామానికి చెందిన కోడి అజయ్‌కుమార్‌ను హైదరాబాద్‌కు సరుకు సరఫరా చేసే పెద్ద మొత్తంలో డబ్బులు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నారు.

- కుమారస్వామి సూచన మేరకు అజయ్ కుమార్ ఈనెల 29న తన స్నేహితుడు లోకవరపు స్వామి గణేష్‌తో కలిసి తుని నుంచి బైక్‌పై హష్ ఆయిల్ తీసుకుని హైదరాబాద్ బయలుదేరాడు. దీనిపై సమాచారం అందడంతో మేడ్చల్, బాలానగర్ ఎస్ఓటీ, మేడ్చల్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి రూ.12.30లక్షల విలువైన 2.2లీటర్ల హష్ అయిల్, మూడు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కుమార స్వామి, కోడి అజయ్‌కుమార్, గణేష్‌లను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న పోలీసులను డీసీపీ అభినందించారు.

డెబిట్, క్రెడిట్ కార్డులు చోరీ చేసి నగదు డ్రా

వెంగళరావునగర్: డెబిట్, క్రెడిట్ కార్డులు కొట్టేసి నగదు డ్రా చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం కామారెడ్డికి చెందిన లక్ష్మీకాంతరావు ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ స్థానిక జవహర్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇటీవల రాయదుర్గం నుంచి యూసుఫ్‌గూడకు బస్సులో వస్తుండగా అతడి పర్సు చోరీకి గురైంది. అందులో కొంత నగదు, క్రెడిట్, డెబిట్ కార్డులు ఉన్నాయి. కాగా ఈనెల 28న రాత్రి హెచ్‌డీఎఫ్‌సీ డెబిట్ కార్డు నుంచి రూ. లక్ష, ఐసీఐసీఐ క్రెడిట్ కార్డు నుంచి రూ. 10 వేలు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు ఆదివారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారిపై దాడి.. బంగారు గొలుసు చోరీ

రాజేంద్రనగర్: కారును వెంబడించి అటకాయించిన ఇద్దరు యువకులు ఓ వ్యాపారిపై దాడి చేసి మెడలోని ఆరు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సన్‌సిటీ ప్రాంతానికి చెందిన కన్నయ్యలాల్ స్థానికంగా పాపాలాల్ స్వీట్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం కారులో తన బంధువుతో కలిసి సన్‌సిటీ నుంచి ఉప్పర్‌పల్లి మీదుగా ఆరాంఘర్ వైపు వెళుతున్నాడు. పిల్లర్ నంబర్ 181 వద్దకు రాగానే వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు కారును ఆటకాయించి మా వాహనాన్ని ఢీ కొడతావా అంటూ అతడిపై దాడి చేస్తూ కారులో నుంచి బయటికి లాగారు. అనంతరం అతడి మెడలోని ఆరు తులాల బంగారు గొలుసును లాక్కుని ఉడాయించారు. నడిరోడ్డుపై ఈ ఘటన జరుగుతున్నా ఎవరూ ఆపేందుకు సాహసించకపోవడం గమనార్హం. దీనిపై సమాచారం అందడంతో రాజేంద్రనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.


ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌లో వస్త్రాలను తిలకిస్తున్న శైలజా రామయ్యర్, సింగర్ ఉష

శ్రీనగర్‌కాలనీ: నాణ్యమైన పట్టు, కాటన్ వస్త్రాలకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ గ్యారంటీగా నిలుస్తుందని రాష్ట్ర హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు. ఆదివారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన సిల్క్ ఎగ్జిబిషన్‌ను ఆమె సింగర్ ఉషతో కలిసి ప్రారంభించారు. చేనేత కళాకారుల ఉత్పత్తులను తిలకించి వారిని అభినందించారు. ప్రతిఒక్కరూ చేనేత ఉత్పత్తులను ధరించి వారికి తోడ్పాటు అందించాలని కోరారు.ఈ సందర్భంగా సింగర్ ఉష ఓ పాటను పాడారు. సిల్క్‌మార్క్‌తో నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరలకే అందిస్తూ చేనేతకారులను ప్రోత్సహిస్తున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ వినియోగదారులకు అందిస్తున్న నిర్వాహకులు శ్రీనివాసరావు కృషిని శైలజా రామయ్యర్ అభినందించారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను సుమారు 80 స్టాల్స్‌లో ఏర్పాటుచేశామని సిల్క్ ఇండియా సీఈఓ వినయ్ తెలిపారు. పోచంపల్లి, చెందేరి, ఇక్కత్, నారాయణ్‌పేట్, బెనారస్, కొల్‌కతాకు చెందిన విభిన్నమైన అరుదైన చీరలను ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, శ్రీదేవి నిరుప్, డాక్టర్ సుధావాణి, వాణి మోచెర్ల పాల్గొన్నారు. ఏప్రిల్ 7 వరకు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.


ముగిసిన 'ఏఐ డేస్'




సదస్సులో పాల్గొన్న జయేష్ రంజన్ తదితరులు

బాలానగర్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌పై జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన ఏఐ డేస్ 2024 కాన్ఫరెన్స్ ఆదివారం ముగిసింది. ముగింపు సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ కంప్యూటర్ సైన్స్ ఇంజనీర్ డాక్టర్ కృష్ణ పాలెం, స్వేచ్ఛ వ్యవస్థాపకుడు వై. కిరణ్ చంద్ర, కార్యదర్శి ప్రవీణ్ చంద్ర హాజరయ్యారు. సదస్సులో రెండు వేల మందికి పైగా ఐటీ నిపుణులు, పరిశోధకులు, స్టార్టప్‌లు, విద్యార్థులు, ప్రముఖ టెక్ కంపెనీల నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు ఏఐ వాయిస్ అసిస్టెంట్‌ను ప్రారంభించారు. రైతులు, ఫ్రంట్‌లైన్ హెల్త్‌కేర్ కార్మికులు, పారిశుధ్య కార్మికులు, ఇతరులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుతాలను యాక్సెస్ చేయటానికి వీలు కల్పిస్తుంది. తెలుగు ఏఐ వాయిస్ అసిస్టెంట్ వినియోగంపై ఏవీ ద్వారా అవగాహన కల్పించారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా



రాజేంద్రనగర్: పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై వేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పక్కనే ఉన్న రోడ్డుపై పల్టీ కొట్టిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కారులోని బెలూన్లు ఓపెన్ కావడంతో ప్రయాణికునికి స్వల్ప గాయాలు, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఫిబ్రవరి 11న ఇదే ఫ్లై ఓవర్‌పై సదరు కారు వేగంగా వెళుతుండటంతో రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు చలాన్ విధించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఓ ప్రయాణికుడు మెట్రో బిజినెస్ సర్వీసుకు చెందిన ఎలక్ట్రిక్ కారు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నాడు. కారు డ్రైవర్ పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై పై వేగంగా వెళుతూ పిల్లర్ నంబర్ 150 వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పక్కనే ఉన్న రోడ్డుపై పల్టీ కొట్టింది. ఎయిర్ బ్యాగ్ కావడంతో ప్రయాణికునికి స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో వాహనదారులు అద్దాలు పగలగొట్టి అతడిని బయటికి తీసి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్, ప్రయాణికుల వివరాలు తెలియలేదని రాజేంద్రనగర్ పోలీసులు తెలిపారు. ప్రమాదానికి గురైన కారును రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



విద్యార్థినితో అసభ్య ప్రవర్తన..

నిందితుడి అరెస్ట్

అల్వాల్: ట్యూషన్‌కు వెళ్తున్న విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించి ఆమె సెల్‌ఫోన్ లాక్కెళ్లిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. బాలనగర్‌కు చెందిన విద్యార్థిని నేరేడ్‌మెట్‌లోని ఓ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. శనివారం సాయంత్రం బాలనగర్ నుంచి ట్యూషన్‌కోసం నేరేడ్‌మెట్‌కు బస్సులో వచ్చిన ఆమె నేరేడ్‌మెట్ బస్టాప్‌లో బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తుంది. ఆమెను వెంబడించిన ఓ యువకుడు స్థానిక రామాలయం సమీపంలో ఆమె చెయ్యి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించడమేగాక ఆమె వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన నేరేడ్‌మెట్ పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడు చింతమల్ల మహేందర్‌గా గుర్తించారు. ఆదివారం అతడిని అదుపులోకి తీసుకుని విద్యార్థిని సెల్‌ఫోన్ తోపాటు బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కుమార్తె వివాహానికి చేసిన అప్పు తీర్చలేక పోయానని..

మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య

రహమత్‌నగర్: కుమార్తె వివాహానికి చేసిన అప్పు తీర్చలేక మనస్తాపానికి లోనైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన బైరాగి బిస్వాల్(45)కార్మికనగర్‌లో ఉంటూ మేస్త్రీగా పని చేస్తున్నాడు. అతడికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. గత ఏడాది కమార్తె బబిత బిస్వాల్‌కు వివాహం చేశాడు. ఇందుకుగాను అప్పు చేశాడు. అప్పు తీర్చలేక మనస్తాపానికిలోనైన బైరాగి శనివారం రాత్రి తన ఇంట్లో ఇనుప రాడ్డుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు సంతోష్ బిస్వాల్ ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల సంరక్షణలో తప్పిపోయిన చిన్నారి



పోలీసుల సంరక్షణలో కిరణ్

రాంగోపాల్‌పేట్ : ఐదేళ్ల ఓ చిన్నారి తప్పిపోయి రోడ్డుపై తిరుగుతుండగా మార్కెట్ పోలీసులు చేరదీశారు. పోలీసుల కథనం ప్రకారం.. వెస్ట్ మెట్రో స్టేషన్ ప్రాంతంలో ఐదేళ్ల చిన్నారి తిరుగుతూ.. పెట్రోలింగ్ పోలీసులకు కనిపించాడు. అతడి వివరాలు ఆరా తీయగా తన పేరు కిరణ్, తండ్రి పేరు నరసింహ అని చెప్పాడు. ఎక్కడ ఉండేది తదితర వివరాలు చెప్పలేకపోయాడు. బాలుడిని చేరదీసిన పోలీసులు సీడబ్ల్యూసీ అధికారులకు అప్పగించారు. సంబంధీకులెవరైనా ఉంటే మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

డ్రగ్స్ కొరియర్ చేస్తున్నారంటూ..

- ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసుల పేరుతో బెదిరింపులు
- రూ.9.6 లక్షలు వసూలు

హిమాయత్‌నగర్: ఫెడెక్స్‌లో డ్రగ్స్ కొరియర్ చేస్తున్నారంటూ నగరానికి చెందిన ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తికి ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసుల పేరుతో కాల్ వచ్చింది. తన ఆధార్ కార్డ్ పేరుతో 30 ఎల్ఎస్‌డీ ప్యాకెట్లు (డ్రగ్స్), 5 పాస్‌పోర్టులు, 1 ల్యాప్‌టాప్ ఫెడెక్స్ పార్శిల్‌ను ముంబై కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అంతేగాక అతడి బ్యాంక్ ఖాతా ద్వారా మనీ లాండరింగ్ పాల్పడ్డారని, సీబీఐ కేసు నమోదైందని బెదిరించారు. అనంతరం బాధితుడికి సీబీఐ అధికారి పేరుతో సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేసి, ముంబై కస్టమ్స్ అధికారులు కేసు నమోదు చేశారని, అతడి ఇంటిపై దాడి చేసి కుటుంబ సభ్యులందరినీ అరెస్ట్ చేస్తారని బెదిరించారు. ఆర్‌బీఐ రహస్య ఖాతాకు డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయాలని, 12 గంటల్లో తిరిగి చెల్లిస్తామని నమ్మించారు. దీంతో అతను రూ.9,68,974 బదిలీ చేశాడు. అయితే డబ్బు తిరిగి రాకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

బీజేపీ ఖాతాలో 'డబుల్ డిజిట్' విజయం ఖాయం

బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం అభ్యర్థి కిషన్‌రెడ్డి


సోమాజిగూడలో ప్రజలతో సెల్ఫీ తీసుకుంటున్న కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్: పార్లమెంటు ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తెలంగాణలో డబుల్ డిజిట్ సంఖ్యలో సీట్లు గెలవబోతున్నామని కేంద్ర మంత్రి, బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సోమాజిగూడలోని ఠాకూర్ మాన్షన్‌లో స్థానిక సీనియర్ బీజేపీ నేత సాధనా ఠాకూర్ ఏర్పాటు చేసిన కాలనీవాసుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో సాధించిన ప్రగతిని వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... అధికార కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు పరిష్కారం చేస్తామని, అమలు చేస్తామని చెప్పి విస్మరించిందని, రైతులకు రుణ మాఫీ కావొచ్చు, ఎకరానికి రూ. 10 వేల సాయం చేస్తామని చెప్పి మోసగించారని ఆరోపించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఉన్న 40 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు తదితరులు పాల్గొన్నారు.

మాలలపై అసత్య ప్రచారం మానుకోవాలి

తెలంగాణ మాలమహానాడు ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రశాంత్


మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రశాంత్

హిమాయత్‌నగర్: తెలంగాణలో మాలలపై ఎమ్మార్పీఎస్, మాదిగ సంఘాలు చేస్తున్న విష ప్రచారం మానుకోవాలని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రశాంత్ సూచించారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మాలలు కన్నా మాదిగ కుల జనాభా ఎక్కువ అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మాల, మాల ఉప కులాలు ఎస్సీ జాబితాలో సుమారు 23 మాల ఉప కులాలు ఉన్నాయని.. జనాభా రీత్యా మాదిగల కన్నా మాల కులాలే తెలంగాణలో అత్యధిక జనాభాగా ఉన్నారని గుర్తు చేశారు. ఈ రాజకీయ పార్టీల నాటకీయ కుట్రలు పట్ల మాల జాతి అప్రమత్తంగా ఉండాలని ప్రవీణ్ పిలుపు ఇచ్చారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో వర్గీకరణకు అనుకూలంగా ఉన్న పార్టీలను ఓడించాలని, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బలమైన గళం వినిపిస్తూ.. దేశంలో దళితుల ఐక్యత కోసం దళిత బహుజన పార్టీ అభ్యర్థులకు మాలమహానాడు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు ప్రశాంత్ ప్రకటించారు.

సమాజశ్రేయస్సును కాంక్షించేవారు రాజకీయాల్లోకి రావాలి


కల్లెం శ్రీనివాసరెడ్డిని కలిసిన ఐపీసీ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేబీ శ్రీధర్

శ్రీనగర్‌కాలనీ: సేవాభావం, సమాజశ్రేయస్సును కోరుతూ ప్రజలతో మమేకమయ్యే వారు రాజకీయాల్లోకి వచ్చి ప్రజల్లో మార్పు తీసుకొచ్చి సమాజాభివృద్ధికి కృషిచేయాలని ఇండియన్ ప్రజాకాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ అన్నారు. ఆదివారం ఎర్రగడ్డ కళ్యాణ్‌నగర్‌లో నివసించే సామాజికవేత్త కల్లెం శ్రీనివాసరెడ్డికి నివాసానికి వచ్చి కలిసి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తమ పార్టీ తరపున అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉండాలని కోరారు. మూడు దశాబ్దాలుగా ప్రజల్లో ఉంటూ లయన్స్ క్లబ్‌తో పాటు ఎన్నో సేవాకార్యక్రమాలను నిర్వహించారని తమలాంటి వారు రాజకీయాల్లోకి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... నా శ్వాస ఉన్నంత వరకూ సమాజశ్రేయస్సుకు కృషిచేస్తానని, తాను తన మిత్రులు, అనుచరులతో మాట్లడి తుది నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. ఐపీసీ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు నరసింహగుప్తా, సారథినగర్ సొసైటీ మాజీ అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు, కళ్యాన్‌నగర్ వెంచర్-3 సంయుక్త కార్యదర్శి వీరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఎన్నికల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో పోటీ చేస్తాం'

లిబర్టీ: రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల్లో పోటీ చేస్తామని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ వెల్లడించారు. భావ సారూప్యతతో పాటు కలిసి వచ్చే లౌకిక పార్టీలతో పొత్తు పెట్టుకుంటామని స్పష్టం చేశారు. లిబర్టీ ప్లాజాలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోక్‌సభ, శాసన సభ ఎన్నికల్లో బరిలో నిలుస్తామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల్లో కచ్చితంగా పోటీ చేసి తీరుతామని స్పష్టం చేశారు. తెలంగాణలోని అన్ని లోక్‌సభ స్థానాల్లో కలిసి వచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకుంటామని అవసరమైతే కొన్ని స్థానాల్లో ఒంటరిగా బరిలోకి దిగుతామన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని త్వరలోనే స్క్రీనింగ్ కమిటీ సమావేశమై అభ్యర్థుల ఎంపిక ఖరారు చేస్తామని అన్నారు. దీంతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయాలని యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్కడ రాజకీయ పరిణామాలపై లోతుగా చర్చించిన తరువాతే ఏపీ పార్టీలతో పొత్తు పెట్టుకోవాలని ఒంటరిగా పోటీ చేయాలా అనే అంశాన్ని పార్టీలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని శ్రీధర్ స్పష్టం చేశారు.

ఆయుధాలు అప్పగించండి..!

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయుధాలు డిపాజిట్ చేయాలని ఆదేశం

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. అసాంఘిక శక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేయడం, గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా చూడటం, ఎన్నికలు సజావుగా సాగడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం ఆయా పోలీస్ స్టేషన్లకు మార్గదర్శకాలు జారీ చేసింది. వాటిని కఠినంగా అమలుచేసే దిశలో రోజువారీ నివేదికలు తీసుకుంటుంది.

- అప్రమత్తమైన పోలీసులు
- ప్రతిరోజూ పురోగతిపై నివేదికలు


బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్



బంజారాహిల్స్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే 13న సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి ఎన్నికలు జరగనుండగా ఏప్రిల్‌లోనే ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల ప్రక్రియ, ఉపసంహరణ, ప్రచారపర్వం ఊపందుకోనుంది. సార్వత్రిక ఎన్నికల సమరం ఇప్పటికే మొదలై బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తమ అభ్యర్థులను కూడా ప్రకటించాయి.

- సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధి కిందకు వచ్చే ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గాల పరిధిలో లైసెన్స్ కలిగిన ఆయుధాలను కొద్ది రోజుల నుంచి పోలీసులు డిపాజిట్ చేయిస్తున్నారు.
- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయుధాలు కలిగి ఉన్నవారంతా ఆయా ఠాణాల్లో వాటిని డిపాజిట్ చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. రోజూ ఇందుకు సంబంధించిన పురోగతిపై దృష్టి సారించారు.
- లైసెన్స్ పొందిన వారు తమ ఆయుధాలను సమీప పోలీస్‌స్టేషన్‌లో గానీ, లైసెన్స్ పొందిన ఆయుధ విక్రేత వద్ద గానీ డిపాజిట్ చేయాలని సూచిస్తున్నారు. గత ఏడాది నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆయుధాలు డిపాజిట్ చేసిన వారు డిసెంబర్ రెండో వారంలోనే నిబంధనల మేరకు తిరిగి తీసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వాటిని తిరిగి డిపాజిట్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.
- జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 11 పోలీస్ స్టేషన్లు కవర్ అవుతుండగా ఆయుధాలు కలిగిన వారి సంఖ్య 234గా ఉంది. ఇందులో ఇప్పటికే 133 మంది తమ ఆయుధాలను డిపాజిట్ చేశారు.
- ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 11 పోలీస్ స్టేషన్లు కవర్ అవుతుండగా 1963 మంది ఆయుధ లైసెన్స్‌లు కలిగి ఉన్నారు. ఇందులో ఇప్పటివరకు 320 మంది తమ ఆయుధాలను సమీప ఠాణాల్లో అప్పగించారు.

ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో ఆయుధాల సంఖ్య 1963

ఠాణా పేరు	ఆయుధాలు
పంజగుట్ట	256
బంజారాహిల్స్	896
ఫిలింనగర్	0
జూబ్లీహిల్స్	539
మాసబ్‌ట్యాంక్	0
ఖైరతాబాద్	36
అబిడ్స్	19
సైఫాబాద్	34
సెక్రటేరియట్	1
దోమలగూడ	19
నారాయణగూడ	163

జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో ఆయుధాలు-234

ఠాణా పేరు	ఆయుధాలు
జూబ్లీహిల్స్	28
ఫిలింనగర్	98
పంజగుట్ట	31
మధురానగర్	27
బోరబండ	46
హుమయూన్‌నగర్	0
సనత్‌నగర్	4

3 నుంచి ఓయూలో సాంస్కృతిక పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలను ఏప్రిల్ 3, 4 తేదీల్లో నిర్వహించనున్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో రెండ్రోజుల పాటు జరిగే సాంస్కృతిక పోటీల్లో క్యాంపస్ కాలేజీలతో పాటు అనుబంధ, ప్రైవేటు కాలేజీల విద్యార్థులు హాజరుకానున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రతిఏటా సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

అబోడ్ బయోటెక్‌తో ఓయూ ఒప్పందం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అబోడ్ బయోటెక్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాయి. వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అబోడ్ బయోటెక్ ప్రతినిధులు ఎం.శ్రీనాథ్, షాలిని ఒప్పందపత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్పిడి చేసుకున్నారు. ఒప్పందం ప్రకారం సంయుక్త పరిశోధనలు, అధ్యాపకుల మార్పిడి, విద్యార్థులకు ఇంటెన్‌షిప్, శిక్షణ, మౌలిక సదుపాయాల వినియోగం ఇతర అంశాలపై సహకారం కోసం సంతకాలు చేశారు.

సీఆర్‌పీఎఫ్ జవాను విష్ణుకు నివాళి


వీరమరణం పొందిన విష్ణు (ఫైల్)

బంజారాహిల్స్: సైఫాబాద్ సైన్స్ కాలనీలో చదువుకున్న విద్యార్థి కోల్‌కతాలో సరిహద్దులో సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా విధులు నిర్వహిస్తూ వీరమరణం పొందాడు. ఈ విషయం తెలుసుకున్న సైఫాబాద్ సైన్స్ కాలజీ విద్యార్థులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు కన్నీరుమున్నీరయ్యారు. ఆదివారం కళాశాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విష్ణు వీరమరణం పట్ల తమ ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ ఆయన చిత్రపటానికి నివాళులర్పించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వార మండలం రూపూర్ గ్రామానికి చెందిన విష్ణు సైఫాబాద్ సైన్స్ కాలేజీలో 2019వ బ్యాచ్ ఎంఎస్‌సీ ఫిజిక్స్ విద్యార్థి అని సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా వీరమరణం పొందాడని ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని కోరుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. దేశానికి సేవచేయాలని తపించేవాడిని, ఇక్కడ చదువుతున్నప్పుడే ఎంతో దేశభక్తిని కనబరిచేవాడని, దేశం కోసమే సీఆర్‌పీఎఫ్‌లో చేరాడని ఆయన గుర్తుచేశారు.

సమష్టిగా ప్రసన్నాంజనేయస్వామి ఆలయ అభివృద్ధి


సమావేశంలో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు

శ్రీనగర్‌కాలనీ: హేమావతీనగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు సమష్టిగా ముందుకుసాగాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి అన్నారు. ఆదివారం ఆలయ ప్రాగణంలో ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీలో ఉపాధ్యక్షుడి ఎంపిక, ఆలయ కమిటీ మాన్యువల్ రిటర్న్స్ ఫైల్ , ఆలయంలో మరిన్ని వసతులు కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆలయ కమిటీ సమావేశంలో పాల్గొనాలంటే తప్పనిసరి కమిటీ మెంబర్‌షిప్ కలిగి ఉండాలని తెలిపారు. సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కె.హెచ్.ఎస్.శర్మ, మహేందర్ రెడ్డి, శ్రీరాములు, శోభారెడ్డి, కె.విజయలక్ష్మి, రవిగౌడ్, సురేష్‌కుమార్, శంకర్, బాలు, మధు, రాము, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బస్తీ కమిటీలు అభివృద్ధికి తోడ్పడాలి

కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్


కార్పొరేటర్‌ను కలిసిన బస్తీ నూతన కమిటీ సభ్యులు

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్ డివిజన్‌లోని జనార్దన్ బాడ బస్తీ నూతన కమిటీ ఎన్నికైంది. ఆదివారం డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మీరామన్‌గౌడ్ నూతన బస్తీ కమిటీకి శుభాకాంక్షలు తెలియజేసి, నూతన కమిటీ సభ్యులను ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహాలక్ష్మీ మాట్లాడుతూ... నూతన బస్తీ కమిటీలు వాటి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. బస్తీలో నెలకొన్న పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి సభ్యులు తీసుకొచ్చారు. బస్తీ కమిటీ నూతన అధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా ఆనంద్, వైస్ ప్రెసిడెంట్‌గా కిరణ్ ఎన్నికయ్యారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 21, క్యారెట్ 21, దొండ 23, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 50, గోకరకాయ 23, కీర 23, దోసకాయ 16, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 33, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 60, సొరకాయ 7, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులను నియమించండి

బంజారాహిల్స్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుల నియామకాన్ని చేపట్టాలని ఖైరతాబాద్ డీసీసీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధన్‌రాజ్ రాథోడ్ కోరారు. ఆదివారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్ష పదవులు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేయాలంటూ ఇటీవల కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ, పి.విజయారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమీపంలో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి ప్రజల్లోకి వెళ్లాల్సి ఉందని, కేడర్‌ను సమన్వయ పరచాల్సిన అవసరం ఉందని, ప్రచార భాధ్యతలు కూడా చేపట్టాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే డివిజన్ అధ్యక్షుల నియామకం జరిగితే కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి తమవంతు ప్రచారం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ రెండు డివిజన్లను అధ్యక్షులను నియమించాలని కోరారు.

ఓయూలో విదేశీ విద్యార్థుల ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో విదేశాల విద్యార్థుల ప్రవేశాలకు ప్రకటన విడుదల చేశారు. యూనివర్సిటీ క్యాంపస్‌తో పాటు అనుబంధ, ప్రైవేటు కాలేజీల్లో 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీతో పాటు ఇతర కోర్సుల్లో ప్రవేశాలకు అధికారులు ప్రకటన జారీ చేశారు. పూర్తి వివరాలకు Osmania.ac.inను చూడొచ్చు.

ముగిసిన మహిళా దినోత్సవం

రాంగోపాల్‌పేట్: వెస్ట్ మారేడుపల్లి గీతాంజలి స్కూల్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన మహిళాదినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని హరిహర కళాభవన్‌లో ఆదివారం జరిగిన ముగింపు సమావేశంలో వివిధ రంగాల్లో ప్రముఖులైన మహిళలను ఘనంగా సత్కరించారు. నిజాంపేట్ మేయర్ నీలా గోపాల్‌రెడ్డి, సోషల్ యాక్టివిస్ ఇందుకూరి నిర్మలాదేవి, అలీప్ ఫౌండర్ ప్రెసిడెంట్ రమాదేవి, కార్పొరేటర్ కొంతం దీపిక, సర్వశిక్ష అభియాన్ మానిటరింగ్ హెడ్ డాక్టర్ కే.బాలకుమారి, ప్రముఖ ల్యాప్రోస్కోపిక్, కొలరెక్టర్ సర్జన్ డాక్టర్ శాంతి వర్ధని, క్లినికల్ సైకాలజిస్ట్ మాధవి, సోషల్ యాక్టివిస్ట్ మంజులత, సైంటిస్ట్ శీల శ్రీసుధ, చార్టెడ్ అకౌంటెంట్ స్వప్న ప్రియ, యోగా ఎక్స్‌ఫర్ట్ ప్రసన్న, కూచిపూడి నృత్య కళాకారిణి మృణాలిని తదితరులను ఘనంగా సత్కరించారు. పాఠశాల వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాసరావు, అకడమిక్ డైరెక్టర్ వేధకుమారిలు మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను విద్యార్థులకు తెలియ చేసేలా నెల రోజుల పాటు ప్రతిరోజూ ఒక ప్రముఖ మహిళల చేత విద్యార్థులకు మోటివేషనల్ స్పీచ్‌లు అందించినట్లు చెప్పారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు


నారాయణగుడలో ఆరాధన కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవులు


ఎమ్మెల్యే కాలనీ షారోన్ చర్చిలో ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్


లక్డీకాపూల్ లూథరన్‌చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

బంజారాహిల్స్: మానవాళికి ఏసుక్రీస్తు బోధనలు ఎంతో స్ఫూర్తివంతమైనవని, బైబిల్ మనం ఎలా జీవించాలో, ఎదుటి వ్యక్తికి ఎలా సహాయపడాలో గొప్ప విషయాలు ఉన్నాయని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఈస్టర్ పండుగ సందర్భంగా ఆదివారం ఆయన ఖైరతాబాద్ నియోజకవర్గంలోని పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీ షారోన్ఫుల్ గాస్పెల్ చర్చిలో ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న దానం మాట్లాడుతూ... తాను ప్రతిసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇక్కడ పాస్టర్లు, క్రైస్తవుల ఆశీర్వాదం తీసుకోవడం సెంటిమెంట్‌గా వస్తుందన్నారు. నియోజకవర్గంలో క్రైస్తవుల శ్మశాన వాటిక సమస్య ఉందని దాన్ని త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం లక్డీకాపూల్ లూథరన్ చర్చిలో ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లోని షారోన్ చర్చిలో పాస్టర్ ప్రభుదాస్ క్రీస్తు సందేశం ఇచ్చారు.

నారాయణగుడలో..

హిమాయత్‌నగర్: నారాయణగుడలోని బాప్టిస్ట్ చర్చి ఏసు క్రీస్తు ప్రభువు మరణం గెలిచి లేచిన దినం ఈస్టర్ పండగ రోజు సందర్భంగా సూర్యోదయ ఆరాధన ప్రార్థన కార్యక్రమాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తన క్రైస్తవులు భక్తి శ్రద్దలతో ప్రార్థనలలో పాల్గొన్నారు. సంఘ ప్రథమ కాపరి డాక్టర్ జి.శామ్యూల్, కుమారుడు డేవిడ్ ప్రశాంత్ అద్భుతంగా దేవునికి మహిమ కలుగునట్లు వాక్య పరిచర్య జరిపించారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

రహమత్‌నగర్: ఈస్టర్ సందర్భంగా రహమత్‌నగర్ డివిజన్‌లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎస్పీఆర్‌హిల్స్‌లోని పేనూయేలు గాస్పెల్ మందిరం, రహమత్‌నగర్ బాప్టిస్ట్ చర్చి, హోలీ ఫ్యామిలీ చర్చి, బోరబండ డివిజన్‌లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హోలి ఫ్యామిలీ చర్చిలో ఫాదర్ వెలగంటి జోసఫ్ నేతృత్వంలో శనివారం రాత్రి నుంచి ఆరాధనలు నిర్వహించారు. జాకబ్, జోసఫ్, యేసప్ప తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో..

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని ఎవాంజెలికల్ ఫెలోషిప్, లక్డీకాపూల్‌లోని లూథరన్ చర్చి, మారుతీనగర్‌లోని దమస్కర్ చర్చిలో ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎవాంజెలికల్ ఫెలోషిప్ చర్చిలో బ్రదర్ అబ్రహం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వాక్యోపదేశం చేశారు.


హోలి ఫ్యామిలి చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ఫాదర్ జోసఫ్


ఎవాంజెలికల్ ఫెలోషిప్ చర్చిలో వాక్యోపదేశం చేస్తున్న బ్రదర్ అబ్రహం

క్రైం కార్నర్..

కుమార్తెను హింసిస్తున్నారంటూ తండ్రి ఫిర్యాదు

వెంగళరావునగర్: నగలు, నగదు తీసుకోవడమే కాకుండా భార్యతో కలిసి బంధువులు తనను, మైనర్ కుమార్తెను వేధిస్తున్నారంటూ ఓ తండ్రి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల సమాచారం మేరకు... ఫతేదర్వాజాకు చెందిన ఖదీర్ మహ్మద్ వ్యాపారం చేస్తుంటాడు. 2019 జూన్ 28న స్థానికంగా ఉన్న ఓ మహిళతో మహిళతో వివాహం జరిగింది. వారికి నాలుగేళ్ల పాప కూడా ఉంది. తన భార్య తనకు తెలియకుండా రూ. 3 లక్షలు, బంగారం ఆమె తండ్రి (డ్రైవర్)కు ఇచ్చింది. ఎన్నోసార్లు వాటిని తిరిగి ఇవ్వాలని అడిగినా ఇవ్వలేదు. తన భార్యను తప్పుదారి పట్టించడమే కాకుండా గొడవలకు దిగుతున్నాడు. బంధువులు సైతం భార్యకు తనకు మధ్య మనస్పర్థలు సృష్టించి కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. తన కుమార్తెను తీసుకెళ్లి బంధువులు ఇష్టానుసారంగా హింసిస్తున్నారు. తన షాపునకు వచ్చి భయభ్రాంతులకు గురిచేసి చంపేస్తామని బెదిరిస్తున్నారు. ఆమె తల్లిదండ్రులు దుర్వ్యసనాలకు బానిసై భార్యను కూడా తప్పుదారి పట్టిస్తున్నారు. తనకు విడాకులు ఇప్పించి అమెరికాలో ఉంటున్న వ్యక్తితో వివాహం జరిపించాలని ఆమె తల్లిదండ్రులు వేధిస్తున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే డీసీపీకి కూడా ఫిర్యాదు చేసినట్టు బాధితుడు పేర్కొన్నాడు. కోర్టు ఆదేశాల మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో రెండు ద్విచక్ర వాహనాల చోరీ

వెంగళరావునగర్: మధురానగర్ పీఎస్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్‌లో నివాసం ఉండే ఉదయ్ పాలపాకెట్లు వేస్తుంటాడు. ఈ నెల 30వ తేదీ ఉదయం యధావిధిగా తన ద్విచక్ర వాహనం మీద పాలపాకెట్లు తీసుకుని వెంగళరావునగర్‌కు వెళ్లి సాయి రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ వద్ద పార్క్ చేశాడు. అనంతరం అపార్ట్‌మెంట్‌లో పాకెట్లు పంపిణీ చేసి వచ్చి చూసేసరికి తన వాహనం కనిపించలేదు. అలాగే ఎం.దుర్గాప్రసాద్ అనే వ్యక్తి మధురానగర్‌లో ఉంటాడు. మార్చి 29న రాత్రి తన ఇంటిముందు ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి ఇంట్లోకి వెళ్లిడు. 30వ తేదీ ఉదయం చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్వీట్స్ షాపు తనదంటూ మహిళపై దాడి

మోతీనగర్‌కు చెందిన బాసుమతి ఘోష్‌కు యూసుఫ్‌గూడలో షాపు ఉంది. మార్చి 6న ఆమె తన సిబ్బందితో కలిసి వెళ్లి షాపు ఓపెన్ చేసింది. 10.30 గంటల సమయంలో దినేష్ కచ్వా అనే వ్యక్తి తన అనుచరులతో వచ్చి ఆ షాపు తనదంటూ హల్‌చల్ సృష్టించి మహిళలను నెట్టేసి షట్టర్‌కు తాళం వేశాడు. మరోసారి షాపు వద్దకు వస్తే తనను, తన కుమార్తెను చంపేస్తానని బెదిరింపులకు గురి చేసి వెళ్లిపోయాడు. ఈ నెల 28వ తేదీ ఆమె మరోసారి షాపునకు వచ్చి దానిని ఓపెన్ చేయగా మళ్లీ దినేష్ కచ్వా తన అనుచరులతో వచ్చి బెదిరించాడు. దాంతో ఆందోళనకు గురైన బాధితురాలు తనకు దినేష్ కచ్వా వల్ల ప్రాణహాని ఉందంటూ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రోడ్డుపై న్యూసెన్స్ చేసిన విలేకరులపై కేసు నమోదు

నడిరోడ్డుపై కారు ఆపి న్యూసెన్స్ చేసిన విలేకరులపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. వివరాలివీ... ఈ నెల 30వ తేదీనాడు మధురానగర్ ఎస్ఐలు సాయినాథ్ రెడ్డి, బాల్‌రాజ్‌లు పంజగుట్టలోని ఏసీపీ కార్యాలయానికి బయలుదేరారు. మార్గమధ్యలో గురుద్వార్ వద్ద మహ్మద్ గారాజానీ, మహ్మద్ ఖాజా అనే ఇరువురు వ్యక్తులు కారు రోడ్డుమీద పెట్టి ఆర్‌టీసీ డ్రైవర్, కండక్టర్లపై వాగ్వాదానికి దిగుతున్నారు. దాంతో ఎస్ఐలు అక్కడకు వెళ్లి విచారించగా తాము విలేకరులమంటూ కేకలు వేశారు. చాలా సేపు వాహనాన్ని తొలగించకుండా న్యూసెన్స్ చేయడం వల్ల ట్రాఫిక్ జామ్ అయింది. దాంతో మధురానగర్ పీఏస్‌లో ఫిర్యాదు చేసి కేసు నమోదు చేశారు.



మయామి ఓపెన్ చాంపియన్ కోలిన్స్

ఈ ఏడాది ఆటకు వీడ్కోలు పలకనున్న అమెరికా టెన్నిస్ ప్లేయర్ డానియెల్ కోలిన్స్ అద్భుతం చేసింది. మయామి ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 టోర్నీలో చాంపియన్‌గా నిలిచింది. ఫ్లోరిడాలో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో 30 ఏళ్ల కోలిన్స్ 7-5, 6-3తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ రిబాకినా (కజకిస్తాన్)పై గెలిచింది. కోలిన్స్‌కు 11 లక్షల డాలర్ల (రూ. 9 కోట్ల 16 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. మార్టినా నవ్రతిలోవా, క్రిస్ ఎవర్ట్, వీనస్ విలియమ్స్, సెరెనా విలియమ్స్, స్లోన్ స్టీఫెన్స్ తర్వాత మయామి ఓపెన్ టైటిల్ నెగ్గిన ఆరో అమెరికన్ ప్లేయర్‌గా కోలిన్స్ గుర్తింపు పొందింది.

బాబర్ ఆజమ్‌కు మళ్లీ పాక్ జట్టు పగ్గాలు



మరో రెండు నెలల్లో టి20 ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో... పాకిస్తాన్ క్రికెట్ జట్టు వన్డే, టి20 జట్లకు కెప్టెన్‌గా మళ్లీ బాబర్ ఆజమ్‌ను నియమించారు. గత ఏడాది వన్డే ప్రపంచకప్‌లో పాక్ జట్టు విఫలమయ్యాక బాబర్ కెప్టెన్సీ కోల్పోయాడు. టి20 జట్టుకు షాహీన్ అఫ్రిదిని, టెస్టు జట్టుకు షాన్ మసూద్‌ను కెప్టెన్‌లుగా నియమించారు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టి20 సిరీస్‌ను పాక్ జట్టు 1-4తో చేజార్చుకుంది. దాంతో సెలెక్టర్లు కెప్టెన్సీ విషయంలో బాబర్ వైపు మొగ్గారు.



రిత్విక్-నిక్కీ జోడీకి టైటిల్

సాక్షి, హైదరాబాద్: సాన్ లూయిస్ ఓపెన్ అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) చాలెంజర్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. మెక్సికోలో జరిగిన ఈ టోర్నీలో రెండో సీడ్ రిత్విక్-నిక్కీ కలియంద పునాచా (భారత్) ద్వయం చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్లో రిత్విక్-నిక్కీ జంట 6-3, 6-2తో ఆంటోనీ బెలీర్-మార్క్ హ్యుస్లర్ (స్విట్జర్లాండ్) జోడీపై గెలిచి 4,665 డాలర్ల (రూ. 3 లక్షల 88 వేలు)ప్రైజ్‌మనీతోపాటు 75 ర్యాంకింగ్ పాయింట్లను సొంతం చేసుకుంది. రిత్విక్ కెరీర్‌లో ఇది రెండో ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్. గత ఏడాది అక్టోబర్‌లో ఇటలీలో జరిగిన ఒల్బ్లా ఓపెన్‌లో అర్జున్ ఖడేతో కలిసి రిత్విక్ తొలిసారి చాలెంజర్ డబుల్స్ టైటిల్‌ను గెలిచాడు.

శ్రీలంక 531 ఆలౌట్




కామిందు మెండిస్

చట్టోగ్రామ్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 159 ఓవర్లలో 531 పరుగులు చేసి ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 314/4తో రెండో రోజు ఆట కొనసాగించిన శ్రీలంక మరో 217 పరుగులు సాధించి మిగతా ఆరు వికెట్లు కోల్పోయింది. రెండో రోజు దినేశ్ చండీమల్ (59; 5 ఫోర్లు, 2 సిక్సర్లు), ధనంజయ డిసిల్వా (70; 6 ఫోర్లు, 2 సిక్సర్లు), కామిందు మెండిస్ (92 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధ సెంచరీలు చేశారు. ఓవరాల్‌గా లంక ఇన్నింగ్స్‌లో ఆరుగురు బ్యాటర్లు అర్ధ సెంచరీలు చేశారు. ఈ క్రమంలో ఇన్నింగ్స్‌లో ఒక్క సెంచరీ నమోదు కాకుండా అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా శ్రీలంక రికార్డు నెలకొల్పింది. గతంలో ఈ రికార్డు భారత జట్టు (1976లో కాన్పూర్‌లో న్యూజిలాండ్‌పై 524/9 డిక్లేర్డ్) పేరిట ఉంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ కోల్పోయి 55 పరుగులు చేసింది.

మెరుపుల్లేని సన్‌రైజర్స్!

- ఏడు వికెట్లతో హైదరాబాద్ ఓటమి
- మోహిత్ శర్మ అద్భుత బౌలింగ్
- రాణించిన మిల్లర్, సాయి సుదర్శన్
- గుజరాత్ టైటాన్స్‌కు రెండో గెలుపు



అభిషేక్ శర్మ

అహ్మదాబాద్: గత బుధవారం ఉప్పల్ స్టేడియంలో సిక్సర్ల మోతతో... బౌండరీల జాతరతో అదరగొట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు ఈసారి అలాంటి ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయారు. ఒక్కరు కూడా భారీ ఇన్నింగ్స్ ఆడకపోవడంతో ఐపీఎల్ 17వ సీజన్‌లో సన్‌రైజర్స్‌కు రెండో ఓటమి ఎదురైంది. గత ఏడాది రన్నరప్ గుజరాత్ టైటాన్స్ జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అలరించి సన్‌రైజర్స్‌పై ఏడు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 162 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మోహిత్ శర్మ 25 పరుగులకు 3 వికెట్లు పడగొట్టి సన్‌రైజర్స్‌ను కట్టడి చేశాడు. అనంతరం గుజరాత్ 19.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 168 పరుగులు చేసి ఈ టోర్నీలో రెండో విజయాన్ని అందుకుంది.

ముంబై ఇండియన్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 277 పరుగులు సాధించిన సన్‌రైజర్స్ ఈసారి మెరిపించలేకపోయింది. ముంబైపై చెలరేగిపోయిన ట్రావిస్ హెడ్ (14 బంతుల్లో 19; 3 ఫోర్లు), అభిషేక్ శర్మ (20 బంతుల్లో 29; 2 ఫోర్లు, 2 సిక్సర్లు), క్లాసెన్ (13 బంతుల్లో 24; 1 ఫోర్, 2 సిక్సర్లు) ఈసారీ దూకుడుగా ఆడినా క్రీజులో ఎక్కువసేపు నిలువలేకపోవడం సన్‌రైజర్స్‌ను దెబ్బ తీసింది. మోహిత్ శర్మ బౌలింగ్‌లో గిల్‌కు క్యాచ్ ఇచ్చి అభిషేక్ అవుటవ్వడంతో... 10 ఓవర్లు ముగిసేసరికి సన్‌రైజర్స్ 3 వికెట్లు కోల్పోయి 74 ఇబ్బందుల్లో పడింది. చివర్లో అబ్దుల్ సమద్ (14 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరిశాడు. మోహిత్ శర్మ వేసిన చివరి ఓవర్లో హైదరాబాద్ 3 పరుగులు మాత్రమే చేసి 3 వికెట్లు కోల్పోయింది. 163 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్ సాఫీగా సాగింది. ఓపెనర్లు సాహా (13 బంతుల్లో 25; 1 ఫోర్, 2 సిక్సర్లు), శుబ్‌మన్ గిల్ (28 బంతుల్లో 36; 2 ఫోర్లు, 1 సిక్స్) 10 ఓవర్లలోపే పెవిలియన్ చేరాయి. అయితే సాయి సుదర్శన్ (36 బంతుల్లో 45; 4 ఫోర్లు, 1 సిక్స్), డేవిడ్ మిల్లర్ (27 బంతుల్లో 44 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) దూకుడు కొనసాగిస్తూ మూడో వికెట్‌కు 64 పరుగులు జోడించారు. సాయి సుదర్శన్ అవుటైనా... విజయ్ శంకర్ (11 బంతుల్లో 14 నాటౌట్; 2 ఫోర్లు), మిల్లర్ సంయమనంతో ఆడి ఐదు బంతులు మిగిలి ఉండగానే టైటాన్స్‌ను విజయ తీరాలకు చేర్చారు.



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మోహిత్

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (బి) నూర్ 19; మయాంక్ (సి) నల్కండే (బి) అజ్మతుల్లా 16; అభిషేక్ శర్మ (సి) గిల్ (బి) మోహిత్ 29; మార్క్‌రమ్ (సి) రషీద్ (బి) ఉమేశ్ 17; క్లాసెన్ (బి) రషీద్ 24; షహబాజ్ (సి) తెవాటియా (బి) మోహిత్ 22; సమద్ (రనౌట్) 29; సుందర్ (సి) రషీద్ (బి) మోహిత్ 0; కమిన్స్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 162. వికెట్ల పతనం:** 1-34, 2-58, 3-74, 4-108, 5-114, 6-159, 7-159, 8-162. **బౌలింగ్:** అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 3-0-24-1, ఉమేశ్ యాదవ్ 3-0-28-1, రషీద్ ఖాన్ 4-0-33-1, నూర్ అహ్మద్ 4-0-32-1, మోహిత్ శర్మ 4-0-25-3, దర్శన్ నల్కండే 2-0-18-0.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) కమిన్స్ (బి) షహబాజ్ 25; గిల్ (సి) సమద్ (బి) మార్కండే 36; సాయి సుదర్శన్ (సి) అభిషేక్ శర్మ (బి) కమిన్స్ 45; మిల్లర్ (నాటౌట్) 44; విజయ్ శంకర్ (నాటౌట్) 14; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (19.1 ఓవర్లలో 3 వికెట్లకు) 168. వికెట్ల పతనం:** 1-36, 2-74, 3-138. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-27-0, షహబాజ్ అహ్మద్ 2-0-20-1, జైదేవ్ ఉనాద్కట్ 3.1-0-33-0, వాషింగ్టన్ సుందర్ 3-0-27-0, మయాంక్ మార్కండే 3-0-33-1, కమిన్స్ 4-0-28-1.

ఐపీఎల్‌లో నేడు

ముంబై × రాజస్తాన్
వేదిక: ముంబై
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
కోల్‌కతా	2	2	0	4	1.047
చెన్నై	3	2	1	4	0.976
రాజస్తాన్	2	2	0	4	0.800
గుజరాత్	3	2	1	4	-0.738
హైదరాబాద్	3	1	2	2	0.204
లక్నో	2	1	1	2	0.025
ఢిల్లీ	3	1	2	2	-0.016
పంజాబ్	3	1	2	2	-0.337
బెంగళూరు	3	1	2	2	-0.711
ముంబై	2	0	2	0	-0.925

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఢిల్లీ గెలుపు బోణీ...

- మెరిసిన పంత్, వార్నర్, పృథ్వీ షా
- చెన్నై జట్టుకు తొలి పరాజయం



వార్నర్
పంత్
ఖలీల్, మార్ష్, ముకేశ్

సాక్షి, విశాఖపట్నం: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఐపీఎల్ 17వ సీజన్‌లో గెలుపు బోణీ కొట్టింది. డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో ఆదివారం ఇక్కడి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 20 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగుల భారీ స్కోరు చేసింది. 192 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసి ఓడిపోయింది.

ఓపెనర్ల దూకుడు...

ఢిల్లీ జట్టుకు ఓపెనర్లు పృథ్వీ షా (27 బంతుల్లో 43; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), డేవిడ్ వార్నర్ (35 బంతుల్లో 52; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) శుభారంభం అందించారు. వీరిద్దరు చెన్నై బౌలర్ల భరతం పట్టి తొలి వికెట్‌కు 9.3 ఓవర్లలో 93 పరుగులు జోడించారు. ముస్తఫిజుర్ బౌలింగ్‌లో వార్నర్ రివర్స్ స్కూప్ షాట్ ఆడగా... పతిరణ డైవింగ్ చేస్తూ ఒంటిచేత్తో కళ్లు చెదిరేలా క్యాచ్ అందుకోవడంతో వార్నర్ ఇన్నింగ్స్ ముగిసింది. పది పరుగుల తర్వాత పృథ్వీ షా కూడా నిష్క్రమించాడు. ఈ దశలో మార్ష్ (12 బంతుల్లో 18; 2 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి కెప్టెన్ రిషభ్ పంత్ (32 బంతుల్లో 51; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. అయితే ఇన్నింగ్స్ 15వ ఓవర్లో పతిరణ మూడు బంతుల వ్యవధిలో అద్భుత యార్కర్లతో మార్ష్, స్టబ్స్ (0)ను పెవిలియన్‌కు పంపించాడు. మరో ఎండ్‌లో పంత్ తన దూకుడు కొనసాగించి 31 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకొని చెన్నైకు భారీ లక్ష్యాన్ని నిర్దేశించడంలో కీలకపాత్ర పోషించాడు.

దెబ్బ కొట్టిన ఖలీల్, ముకేశ్

క్లిష్టమైన లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన చెన్నై జట్టును 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఖలీల్ అహ్మద్ దెబ్బ కొట్టాడు. ఓపెనర్లు రుతురాజ్, రచిన్‌లను ఖలీల్ వెంటవెంటనే అవుట్ చేశాడు. దాంతో చెన్నై 7 పరుగులకే ఓపెనర్లను చేజార్చుకుంది. ఈ దశలో రహానే (30 బంతుల్లో 45; 5 ఫోర్లు, 2 సిక్సర్లు), మిచెల్ (26 బంతుల్లో 34; 1 ఫోర్, 2 సిక్సర్లు) మూడో వికెట్‌కు 68 పరుగులు జోడించి ఆదుకున్నారు. అయితే అక్షర్ బౌలింగ్‌లో మిచెల్ వెనుదిరగడంతో చెన్నై మళ్లీ ఇబ్బందుల్లో పడింది. ఇన్నింగ్స్ 14వ ఓవర్లో ముకేశ్ రెండు వరుస బంతుల్లో రహానే, రిజ్వీ (0)లను... ఆ తర్వాత 17వ ఓవర్లో దూబే (17 బంతుల్లో 18; 1 ఫోర్)ను అవుట్ చేయడంతో చెన్నై విజయ సమీకరణం క్లిష్టంగా మారింది. చివర్లో జడేజా (17 బంతుల్లో 21 నాటౌట్; 2 ఫోర్లు), ధోని (16 బంతుల్లో 37 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) దూకుడుగా ఆడినా ఫలితం లేకపోయింది.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: పృథ్వీ షా (సి) ధోని (బి) జడేజా 43; వార్నర్ (సి) పతిరణ (బి) ముస్తఫిజుర్ 52; పంత్ (సి) రుతురాజ్ (బి) పతిరణ 51; మిచెల్ మార్ష్ (బి) పతిరణ 18; స్టబ్స్ (బి) పతిరణ 0; అక్షర్ పటేల్ (నాటౌట్) 7; అభిషేక్ పోరెల్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 191. వికెట్ల పతనం:** 1-93, 2-103, 3-134, 4-134, 5-178. **బౌలింగ్:** దీపక్ చహర్ 4-0-42-0, తుషార్ దేశ్‌పాండే 4-0-24-0, ముస్తఫిజుర్ 4-0-47-1, జడేజా 4-0-43-1, పతిరణ 4-0-31-3.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) పంత్ (బి) ఖలీల్ 1; రచిన్ రవీంద్ర (సి) స్టబ్స్ (బి) ఖలీల్ 2; రహానే (సి) వార్నర్ (బి) ముకేశ్ 45; మిచెల్ (సి అండ్ బి) అక్షర్ పటేల్ 34; దూబే (సి) స్టబ్స్ (బి) ముకేశ్ 18; సమీర్ రిజ్వీ (సి) ఖలీల్ (బి) ముకేశ్ 0; జడేజా (నాటౌట్) 21; ధోని (నాటౌట్) 37; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 171; వికెట్ల పతనం:** 1-3, 2-7, 3-75, 4-102, 5-102, 6-120. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-1-21-2, ఇషాంత్ 3-0-23-0, నోర్జే 4-0-43-0, అక్షర్ పటేల్ 3-0-20-1, రసిఖ్ సలామ్ 2-0-25-0, మార్ష్ 1-0-14-0, ముకేశ్ 3-0-21-3.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ లాసెట్/పీజీ ఎల్‌సెట్-2024

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి.. ఏపీ లా కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ లాసెట్)/పోస్ట్ గ్రాడ్యుయేట్ లాసెట్(ఏపీ పీజీఎల్‌సెట్)-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం/ఎంఎల్ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ పరీక్షను గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నిర్వహిస్తుంది.

» **కోర్సులు:** మూడేళ్ల/ఐదేళ్ల ఎల్ఎల్‌బీ(ఏపీ లాసెట్), ఎల్ఎల్ఎం(ఏపీ పీజీ లాసెట్).
» **అర్హత:** కోర్సును అనుసరించి 45 శాతం మార్కులతో ఇంటర్మీడియట్, డిగ్రీ, ఎల్ఎల్‌బీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **పరీక్ష విధానం:** ప్రశ్నాపత్రం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఎల్ఎల్‌బీ కోర్సులకు పరీక్ష ఇంగ్లిష్, తెలుగు రెండు మాధ్యమాల్లో ఉంటుంది. ఎల్ఎల్ఎం పరీక్ష ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆలస్య రుసుం లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.04.2024.
» **హాల్‌టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభం:** 03.06.2024
» **ఏపీ లాసెట్/ఏపీ పీజీ లాసెట్ ప్రవేశ పరీక్షతేది:** 09.06.2024.
» **వెబ్‌సైట్:**https://cets.apsche.ap.gov.in

ఏపీ పీజీఈసెట్-2024

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి(ఏపీఎస్‌సీహెచ్ఈ).. ఆంధ్రప్రదేశ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(పీజీఈసెట్)-2024 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫుల్‌టైం ఎంఈ,ఎంటెక్, ఎంఫార్మసీ, ఫార్మ్.డి(పీబీ) కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.ఈ పరీక్షను తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ నిర్వహించనుంది.

» **కోర్సులు:** ఎంటెక్, ఎంఫార్మసీ, ఫార్మ్.డి(పీబీ)
» **విభాగాలు:** కెమికల్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చరల్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, బయోఇన్ఫర్మేటిక్స్, బయో టెక్నాలజీ, బయో మెడికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, జియో-ఇన్ఫర్మేటిక్స్ తదితరాలు.
» **అర్హత:** కోర్సును అనుసరించి బీఈ, బీటెక్, బీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) విధానంలో జరుగుతుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తులకు చివరితేది:** 20.04.2024.
» **హాల్‌టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభం:**22.05.2024
» **ప్రవేశ పరీక్షతేదీలు:** 29.05.2024 నుంచి 31.05.2024 వరకు
» **వెబ్‌సైట్:**https://cets.apsche.ap.gov.in

ఐఐఎఫ్‌టీ కాకినాడలో ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ), కాకినాడ క్యాంపస్.. 2024-29 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(ఐపీఎం) (బీబీఏ-బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఎంబీఏ-ఇంటర్నేషనల్ బిజినెస్) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** 60 శాతం మార్కులతో ఆర్ట్స్/కామర్స్/సైన్స్ స్ట్రీమ్‌లో 10+2/పన్నెండో తరగతి(ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులకు 55శాతం) 2022, 2023, 2024లో ఉత్తీర్ణులై ఉండాలి. మ్యాథమేటిక్స్ లేదా బిజినెస్ మ్యాథమేటిక్స్ ఒక సబ్జెక్ట్ చదివి ఉండాలి. **వయసు:** 01.07.2004 తర్వాత జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:**ప్రవేశ పరీక్ష, విద్యార్హతలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.04.2024.
» **వెబ్‌సైట్:** https://applyadmission.net/iift2024ipm

బీసీసీఎల్‌లో 37 మెడికల్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

జార్ఖండ్‌లోని కోల్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్(బీసీసీఎల్).. మెడికల్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 37
» **విభాగాలు:** సర్జన్,జనరల్ ఫిజిషియన్, గైనకాలజిస్ట్ అండ్ అబ్‌స్టెట్రీషియన్, ఆర్థోపెడిషియన్, పీడియాట్రిషియన్, సైకియాట్రిస్ట్, పాథాలజిస్ట్, డెర్మటాలజిస్ట్,పల్మాలజిస్ట్/చెస్ట్ స్పెషలిస్ట్,ఆప్తాల్మాలజిస్ట్, ఎమర్జెన్సీ మెడిసిన్, రేడియాలజిస్ట్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్ పోస్టులకు 42 ఏళ్లు, మెడికల్ స్పెషలిస్ట్/సీనియర్ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్ పోస్టుకు రూ.70,000 నుంచి రూ.2,00,000, మెడికల్ స్పెషలిస్ట్/సీనియర్ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు రూ.60,000 నుంచి రూ.1,80,000.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిప్యూటీ జీఎం/హెచ్‌వోడీ(ఈఈ), భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్, ఎగ్జిక్యూటివ్ ఎస్టాబ్లిష్‌మెంట్ దగ్గర, కోయలా భవన్, కోయలా నగర్, ధన్‌బాద్, జార్ఖండ్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 11.04.2024.
» **వెబ్‌సైట్:** www.bcclweb.in

కోల్ ఇండియా లిమిటెడ్‌లో 32 మెడికల్ ఆఫీసర్ పోస్టులు

కోల్ ఇండియా లిమిటెడ్(సీఐఎల్) వివిధ విభాగాల్లో మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 34
» **పోస్టుల వివరాలు:** సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్-26, సీనియర్ మెడికల్ ఆఫీసర్-08.
» **విభాగాలు:** సర్జన్, జనరల్ ఫిజీషియన్/మెడిసిన్, జీ-వో అనెస్థీషిస్ట్, పీడియాట్రిషియన్, సైకియాట్రిస్ట్, పాథాలజిస్ట్, డెర్మటాలజిస్ట్, పల్మాలజిస్ట్, చెస్ట్ స్పెషలిస్ట్, ఆప్తాల్మాలజిస్ట్, ఈఎన్‌టీ, రేడియాలజిస్ట్, జీడీఎంవో, డెంటిస్ట్.
» **అర్హత:** జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్ అండ్ పల్మనరీ మెడిసిన్, ఎంబీబీఎస్, పీజీ, బీడీఎస్ ఉత్తీర్ణులవ్వాలి.**వయసు:**పోస్టును అనుసరించి 31.01.2024 నాటికి 35 నుంచి 42 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** సీనియర్ మెడికల్ ఆఫీసర్ స్పెషలిస్ట్ పోస్టులకు నెలకు రూ.70,000 నుంచి రూ.2,00,000, మెడికల్ స్పెషలిస్ట్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు రూ.60,000 నుంచి రూ.1,80,000.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఆఫీస్ ఆఫ్ డిప్యూటీ జనరల్ మేనేజర్, రిక్రూట్‌మెంట్ డిపార్ట్‌మెంట్, ఎన్‌సీఎల్‌హెచ్‌క్యూ, సింగ్రౌలీ(మధ్యప్రదేశ్) చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 11.04.2024.
» **వెబ్‌సైట్:** https://www.nclcil.in

ఐఐఎస్ఈఆర్, తిరుపతిలో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్).. ఆగస్టు 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమేటిక్స్, ఎర్త్ అండ్ క్లైమేట్ సైన్సెస్ ఇతర అనుబంధ సబ్జెక్టులు.
» **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణతతో పాటు జేజీఈఈబీఐఎల్ఎస్ 2023 లేదా డీబీటీ-జేఆర్ఎఫ్-ఏ/ఐసీఎంఆర్-జేఆర్ఎఫ్/డీబీటీ-బీఐఎన్‌సీ/యూజీసీ-సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/డీఎస్‌టీ-ఇన్‌స్పైర్-జేఆర్ఎఫ్ లేదా ఇన్‌స్పైర్ పీహెచ్‌డీ/ఎన్‌బీహెచ్ఎం పీహెచ్‌డీ/గేట్/జెస్ట్/నెట్‌లో అర్హత సాధించి ఉండాలి.
» **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.04.2024.
» **వెబ్‌సైట్:** www.iisertirupati.ac.in/admissions

ఇండియన్ బ్యాంక్‌లో.. ఎస్ఓ కొలువు

» మొత్తం 146 స్పెషలిస్ట్ ఆఫీసర్ కొలువులు
» డిగ్రీ, ఎంబీఏ, సీఏ అర్హతతో దరఖాస్తుకు అవకాశం
» రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక



బ్యాంకు కొలువుల అభ్యర్థులకు శుభవార్త! తాజాగా ప్రభుత్వ రంగ సంస్థ.. ఇండియన్ బ్యాంకు.. స్పెషలిస్ట్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. నిర్దేశిత ప్రొఫెషనల్ డిగ్రీలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. నియామకాలు ఖరారైతే.. స్కేల్-1, 2, 3, 4 వేతనం లభిస్తుంది. ఈ నేపథ్యంలో.. ఇండియన్ బ్యాంకు స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు, ఎంపిక విధానం, రాత పరీక్ష, సిలబస్ అంశాలు తదితర వివరాలు..

ప్రభుత్వ రంగ బ్యాంకులు.. ఇటీవల కాలంలో తాజా టెక్నాలజీ ఆధారంగా చేసుకుని సేవలందిస్తున్నాయి. సంప్రదాయ విభాగాలుగా భావించే క్రెడిట్ మేనేజర్ మొదలు ఐటీ, క్లౌడ్ టెక్నాలజీల్లోనూ ఆఫీసర్లు/మేనేజర్ల నియామకం చేపడుతున్నాయి. ఆయా అర్హతలు ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

మొత్తం 146 పోస్టులు

ఇండియన్ బ్యాంకు.. తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా మొత్తం 146 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీ చేపట్టనుంది.

అర్హతలు వేర్వేరుగా

- వేర్వేరు విభాగాల్లో పోస్టులను పేర్కొన్న క్రమంలో.. అర్హతలను కూడా వేర్వేరుగా నిర్దేశించారు. అంతేకాకుండా పని అనుభవం కూడా ఉండాలని పేర్కొన్నారు. ఆయా పోస్టులను అనుసరించి బ్యాచిలర్ డిగ్రీ, బీటెక్/సీఏ/ఐసీడబ్ల్యూఏ/సీఎంఏ/ ఎంబీఏ ఉత్తీర్ణత ఉండాలి. వీటితోపాటు ఆయా పోస్టులను అనుసరించి మూడు నుంచి పదేళ్ల అనుభవం ఉండాలి. అన్ని పోస్టులకు ఎంబీఏ/పీజీడీఎం ఉంటే ప్రాధాన్యం లభిస్తుంది.
- వయసు: పోస్టులను అనుసరించి వయసు 21-45 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఇస్తారు.

స్కేల్-1, 2, 3, 4 వేతనాలు

అసిస్టెంట్ మేనేజర్ పోస్టులను స్కేల్-1 (వేతన శ్రేణి రూ.36,000-రూ.63,840), మేనేజర్ పోస్టులను స్కేల్-2(వేతన శ్రేణి రూ.48,170-రూ.69,810), సీనియర్ మేనేజర్ పోస్టులను స్కేల్-3 (వేతన శ్రేణి రూ.63,840-రూ.78,230), చీఫ్ మేనేజర్ పోస్టులను స్కేల్-4(రూ.76,010-రూ.89,890)గా పేర్కొన్నారు.

రెండంచెల ఎంపిక ప్రక్రియ

స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఇండియన్ బ్యాంక్ రెండంచెల ఎంపిక విధానాన్ని అనుసరించనుంది. ఇందులో రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూలు ఉంటాయి. తొలిదశ రాత పరీక్షను మూడు విభాగాల్లో 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రొఫెషనల్ నాలెడ్జ్ /సంబంధిత సబ్జెక్ట్ (60 ప్రశ్నలు-60 మార్కులు); ఇంగ్లిష్ లాంగ్వేజ్ (20 ప్రశ్నలు - 20 మార్కులు); బ్యాంకింగ్ ఇండస్ట్రీ ప్రాధాన్యంగా జనరల్ అవేర్‌నెస్ (20 ప్రశ్నలు - 20 మార్కులు) విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక గంట 45 నిమిషాల వ్యవధిలో పరీక్ష ఉంటుంది.

ఇంటర్వ్యూకు 100 మార్కులు

రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. అన్ రిజర్వ్‌డ్ కేటగిరీలో ఒక్కో పోస్ట్‌కు ముగ్గురిని చొప్పున (1:3 నిష్పత్తిలో), రిజర్వ్‌డ్ కేటగిరీలో ఒక్కో పోస్ట్‌కు అయిదుగురిని చొప్పున (1:5 నిష్పత్తిలో) ఎంపిక చేసి.. పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. మొత్తం 100 మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుంది.

తుది జాబితా.. వెయిటేజీ విధానం

నియామకాలను ఖరారు చేసే క్రమంలో వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు. రాత పరీక్షలో మార్కులకు 80 శాతం వెయిటేజీ, ఇంటర్వ్యూ మార్కులకు 20 శాతం వెయిటేజీ కల్పిస్తారు. దానికి అనుగుణంగా తుది జాబితా రూపొందించి.. అందులో చోటు సాధించిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు.

ప్రొబేషన్ నిబంధన

నియామకాలు ఖరారు చేసుకున్న వారికి ప్రొబేషనరీ పిరియడ్ ఉంటుంది. స్కేల్ 1 హోదాలో నియమితులైన వారు రెండేళ్లు, స్కేల్-2, 3, 4 హోదాల్లో నియమితులైన వారికి ఏడాది ప్రొబేషన్ ఉంటుంది. అదే విధంగా రెండేళ్ల పాటు బ్యాంకులో విధులు నిర్వర్తించేలా సర్వీస్ బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది.

సీజీఎం స్థాయికి

ఆయా పోస్టులలో నియమితులైన వారు.. భవిష్యత్తులో జీఎం, సీజీఎం స్థాయికి పదోన్నతులు పొందే అవకాశం ఉంది. ముఖ్యంగా ఐటీ, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి స్పెషలైజ్డ్ విభాగాల్లో సీనియర్ మేనేజర్ హోదాలో నియమితులైన వారు జీఎం స్థాయికి, చీఫ్ మేనేజర్స్ హోదాలో చేరిన వారు సీజీఎం స్థాయికి చేరుకోవచ్చు. అసిస్టెంట్ మేనేజర్స్‌గా నియామకం పొందిన వారు ఏజీఎం స్థాయి వరకు చేరుకునే అవకాశం ఉంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, ఏప్రిల్ 1
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.indian-bank.in/career

ఎంపిక ప్రక్రియలో సక్సెస్ ఇలా

- ప్రొఫెషనల్ నాలెడ్జ్ విభాగం కోసం ఎంచుకున్న స్పెషలైజేషన్‌కు సంబంధించి.. బ్యాచిలర్, పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. అంతేకాకుండా ఆయా విభాగాలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలు, ఇతర పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో మార్కుల కోసం బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- బ్యాంకింగ్ రంగం ప్రాధాన్యంగా ఉండే జనరల్ అవేర్‌నెస్ విభాగంలో రాణించడానికి కరెంట్ అఫైర్స్‌తోపాటు బ్యాంకింగ్ రంగంలో ఇటీవల కాలంలో పరిణామాలు, బ్యాంకింగ్ విధానం, టెర్మినాలజీ, రెపో రేటు, రిస్క్ రికవరీ విధానాలు తదితర అంశాలపై దృష్టి సారించాలి.
- పర్సనల్ ఇంటర్వ్యూలో ప్రధానంగా అభ్యర్థుల అకడమిక్, వర్క్ ప్రొఫైల్‌పై ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి ఇప్పటి వరకు చేస్తున్న పనిలో సాధించిన విజయాలు, అవి సంస్థల అభ్యున్నతికి తోడ్పడిన తీరు, తమ నైపుణ్యాలను బ్యాంకింగ్ రంగంలో అన్వయించే తీరుపై సమాధానాలు ఇచ్చే విధంగా సన్నద్ధమవ్వాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు (గురువారం ముగింపు)

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
655	203
73,651	22,327

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	16,379	▽	20
డోజోన్స్	39,807	▲	47
ఎఫ్‌టీఎస్ఈ 100	7,953	▲	21
డాక్స్	18,505	▲	27
షాంఘై	3,041	▲	30
నికాయ్	40,369	▲	201

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	82.95	93.97
£	బ్రిటన్ పౌండ్	[illegible]	104.23	106.78
€	యూరో	[illegible]	89.30	91.68
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	55.64	55.75
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	53.64	55.56
S$	సింగపూర్ డాలర్	[illegible]	59.64	64.35
SAR	సౌదీ రియాల్	[illegible]	21.30	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.78	23.57
¥	చైనా యువాన్	[illegible]	10.42	12.49


ఎక్కడైనా నగదు రహిత వైద్యం!



- అత్యవసరాల్లో అనుకూలం
- సమీపంలోని ఆస్పత్రిలోనే చికిత్స
- హాస్పిటల్ బ్లాక్ లిస్ట్‌లో ఉండకూడదు
- షరతుల మేరకే క్లెయిమ్ ఆమోదం
- లేదంటే రీయింబర్స్‌మెంట్‌కు వెళ్లాల్సిందే
- వీలున్నంత వరకు నెట్‌వర్క్‌కే ప్రాధాన్యం

ఆస్పత్రిలో చేరాల్సి వస్తే ఆదుకునే సాధనం హెల్త్ ఇన్సూరెన్స్. ఇందులో ఉన్న ముఖ్యమైన సదుపాయాల్లో ఒకటి నగదు రహిత వైద్యం. ముందస్తు ప్రణాళికతో లేదా అత్యవసర సమయాల్లో ఆస్పత్రిలో చేరాల్సి వచ్చినా ఈ సదుపాయం ఎంతో అక్కరకు వస్తుంది. సాధారణంగా బీమా సంస్థ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోనే ఈ నగదు రహిత వైద్యం అందుబాటులో ఉండేది. నెట్‌వర్క్ జాబితాలో లేని ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకుంటే, సొంతంగా చెల్లింపులు చేసి తర్వాత రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ దాఖలు చేయాల్సి వచ్చేది. ఈ ఇబ్బందిని తప్పిస్తూ.. ఏ ఆస్పత్రిలో అయినా నగదు రహిత వైద్యం పొందేందుకు వీలుగా జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ ఈ ఏడాది జనవరి నుంచి 'ఎక్కడైనా నగదు రహితం' పేరుతో కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఇందుకు సంబంధించి విధి విధానాలేమిటో చూద్దాం.

బీమా సంస్థ నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్‌లోనూ నగదు రహిత చికిత్స పొందడమే నూతన విధానంలోని సౌలభ్యం. ప్రతి బీమా సంస్థ నెట్‌వర్క్ హాస్పిటల్స్ పేరుతో ఒక జాబితా నిర్వహిస్తుంటుంది. ఆ జాబితాలోని ఏ హాస్పిటల్‌లో చికిత్స పొందినా బీమా సంస్థే నేరుగా చెల్లింపులు చేస్తుంది. కానీ, అన్ని సందర్భాల్లోనూ నెట్‌వర్క్ ఆస్పత్రిలోనే చికిత్స పొందాలంటే సాధ్యపడకపోవచ్చు. ప్రమాదానికి గురైనప్పుడు వేగంగా సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లడం వల్ల విలువైన ప్రాణాన్ని కాపాడుకోవచ్చు. ఆ ఆస్పత్రి బీమా నెట్‌వర్క్‌లో భాగంగా లేకపోతే? బిల్లు భారీగా వస్తే..? ఆ మొత్తాన్ని రోగి సంబంధీకులు సర్దుబాటు చేసుకోవాల్సి వస్తుంది. అలాగే, వర్షాల కారణంగా ట్రాఫిక్ జామ్ అయి, సత్వర వైద్యం అందాల్సిన సందర్భాల్లోనూ ఇదే పరిస్థితి ఎదురవుతుంది. అలాంటి తరుణంలో సమీపంలోని హాస్పిటల్‌కు వెళ్లక తప్పదు. ఆ సమయంలో ఎక్కడైనా నగదు రహితం ఉపయోగపడుతుంది. అత్యవసరమనే కాదు, ముందుగా అనుకుని నిర్ణీత సమయానికి తీసుకునే చికిత్సలకు సైతం నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్‌కు వెళ్లొచ్చు. కాకపోతే ఎక్కడైనా నగదు రహితం విధానం ఎలా పనిచేస్తుందో తెలుసుకోవడం అవసరం.



నిబంధనలకు అనుగుణంగా ఉండాల్సిందే..


జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ తీసుకున్న తాజా నిర్ణయం అమల్లోకి రావడానికి ముందు కూడా కొన్ని బీమా సంస్థలు నాన్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యానికి అవకాశం కల్పించాయి. ఇప్పుడు ఐసీఐసీఐ లాంబార్డ్, హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో, నేషనల్ ఇన్సూరెన్స్, ఫ్యూచర్ జనరాలి, రిలయన్స్ జనరల్, బజాజ్ అలియాంజ్ జనరల్ సైతం నాన్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యానికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేశాయి. ముందస్తుగా నిర్ణయించుకుని, తీసుకునే చికిత్స విషయంలో బీమా సంస్థ లేదంటే థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్ (టీపీఏ)కు రెండు నుంచి మూడు రోజుల ముందు (48–72 గంటలు) తెలియజేయడం తప్పనిసరి. ఈ మెయిల్ లేదంటే ఇతర ఆన్‌లైన్ మార్గాల ద్వారా లేదంటే లిఖిత పూర్వకంగా బీమా సంస్థకు తెలియజేయవచ్చు. అత్యవసరంగా చికిత్స తీసుకోవాల్సి వస్తే కనుక నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్‌లో చేరిన 24 నుంచి 48 గంటల్లోపు (బీమా సంస్థ ఆధారంగా వేర్వేరు) విషయాన్ని తెలియజేయాలి.

15 పడకలు తప్పనిసరి..

నగదు రహిత వైద్యం పొందేందుకు ఎంపిక చేసుకునే ఆస్పత్రిలో కనీసం 15 పడకలు (బెడ్స్) ఉండాలన్నది నిబంధన. హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ నిబంధనలకు అనుగుణంగా, హాస్పిటల్ అనే నిర్వచనానికి అనుగుణంగా నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్ పనిచేస్తూ ఉండాలి. గుర్తింపు కార్డులు, పాలసీ డాక్యుమెంట్లు, మెడికల్ రిపోర్ట్‌లు, ప్రిస్క్రిప్షన్లు, బిల్లులు నిర్దేశిత ఫార్మాట్‌లో బీమా సంస్థకు పంపించాల్సి ఉంటుంది. నగదు రహిత వైద్యానికి అనుమతించే ముందు నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్ నుంచి ఆమోద లేఖను చాలా బీమా సంస్థలు కోరుతున్నాయి. ఆస్పత్రి బిల్లులు నిజమైనవేనా? ప్రామాణిక అడ్మిషన్ ప్రక్రియ విధానాన్నే అనుసరిస్తున్నారా? ప్రమాణాలకు అనుగుణంగానే చికిత్సా విధానాలు ఉన్నాయా? అని బీమా సంస్థలు పరిశీలిస్తాయి. ఇక పాలసీకి సంబంధించి వెయిటింగ్ పీరియడ్ (కొన్ని వ్యాధుల చికిత్సా క్లెయిమ్‌లో వేచి ఉండాల్సిన కాలం), కోపే క్లాజ్, మినహాయింపులు, ముందస్తు వ్యాధుల నిబంధనల్లో ఎలాంటి మార్పు ఉండదని గమనించాలి. కొన్ని చికిత్సలకు సంబంధించి (ఉదాహరణకు కేటరాక్ట్) ఉప పరిమితులు ఉంటే, వాటి విషయంలోనూ నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్ పరంగా ఎలాంటి మార్పు ఉండదు. పాలసీలో ప్రత్యేకమైన రైడర్ తీసుకుంటే తప్ప కాటన్, ఫేస్ మాస్కులు, సర్జికల్ గ్లోవ్‌లు, నెబ్యులైజేషన్ కిట్‌లకు పరిహారం రాదు. ఏవైనా అదనపు చార్జీలు (కవరేజీలోకి రానివి) విధిస్తే, పాలసీదారు సొంతంగా చెల్లించుకోవాలి.

చార్జీల పట్ల అవగాహన

నెట్‌వర్క్ ఆస్పత్రులు వివిధ రకాల చికిత్సలకు వసూలు చేసే చార్జీల వివరాలు బీమా సంస్థ రికార్డుల్లో ఉంటాయి. దీనివల్ల పాలసీదారు సొంత పాకెట్‌పై భారం పడదు. నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్‌లో చికిత్సలకు ఎంత చార్జీ వసూలు చేస్తారన్నది కీలకం అవుతుంది. నెట్‌వర్క్ హాస్పిటల్‌కు మించి నాన్ నెట్‌వర్క్ ఆస్పత్రి చార్జీ చేస్తే, అప్పుడు క్లెయిమ్ పూర్తిగా రాకపోవచ్చు. పైగా ఆస్పత్రి పడకలు, ఏ ప్రాంతంలో ఉందన్న దాని ఆధారంగా చికిత్సల ధరలు ఉంటాయి. ఉదాహరణకు ఒక చికిత్సకు నెట్‌వర్క్ హాస్పిటల్‌లో రూ.50,000 పరిమితి ఉందనుకోండి. అదే నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్‌లో ఇదే చికిత్సకు రూ.70,000 వేలు చార్జ్ చేస్తే, పాలసీదారు తాను సొంతంగా రూ.20,000 చెల్లించాల్సి వస్తుంది. అందుకని నగదు రహిత వైద్యం కోరుకునే వారు తమ పాకెట్ నుంచి పెద్దగా చెల్లించొద్దని భావిస్తే, అప్పుడు బీమా సంస్థ నెట్‌వర్క్ హాస్పిటల్‌కు వెళ్లడం మంచిది. కొన్ని సందర్భాల్లో నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్‌లో నగదు రహిత వైద్యానికి సంబంధించి క్లెయిమ్ తిరస్కరణకు గురికావచ్చు. అలాంటప్పుడు పాలసీదారు సొంతంగా చెల్లించి, డిశ్చార్జ్ తర్వాత రీయింబర్స్‌మెంట్‌కు వెళ్లాల్సి వస్తుంది. రోగికి శరవేగంగా చికిత్స అవసరమైతే తప్పించి, మిగిలిన వాటికి నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్స్‌ను ఎంపిక చేసుకోకపోవడం మంచిది.



నెట్‌వర్క్-నాన్ నెట్‌వర్క్

బీమా సంస్థ నగదు రహిత వైద్యం అందించేందుకు వీలుగా పలు ఆస్పత్రులతో ఒప్పందాలు కుదుర్చుకుంటుంది. ఇలా ఒప్పందానికి వచ్చిన ఆస్పత్రులు నెట్‌వర్క్ జాబితాలో ఉంటాయి. ఇలా ఒప్పందం చేసుకునే సమయంలోనే చికిత్సల ధరల విషయంలో బీమా సంస్థ ఆస్పత్రులతో సంప్రదింపులు నిర్వహిస్తుంది. దీనివల్ల బీమా సంస్థకు కొంత భారం తగ్గుతుంది. నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్స్‌తో ఈ అనుకూలత బీమా సంస్థలకు ఉండదు.

బ్లాక్ లిస్ట్‌లో ఉండకూడదు

అన్నింటికంటే ముఖ్యమైనది.. చికిత్స కోసం ఎంపిక చేసుకునే నాన్ నెట్‌వర్క్ ఆస్పత్రి బీమా సంస్థ బ్లాక్ లిస్ట్‌లో ఉండకూడదు. బ్లాక్ లిస్ట్‌లోని ఆస్పత్రిలో చేరడం వల్ల నగదు రహిత వైద్యం అందదు. రీయింబర్స్‌మెంట్‌కు కూడా అవకాశం ఉండదు. దీనివల్ల మొత్తానికే నష్టపోవాల్సి వస్తుంది. అందుకే అత్యవసరంగా చికిత్స అవసరమైనప్పుడు కూడా బీమా సంస్థ పోర్టల్‌కు వెళ్లి బ్లాక్ లిస్టెడ్ హాస్పిటల్స్ జాబితాను ఓ సారి పరిశీలించడం ఎంతో మంచిది. ఇక ముందస్తు ప్రణాళికతో తీసుకునే చికిత్సలకు బీమా సంస్థ నెట్‌వర్క్‌లోని హాస్పిటల్‌కు వెళ్లడమే మేలు. ఎందుకంటే నెట్‌వర్క్ ఆస్పత్రులు బీమా సంస్థ నిబంధనలకు అనుగుణంగా సేవలు అందిస్తుంటాయి. కనుక క్లెయిమ్ విషయంలో ఎలాంటి సమస్యలు దాదాపుగా ఎదురుకావు.

నెట్‌వర్క్ హాస్పిటల్‌తో లాభాలు



- నెట్‌వర్క్ (ఎంపానెల్డ్) ఆస్పత్రుల్లో టారిఫ్‌లు బీమా సంస్థతో కుదిరిన అంగీకారం మేరకు ఉంటాయి. చికిత్సల చార్జీలు నిర్దేశిత పరిమితుల పరిధిలోనే ఉంటాయి. దీంతో క్లెయిమ్‌కు సత్వర ఆమోదం లభిస్తుంది. వేగంగా డిశ్చార్జ్ కావచ్చు.
- నెట్‌వర్క్ హాస్పిటల్‌లో నగదు రహిత వైద్యానికి సంబంధించి క్లెయిమ్ పరిష్కారం సాఫీగా, వేగంగా జరుగుతుంది.
- నెట్‌వర్క్ ఆస్పత్రులు అన్నింటిలోనూ చికిత్సల నాణ్యాత ప్రమాణాలు మెరుగ్గా ఉంటాయి. దీంతో రోగులకు చికిత్సల తర్వాత సమస్యల రిస్క్ తగ్గుతుంది.
- ఆస్పత్రి, బీమా సంస్థ మధ్య విశ్వసనీయమైన బంధం వల్ల చికిత్సల బిల్లులను మరీ పెద్దవి చేసి చూపించడం ఉండదు. అనవసర ప్రక్రియలు, ఔషధాల వినియోగం ఉండదు. మోసాల రిస్క్ తగ్గుతుంది.

పీజీఐఎం ఇండియా రిటైర్మెంట్ ఫండ్..



పీజీఐఎం ఇండియా మ్యుచువల్ ఫండ్ తాజాగా రిటైర్మెంట్ ఫండ్‌ను ఆవిష్కరించింది. దీనికి సబ్‌స్క్రిప్షన్ ఏప్రిల్ 9న ముగుస్తుంది. సమీకరించిన నిధులను ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సాధనాలు, రీట్స్, ఇన్విట్స్, ఫిక్సిడ్ ఇన్‌కం సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మదుపుదారుల పదవీ విరమణ లక్ష్యాలకు అనుగుణంగా మెరుగైన రాబడులు అందించేందుకు ఫండ్ ప్రయత్నిస్తుంది. ఇందులో 5 ఏళ్లు లేదా పదవీ విరమణ వయస్సు వరకు (ఏది ముందైతే అది) లాకిన్ పీరియడ్ ఉంటుంది. కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఈక్విటీ విభాగాన్ని వినయ్ పహాడియా .. డెట్, రీట్స్, ఇన్విట్స్ విభాగంలో పెట్టుబడులను పునీత్ పాల్ నిర్వహిస్తారు.

బీవోఐ రుణ వడ్డీ రేట్ల పెంపు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) రుణాలపై వడ్డీ రేట్లను 10 బేసిస్ పాయింట్లు (0.10 శాతం) పెంచింది. దీంతో రెపో ఆధారిత లెండింగ్ రేటు (ఆర్‌బీఎల్ఆర్) 9.35 శాతంగా ఉంటుందని బ్యాంకు తెలిపింది. ఇవి ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని వివరించింది. రిజర్వ్ బ్యాంక్ ఏప్రిల్ 5న పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ప్రకటించనున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు బేస్ రేటు ఆధారిత వడ్డీ రేటు, బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటును 5 బేసిస్ పాయింట్ల మేర పెంచుతున్నట్లు ఇండియన్ బ్యాంకు తెలిపింది. కొత్త రేట్లు ఏప్రిల్ 3 నుంచి అమల్లోకి వస్తాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

1-4-2024 ఫామ్ ధర...

విశాఖ	415–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	403–00
విజయవాడ	403–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	380–00
వరంగల్	382–00
రిటైల్ ధర	4.40

ఖజానాకు అంచనాలను మించి డివిడెండ్లు

రూ. 63వేల కోట్లు చెల్లించిన ప్రభుత్వ రంగ సంస్థలు

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ సంస్థల (సీపీఎస్ఈ) నుంచి ఖజానాకు బడ్జెట్ అంచనాలను మించిన స్థాయిలో డివిడెండ్లు అందాయి. 2023–24లో కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ, పవర్ గ్రిడ్, గెయిల్ వంటి దిగ్గజాలు ఏకంగా రూ. 63,000 కోట్లు చెల్లించాయి. సవరించిన బడ్జెట్ అంచనాలకన్నా ఇది 26 శాతం అధికం. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రకారం 2023–24లో సీపీఎస్ఈల నుంచి రూ. 50,000 కోట్ల డివిడెండ్లు రావొచ్చని అంచనాలను సవరించారు. అయితే, పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం దీపమ్ వెబ్‌సైటు ప్రకారం కేంద్రానికి మొత్తం రూ. 62,929.27 కోట్లు వచ్చాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో (2022–23)లో డివిడెండ్ వసూళ్లు రూ. 59,952.84 కోట్లకు పరిమితమయ్యాయి. మార్చి నెలలో ఓఎన్‌జీసీ రూ. 2,964 కోట్లు, కోల్ ఇండియా రూ. 2,043 కోట్లు, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రూ. 2,149 కోట్లు, ఎన్ఎండీసీ రూ. 1,024 కోట్లు, హెచ్ఏఎల్ రూ. 1,054 కోట్లు, గెయిల్ రూ. 1,863 కోట్లు చెల్లించాయి. సీపీఎస్ఈలు అధిక మొత్తంలో డివిడెండ్ల చెల్లించడమనేది వాటి పటిష్టమైన పనితీరును ప్రతిబింబిస్తుంది. ఇది రిటైల్, సంస్థాగత వాటాదారులకు లబ్ధి చేకూర్చడంతో పాటు ఆయా సంస్థల షేర్లపై ఆసక్తిని పెంచేందుకు కూడా ఉపయోగపడగలదు.



'టెలికం' కాల్స్‌తో జాగ్రత్త: డాట్ హెచ్చరిక

న్యూఢిల్లీ: కనెక్షన్లను డిస్‌కనెక్ట్ చేస్తామంటూ టెలికం శాఖ అధికారుల నుంచి వచ్చినట్లుగా అనిపించే ఫోన్ కాల్స్ విషయంలో జాగ్రత్త వహించాలని టెలికం శాఖ (డాట్) హెచ్చరించింది. ఇలాంటి మోసపూరిత కాల్స్ .. వ్యక్తిగత సమాచారాన్ని చోరీ చేసేందుకు, ఆర్థిక మోసాలు చేసేందుకు ఉద్దేశించినవై ఉంటున్నాయని తెలిపింది. అలాగే, విదేశీ నంబర్లతో ప్రభుత్వాధికారులు చేస్తున్నట్లుగా మోసపుచ్చే వాట్సాప్ కాల్స్‌కి సంబంధించి కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తమ తరఫున కాల్స్ చేయడానికి ఎవరికీ అనుమతినివ్వలేదని స్పష్టం చేసింది. ఇలాంటి మోసపూరిత కాల్స్ ఏమైనా వస్తే సంచార్ సాథీ పోర్టల్‌లోని 'చక్షు - రిపోర్ట్ సస్పెక్టెడ్ ఫ్రాడ్ కమ్యూనికేషన్స్'లో ఫిర్యాదు నమోదు చేయాలని డాట్ పేర్కొంది.



గల్ఫ్ ఆయిల్ | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

స్టాక్ షాట్

ప్రస్తుత ధర: రూ. 939 టార్గెట్: రూ. 1,250

ఎందుకంటే: ప్రయివేట్ రంగంలోని పెట్రోలియం లూబ్రికెంట్స్ విభాగంలో దేశీయంగా గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ ఇండియా లిమిటెడ్ రెండో పెద్ద కంపెనీ. ప్రధానంగా ఆటోమోటివ్, ఇండస్ట్రియల్ లూబ్రికెంట్స్‌కు ప్రాధాన్యత నిస్తున్న కంపెనీ సుమారు 7–8 శాతం మార్కెట్ వాటాను ఆక్రమిస్తున్నట్లు అంచనా. గత మూడేళ్లుగా మార్కెట్ వాటాను పెంచుకోవడంపై దృష్టిపెట్టి ముందుకు సాగుతోంది. ఇదే కాలంలో లూబ్రికెంట్స్ పరిశ్రమ కొంతమేర మందగించినప్పటికీ కంపెనీ పురోభివృద్ధిని సాధించడం ప్రస్తావించదగ్గ అంశం! బ్రాండింగ్, పంపిణీలకు దన్నుగా నిలవడం ద్వారా అమ్మకాలను విస్తరిస్తోంది. అంతేకాకుండా డైవర్సిఫై ప్రణాళికల్లో భాగంగా ఇటీవల జోరు చూపుతున్న ఎలక్ట్రిక్ వాహన అనుబంధ విభాగాలపై కన్నేసింది. తద్వారా బ్యాటరీ, ఈవీ ఫ్లూయిడ్స్, చార్జర్ల విభాగాల్లోకి ప్రవేశించింది. వెరసి రానున్న మూడేళ్ల(2024–27)లో పరిశ్రమను మించిన పురోగతిని అందుకోగలదని భావిస్తున్నాం. వార్షిక ప్రాతిపదికన షేరువారీ ఆర్జన(ఈపీఎస్) 11.4 శాతం చొప్పున మెరుగుపడే వీలుంది. గతేడాది షేరు ధరలో ర్యాలీ వచ్చినప్పటికీ గ్లోబల్ కంపెనీలతో పోలిస్తే గల్ఫ్ ఆయిల్ సహేతుక స్థాయిలోనే ట్రేడవుతోంది. ఇక దేశీ చమురు, గ్యాస్ కంపెనీలతో పోలిస్తే భవిష్యత్‌లో షేరు రీరేటింగ్‌కు అవకాశముంది. అయితే లూబ్రికెంట్స్‌కు డిమాండ్ తగ్గడం, ఎగ్జిక్యూషన్‌లో జాప్యాలు, ప్రత్యర్థి కంపెనీల నుంచి పోటీపరమైన ఒత్తిడి వంటి అంశాలు షేరుపై ప్రతికూల ప్రభావాన్ని చూపవచ్చు.



వెల్‌స్పన్ లివింగ్ | షేర్‌ఖాన్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 138 టార్గెట్: రూ. 181

ఎందుకంటే: గత కేలండర్ ఏడాది(2023)లో భారత్ నుంచి యూఎస్‌కు హోమ్ టెక్స్‌టైల్ ఎగుమతులు భారీగా బలపడ్డాయి. ప్రధానంగా దుప్పట్లు(బెడ్‌షీట్స్) 46 శాతం, టెర్రీ టవల్స్ 38 శాతం చొప్పున ఆక్రమించాయి. అంతక్రితం ఏడాది(2022)లో ఇవి వరుసగా 34 శాతం, 36 శాతంగా నమోదయ్యాయి. వెరసి గ్లోబల్ హోమ్ టెక్స్‌టైల్స్ విభాగంలో లభిస్తున్న అవకాశాల ద్వారా లబ్ధి పొందుతున్న దిగ్గజాలలో వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్ ముందు వరుసలో నిలుస్తోంది. మధ్యకాలానికి కంపెనీ యాజమాన్యం ఆశావహంగా స్పందిస్తోంది. 2026–27 ఆర్థిక సంవత్సరానికల్లా రూ. 15,000 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు ఈ ఏడాది(2023–24) క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో 34 శాతం వాటాను సాధించిన ఎమర్జింగ్ బిజినెస్ 45 శాతానికి జంప్‌చేయగలదని అంచనా వేస్తోంది. అయితే ఇటీవల బలపడిన పత్తి(కాటన్) ధరలు, రెడీసీ ప్రాంతంలోని అలజడులు సమీప కాలంలో మార్జిన్లపై ప్రతికూల ప్రభావాన్ని చూపే వీలుంది. కంపెనీకి కీలకమైన హోమ్ టెక్స్‌టైల్స్‌సహా ఫ్లోరింగ్ బిజినెస్ విస్తరణ కారణంగా 2025–26కల్లా 15 శాతం మార్జిన్లు సాధించవచ్చు. యాజమాన్యం సైతం ఈ రెండు విభాగాలలో ధరలు మెరుగుపడటం ద్వారా లాభదాయకత పుంజుకోగలదని ఆశిస్తోంది. ముడివ్యయాలు తగ్గడానికితోడు విదేశీ మార్కెట్ల నుంచి హోమ్ టెక్స్‌టైల్స్‌కు పెరగనున్న డిమాండ్ భవిష్యత్‌లో కంపెనీ పటిష్ట పనితీరుకు దోహదపడనున్నట్లు అంచనా వేస్తోంది. కంపెనీ సామర్థ్య విస్తరణ రానున్న కాలంలో చైనా+1 అవకాశాలకు దారి చూపనుంది.




గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

అంతర్జాతీయ మ్యూచువల్ ఫండ్స్ ఎంపిక ఎలా?

నేను యూఎస్ లేదా గ్లోబల్ ఫండ్‌లో పెట్టుబడులు పెట్టాలని అనుకుంటున్నాను. ఫండ్స్ ఎంపిక విషయంలో ఎటువంటి విధానాన్ని అనుసరించాలి? వాటిల్లో ఎంత మేర ఇన్వెస్ట్ చేయాలి?
– వరుణ్ శర్మ

అంతర్జాతీయంగా పలు దేశాల్లో (భారత్ కాకుండా) ఇన్వెస్ట్ చేసే వాటిని ఇంటర్నేషనల్ ఫండ్స్ అని పిలుస్తారు. దేశీ ఫండ్స్ మంచి రాబడులను ఇస్తున్నప్పటికీ.. మంచి రాబడినిచ్చే అంతర్జాతీయ పథకాల్లోనూ కొంత మేర పెట్టుబడులు పెట్టుకోవడాన్ని పరిశీలించొచ్చు. దీనివల్ల పెట్టుబడులకు వైవిధ్యం ఏర్పడుతుంది. పిల్లలను ఉన్నత విద్య కోసం విదేశాలకు పంపాలనుకునే తల్లిదండ్రులు ముందు నుంచే ఇంటర్నేషనల్ ఫండ్స్‌కు కొంత మేర పెట్టుబడులు కేటాయించుకోవాలి. దీనివల్ల విదేశీ కరెన్సీ రూపంలో ఎదురయ్యే రిస్క్‌లను అధిగమించొచ్చు. ఈ తరహా ఫండ్స్ ఎంపిక కోసం.. వివిధ రంగాలు, కంపెనీల్లో పెట్టుబడుల వైవిధ్యంతో ఉన్నవాటిని ఎంపిక చేసుకోవాలి. కేవలం ఒకే రంగంలో పెట్టుబడులు పెట్టే ఇంటర్నేషనల్ ఫండ్స్ దూరంగా ఉండాలి. ఇంటర్నేషనల్ ఫండ్స్ థీమ్యాటిక్ ఫండ్ లేదా కమోడిటీ ఫండ్ లేదా ఓ దేశానికే సంబంధించి పెట్టుబడులతో కూడిన పథకంలో ఇన్వెస్ట్ చేయవచ్చు. ఇలాంటి వాటికి దూరంగా ఉండాలి. వీటిల్లో రిస్క్ ఎక్కువ. అప్పటి వరకు సానుకూలంగా ఉన్న రాబడులు ప్రతికూలంగా మారిపోవచ్చు. అందుకని వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియోతో ఉన్న పథకాలను ఎంపిక చేసుకోవాలి.

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

అంతర్జాతీయ కరెన్సీ మార్కెట్లో డాలర్ ఏటేటా బలపడుతోంది. 2017లో యూఎస్ డాలర్ రూపాయితో 65 దగ్గర ఉంటే, ఇప్పుడు 83కు చేరింది. ఐదేళ్లలో ఏటా 4 శాతానికి పైనే డాలర్ బలపడింది. అందుకుని డాలర్ మారకంలో విదేశీ ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవడం వల్ల రూపాయి క్షీణత నుంచి ప్రయోజనం పొందొచ్చు. మెరుగైన రాబడి అందుకోవచ్చు. ఇంటర్నేషనల్ ఫండ్స్‌ను మన ఆదాయపన్ను చట్టం నాన్ ఈక్విటీ పథకాలుగా పరిగణిస్తుంది. కనుక డెట్ పథకాలకు మాదిరే మూలధన లాభాల పన్ను చెల్లించాల్సి వస్తుంది.

ఫండ్స్‌లో దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్ష లోపు ఉంటే పన్ను చెల్లించక్కర్లేదు. అయినా ఈ లాభాన్ని ఆదాయపన్ను రిటర్నుల్లో చూపించాలా? – వివేక్

మీరు పన్ను రిటర్నులను నిబంధనల ప్రకారం దాఖలు చేయాల్సి ఉంటే, అందులో లాభ, నష్టాలను వెల్లడించాలి. స్టాక్స్, లేదా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను ఏడాదికి మించి కొనసాగించినప్పుడు వచ్చేవి దీర్ఘకాల లాభాలు. దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్ష వరకు ఉంటే పన్ను లేదు. అంతకుమించిన లాభం పైనే 10 శాతం పన్ను చెల్లించాలి. పన్ను రిటర్నులు దాఖలు చేయాల్సిన వారు ఈ వివరాలను విధిగా పేర్కొనాలి. వార్షిక సమాచార నివేదిక (ఏఐఎస్)లో మూలధన లాభాల పన్ను వివరాలు ఉంటే, అవి పన్ను రిటర్నుల్లో ముందుగానే నింపి ఉంటాయి. ఒకవేళ మీ ఆదాయం బేసిక్ ఆదాయపన్ను మినహాయింపు పరిధిలోనే ఉంటే, అప్పుడు మీరు రిటర్నులు దాఖలు చేయక్కర్లేదు. కనుక మూలధన లాభాలను చూపించక్కర్లేదు. పాత పన్ను విధానంలో రూ.2.5 లక్షల వరకు పన్ను లేదు. 60 ఏళ్లు నిండిన వారికి ఇది రూ.3 లక్షలు, 80 ఏళ్లు నిండిన వారికి రూ.5 లక్షలుగా ఉంది.



నేటినుంచి అయోధ్యకు నేరుగా విమానాలు

వారంలో మూడు రోజుల పాటు ఇండిగో, స్పైస్ జెట్ సేవలు

శంషాబాద్: ఇక హైదరాబాద్ నుంచి నేరుగా విమానంలో అయోధ్యకు చేరుకోవచ్చు. ఈ మేరకు హైదరాబాద్ నుంచి అయోధ్యకు నేటి నుంచి నేరుగా విమానాలు రాకపోకలు సాగించనున్నాయి. ఇప్పటి వరకు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలు వివిధ నగరాల మీదుగా సర్వీసులు కొనసాగించాయి. అయోధ్యలో బాలరాముడి దర్శనానికి పెరుగుతున్న భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని సోమవారం నుంచి ఇండిగో ఎయిర్‌లైన్స్‌తో పాటు స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్స్ విమానాలు శంషాబాద్ విమానాశ్రయం నుంచి నేరుగా అయోధ్యకు విమాన సర్వీసుల రాకపోకలను ప్రారంభించనున్నాయి. ఇవి వారంలో మూడు రోజులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని సంబంధిత ఎయిర్‌లైన్స్ వర్గాలు వెల్లడించాయి.

కిషన్‌రెడ్డి లేఖతో..

హైదరాబాద్–అయోధ్య మధ్య డైరెక్ట్ విమానాన్ని ప్రారంభించాలని ఫిబ్రవరి 26న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ రాయగా.. సింధియా స్పందిస్తూ వాణిజ్య విమాన సంస్థలతో (కమర్షియల్ ఎయిర్‌లైన్స్) మాట్లాడి ఈ మేరకు చర్యలు తీసుకున్నారని కిషన్‌రెడ్డి కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. విమాన సేవలు ప్రారంభం కానుండడంపై కిషన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారని పేర్కొన్నాయి.

విదేశాలకు వెళ్లాలా? వద్దా?



విదేశీ విద్యానిధి అర్హతలు జాప్యమవడంతో అయోమయంలో విద్యార్థులు

- ఎన్నికల కోడ్‌తో అర్హుల జాబితా విడుదలకు బ్రేక్
- కోడ్ తర్వాత జాబితా ప్రకటించే యోచనలో బీసీ సంక్షేమ శాఖ
- అదేబాటలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలు

సాక్షి, హైదరాబాద్: ప్రతిభావంతులైన పేద విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య చదివేందుకు ఆర్థిక సాయం అందించే ఓవర్సీస్ విదేశీ విద్యానిధి పథకాల లబ్ధిదారుల ఖరారు అంశం పెండింగ్‌లో పడింది. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సంక్షేమ శాఖలు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను కొంతకాలం ఆపేయాలని నిర్ణయించాయి. వివిధ సంక్షేమ శాఖలు క్షేత్రస్థాయి నుంచి దరఖాస్తుల స్వీకరించడంతోపాటు ఆయా విద్యార్థుల ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను సైతం పూర్తి చేశాయి. మెరిట్ ఆధారంగా వడపోసినప్పటికీ అర్హుల జాబితాలను మాత్రం ప్రకటించలేదు. నెలన్నరపాటు వివిధ దశల్లో వడపోత చేపట్టినా... సకాలంలో ఇందుకు సంబంధించి పూర్తిస్థాయి చర్యలు చేపట్టలేదు. ఇదే సమయంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సంక్షేమ శాఖలు ఒక్కసారిగా ఈ ప్రక్రియను నిలిపివేశాయి.

విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన

పార్లమెంటు ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి దాదాపు పక్షం రోజులవుతోంది. రాష్ట్రంలో పోలింగ్ ప్రక్రియ మే 13తో పూర్తి కానుంది. కానీ దేశవ్యాప్తంగా జూన్ 1న ఎన్నికలు ముగియనుండగా, జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. దీంతో అప్పటివరకు కోడ్ అమల్లో ఉంటుంది. అప్పటివరకు విదేశీ విద్యానిధి పథకం లబ్ధిదారుల ఎంపిక జాబితా వెలువడే అవకాశం లేదు. ఈ క్రమంలో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుండటంతో విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. విదేశీ వర్సిటీల్లో ఏప్రిల్ నుంచి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇందులో భాగంగానే సంక్షేమ శాఖలు ఓవర్సీస్ విద్యానిధి లబ్ధిదారుల ఎంపికను జనవరిలోనే మొదలుపెడతాయి. దరఖాస్తుల స్వీకరణ, ధ్రువపత్రాల పరిశీలన, ఇతర ప్రక్రియ పూర్తి చేసి మార్చి మొదటి వారంలో లబ్ధిదారుల జాబితాలను ఖరారు చేసేది. కానీ ఈ దఫా అర్హుల జాబితా విడుదలలో జాప్యం జరిగింది. విదేశీ విద్యానిధి సాయం వస్తుందన్న ఆశతో వందల సంఖ్యలో విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

ఈ పథకం కింద అర్హత సాధిస్తేనే ఉన్నత విద్యలో చేరేందుకు సిద్ధమయ్యే పరిస్థితి ఉండగా... ఇప్పుడు పథకం కింద లబ్ధి చేకూరుతుందా? లేదా? అనే గందరగోళం అభ్యర్థుల్లో నెలకొంది. దీంతో విదేశాలకు వెళ్లాలా? వద్దా? అనేది తేల్చుకోలేక సతమతమవుతున్నారు.

అప్పు చేసి మరీ...

మరికొందరు మాత్రం అర్హత సాధిస్తామనే ధీమాతో అప్పు చేసి మరీ విదేశాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. విమానం టికెట్లు బుక్ చేసుకుని గడువులోగా యూనివర్సిటీలో చేరేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఓవర్సీస్ విద్యానిధి కింద బీసీ సంక్షేమ శాఖ ద్వారా 300 మందికి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల నుంచి 350 మందికి, మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా 500 మందికి ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఒక్కో విద్యార్థికి ఉన్నత విద్యా కోర్సు పూర్తి చేసే వరకు రూ.20 లక్షలు రెండు వాయిదాల్లో ఇస్తారు. ఈ మొత్తాన్ని సదరు విద్యార్థి తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు.



బోనమో మల్లన్న..

వైభవంగా పెద్దాపూర్ మల్లన్న జాతర • 70వేలకు పైగా బోనాల సమర్పణ

మెట్‌పల్లి రూరల్: నెత్తిన బోనాలు.. దారి పొడవునా శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో పెద్దాపూర్ హోరెత్తింది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్‌లో మల్లన్న జాతర ఆదివారం వైభవంగా జరిగింది. అతిపెద్ద బోనాల జాతరగా పేరొందిన ఈ ఉత్సవాలు ఏటా కాముని పౌర్ణమి తర్వాత మొదటి ఆదివారం నిర్వహించడం ఆనవాయితీ. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు ఒకేసారి సుమారు 70 వేలకు పైగా బోనాలతో సాయంత్రం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మల్లన్న స్వామికి నైవేద్యం సమర్పించారు. గొర్రె పిల్లలు, బెల్లం కానుకగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల శోభాయాత్ర తర్వాత రథోత్సవం నిర్వహించారు. జాతరకు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు.

బొచ్చెడంత చేప

రూ.3 వేలకు విక్రయం



మొయినాబాద్: గండిపేట చెరువులో చేపల వేటకు వెళ్లిన వ్యక్తికి 15.5 కిలోలున్న పెద్ద బొచ్చె చేప చిక్కింది. మండల పరిధిలోని చిలుకూరు సమీపంలోని గండిపేట చెరువులోకి చిలుకూరికి చెందిన చాకలిగూడెం శ్రీనయ్య ఆదివారం చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ సందర్భంగా ఏకంగా 15.5 కిలోల బరువున్న బొచ్చె రకం చేప దొరికింది. దీనిని అక్కడే అమ్మకానికి పెట్టగా ఓ వ్యక్తి రూ.3వేలకు కొనుగోలు చేశాడు.


ఎత్తిపోస్తున్న 'బాహుబలి' మోటారు



రామడుగు/ధర్మారం (ధర్మపురి): కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ పరిధిలో ఉన్న గాయత్రీ పంపుహౌస్ నుంచి ఆరో మోటార్ (బాహుబలి) ద్వారా గ్రావిటీ కాలువలోకి అధికారులు ఆదివారం 3,150 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో దిగువన పంటలు సాగు చేస్తున్న రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ పంపుహౌస్ నుంచి నీటి విడుదలలో కొంత సాంకేతిక సమస్య రావడంతో ఆలస్యం జరిగిందని చెప్పారు. గత ప్రభుత్వం విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో కనెక్షన్ తొలగించారని, అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించి నీరు విడుదల చేశామని తెలిపారు. గతేడాది వడగళ్ల వర్షంతో నష్టపోయిన రైతులకు కనీసం పరిహారం ఇప్పించలేని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు ధర్నా చేసే నైతిక హక్కు లేదని విమర్శించారు.

పబ్లిక్ ప్రాంతాల్లో చార్జింగ్ పోర్టులతో జాగ్రత్త

- బయట చార్జింగ్ పోర్టుల వాడకంతో జ్యూస్ జాకింగ్
- సైబర్ నేరగాళ్లు మన ఫోన్లలోకి మాల్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసే అవకాశం
- ప్రజలకు కేంద్రం హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: ప్రయాణాల సమయంలో మొబైల్ చార్జింగ్ అయిపోయినా.. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, ఎయిర్ పోర్టులు.. వంటి బహిరంగ ప్రాంతాల్లోని మొబైల్ చార్జింగ్ పాయింట్లను వీలైనంత వరకూ వినియోగించొద్దని కేంద్ర హోం శాఖ ప్రజలను హెచ్చరించింది. ఈ పోర్టుల ద్వారా సైబర్ నేరగాళ్లు మన ఫోన్లలోకి మాల్‌వేర్ చొప్పించి, డేటా తస్కరించే ప్రమాదం ఉందని పేర్కొంది. ఈ తరహా జ్యూస్ జాకింగ్ స్కామ్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. జ్యూస్ జాకింగ్‌కు గురైనట్టు గుర్తిస్తే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. అదేవిధంగా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఏమిటీ జ్యూస్ జాకింగ్..?

చార్జింగ్ పాయింట్లకు అనుసంధానమై ఉంటూ ఫోన్లలో మాల్‌వేర్, ఇతర ప్రమాదకర సాఫ్ట్‌వేర్లను యూజర్‌కు తెలియకుండా ఇన్‌స్టాల్ చేసి, డేటా దొంగిలించడమే జ్యూస్ జాకింగ్. స్మార్ట్ ఫోన్ వినియోగదారుల అవగాహనా రాహిత్యాన్ని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారని కేంద్రం పేర్కొంది. బహిరంగ చార్జింగ్ పోర్టులను వాడే వారికి డేటా తస్కరణ ముప్పు ఎక్కువ అని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇలా డేటాను కొట్టేసిన తర్వాత సైబర్ నేరగాళ్లు ఆ సమాచారాన్ని అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు డిమాండ్ చేస్తున్న కేసులు పెరుగుతున్నాయని తెలిపారు.

జ్యూస్ జాకింగ్ నుంచి తప్పించుకోవాలంటే

- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కకుండా ఉండేందుకు స్మార్ట్ ఫోన్ వినియోగదారులకు కేంద్రం కొన్ని కీలక సూచనలు చేసింది.
- చార్జింగ్ పాయింట్లకు బదులు సాధారణ విద్యుత్ పాయింట్ల ద్వారా చార్జింగ్ చేసుకోవాలి.
- అవసరమైన సందర్భాల్లో వాడుకునేందుకు నిత్యం పవర్ బ్యాంక్, లేదా ఇతర చార్జింగ్ సాధనాలు వెంట పెట్టుకోవడం ఉత్తమం.
- మొబైల్ ఫోన్లకు స్క్రీన్‌లాక్ తప్పకుండా పెట్టుకోవాలి.
- వీలైనంత వరకు స్మార్ట్ ఫోన్‌ను ఆఫ్ చేశాకే చార్జింగ్ చేయాలి.


త్వరలో రంగంలోకి 'ఆపద మిత్ర'లు

- అగ్నిప్రమాదాల సమయంలో ఫైర్ సిబ్బందికి సాయం చేసేలా శిక్షణ
- తొలివిడతలో 95 మంది వలంటీర్లకు వరంగల్‌లో ట్రైనింగ్ : డీజీ నాగిరెడ్డి



ఫైల్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆపద మిత్ర పథకంలో భాగంగా తెలంగాణ అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలోనూ 'ఆపద మిత్ర'లకు శిక్షణ ఇస్తున్నట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ, అగ్నిమాపక సేవల విభాగం డైరెక్టర్ జనరల్ (డీజీ) వై.నాగిరెడ్డి తెలిపారు. విపత్తుల వేళ సత్వర స్పందన కోసం స్థానికుల్లో కొందరిని వలంటీర్లుగా గుర్తించి వారికి 'ఆపద మిత్ర'లుగా శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. తొలి విడతలో భాగంగా ప్రస్తుతం వరంగల్‌లో 95 మంది వలంటీర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని.. వారికి తరగతి గది శిక్షణ పూర్తయిందని పేర్కొన్నారు. త్వరలోనే వారికి క్షేత్రస్థాయి శిక్షణ ప్రారంభిస్తామన్నారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణమే ఎలా స్పందించాలి.. ఎలాంటి చర్యలు తీసుకోవాలి.. చుట్టుపక్కల వారిని ఎలా అప్రమత్తం చేయాలన్న అంశాలపై 'ఆపద మిత్ర'లు శిక్షణ పొందుతారని తెలిపారు. ఫైర్ సిబ్బంది మంటలార్పే సమయంలో సహాయకులుగా వ్యవహరిస్తారని వివరించారు. సాధారణ సమయాల్లో అగ్నిప్రమాదాల నియంత్రణ, ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికంగా వారి పరిధిలో అవగాహన సైతం కల్పిస్తారన్నారు. మరోవైపు ఏప్రిల్ 14 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఫైర్ సర్వీస్ వారంగా నిర్వహించనున్నట్లు నాగిరెడ్డి తెలిపారు. వారం పాటు నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ఆసుపత్రులు, రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లు, మల్టీప్లెక్స్‌లు, మాల్స్‌లో అగ్నిప్రమాదాల నియంత్రణ, ప్రమాద సమయాల్లో ఎలా కాపాడుకోవాలన్న అంశాలపై ఫైర్ సిబ్బంది అవగాహన కల్పిస్తారని చెప్పారు.




బ్లాక్ అండ్ వైట్‌లో బెస్ట్

వరల్డ్ నేచర్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పోటీల్లో ఈ ఫొటో బ్లాక్ అండ్ వైట్ విభాగంలో మొదటి బహుమతిని గెలుచుకుంది. కెన్యాలో రాత్రి సమయంలో దాహం తీర్చుకోవడానికి ఓ చెరువు వద్దకు వచ్చిన చిరుత చిత్రాన్ని అమెరికాకు చెందిన రిచర్డ్ లీ అనే ఫొటోగ్రాఫర్ తీశారు.

కల్యాణం టికెట్ @ రూ.10 వేలు..

వచ్చే శ్రీరామనవమికి విక్రయం.. ఎన్నికల కోడ్‌తో సీఎం సెక్టార్.. వీవీఐపీగా మార్పు



భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో కొలువుదీరిన శ్రీసీతారాముల వారి కల్యాణాన్ని తిలకించేందుకు దేశం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివస్తుంటారు. ఇప్పటివరకు రూ.7,500 ఉభయదాతల టికెటే అత్యధిక ధర కాగా.. ఈ ఏడాది తొలిసారి వీవీఐపీ పేరుతో రూ.10 వేల విలువైన టికెట్లను అందుబాటులో ఉంచనున్నారు. భద్రాచలం మిథిలా స్టేడియంలో ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే శ్రీరామనవమి, పట్టాభిషేక మహోత్సవాలకు సంబంధించి సెక్టార్ల టికెట్లను దేవస్థానం అధికారిక వెబ్‌సైట్‌లో ఇప్పటికే అందుబాటులో ఉంచారు. వీటిలో కల్యాణ వీక్షణానికి ఉభయదాతలకు రూ.7,500, ఇతర సెక్టార్లలో రూ.2,500, రూ.2 వేలు, రూ.1,000, రూ.300, రూ.150 టికెట్లు, పట్టాభిషేకానికి రూ.1,500, రూ.500, రూ.300 టికెట్లు ఉండగా, భక్తుల పరోక్ష సేవల నిమిత్తం రూ.5 వేలు, రూ.1,116 టికెట్లు ఉన్నాయి. అయితే ఈ ఏడాది రూ.10 వేల టికెట్లను సైతం అందుబాటులో ఉంచనున్నారు.

వీవీఐపీగా సీఎం సెక్టార్..: శ్రీరామనవమికి ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకురావడం ఆనవాయితీ. ఈ ఏడాది పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యే అవకాశం లేదు. ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సైతం వచ్చే అవకాశం లేకపోవడంతో సీఎం సెక్టార్ ఖాళీగా ఉండనుంది. దీంతో ఆ సెక్టార్‌ను రూ.10 వేల ధరతో వీవీఐపీ సెక్టార్‌గా మార్చి 100 టికెట్లు విక్రయించాలని ప్రతిపాదనలు పంపగా, ఉన్నతాధికారులు ఆమోదం తెలిపారు. అయితే ఈ టికెట్లు కలెక్టర్ ఆధీనంలోనే ఉంచుతారని తెలుస్తోంది.

కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

- విరిగిన పట్టా..



ఆలేరు రూరల్: కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రమాదం తప్పింది. ఆదివారం ఉదయం సికింద్రాబాద్ నుంచి ఆలేరు మీదుగా లూప్‌లైన్‌లో ఖాజీపేట వైపు కృష్ణా ఎక్స్‌ప్రెస్ వెళ్తోంది. ఏడు గంటల సమయంలో ఆలేరు రైల్వేస్టేషన్‌లోకి ప్రవేశిస్తుండగా పట్టాల నుంచి భారీ శబ్దం రావడాన్ని ప్లాట్‌ఫామ్‌లపై ఉన్న ప్రయాణికులు గమనించారు. వెంటనే రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. రైల్వే సిబ్బంది వెంటనే అప్రమత్తమై విరిగిన పట్టాను గుర్తించి మరమ్మతులు చేపట్టారు. అనంతరం రైలు బయలుదేరి వెళ్లింది. ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

రూ. వేయి కోట్లు ఇస్తేనే 'గృహ'ప్రవేశం

- డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీల్లో ప్రాథమిక వసతుల కల్పన అంచనా
- నీళ్లు, విద్యుత్, డ్రెయిన్లు లేక అవి నిరుపయోగం
- నగరం, శివారు ప్రాంతాలకు రూ.650 కోట్లు
- జిల్లాల్లో రూ.455 కోట్లుంటేనే పనులు
- గత ప్రభుత్వ హయాంలో రూ.201 కోట్ల కేటాయింపు
- కానీ ఖర్చు చేసింది రూ.39 కోట్లే



సాక్షి, హైదరాబాద్: దేశంలో మరే రాష్ట్రంలో నిర్మించని తరహాలో నిరుపేదల కోసం రూపుదిద్దుకున్న రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం మూడొంతులు సిద్ధమైనా ఇప్పటికిప్పుడు ప్రజలు నివాసం ఉండే పరిస్థితి కనిపించటం లేదు. ఆ కాలనీలకు మంచినీళ్లు, కరెంటు, మురిగునీటి పారుదల, రోడ్లు.. లాంటి అతి ముఖ్య ప్రాథమిక వసతులు కూడా లేవు. ఇవన్నీ సిద్ధం కావాలంటే ఒకటి కాదు రెండు కాదు, ఏకంగా రూ.వేయి కోట్లు కావాలి. కనీస వసతుల కల్పనకు ఇప్పుడు ప్రభుత్వం ఏం చేస్తుందన్న విషయంలో స్పష్టత లేకుండా పోయింది. సొంత జాగా ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షల చొప్పున, సొంత జాగా లేనివారికి ముందుగా భూమి ఇచ్చి ఇంటి నిర్మాణ యూనిట్ కాస్ట్ నిధులు ఇస్తామని ఈ ప్రభుత్వం పేర్కొంది. కానీ ఈ ఏడాది సొంత జాగా లేని వారిని పక్కన పెట్టేసింది. ఇక ఇందిరమ్మ ఇళ్ల కోసం 66 లక్షలను మించి వచ్చిన దరఖాస్తుల విషయంలో ఎలా ముందుకెళ్లాలో కూడా రూట్ మ్యాప్ సిద్ధం కాలేదు.

1.49 లక్షల ఇళ్లు సిద్ధమైనా..

రాష్ట్రవ్యాప్తంగా 2.29 లక్షల రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం చేపట్టగా, 1.49 లక్షల ఇళ్లు సిద్ధమయ్యాయి. మరో 80 వేలు తుది దశలో, వివిధ స్థాయిల్లో ఉన్నాయి. ఈ ఇళ్లను కూడా ఇందిరమ్మ ఇళ్ల కిందనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని తాజాగా ప్రభుత్వం భావిస్తోంది. ఇళ్లు సిద్ధంగా ఉన్నా, ప్రజలు మాత్రం వాటిల్లో ఉండే పరిస్థితి మాత్రం ప్రస్తుతం లేదు. ఆయా కాలనీల్లో ఇళ్లనైతే నిర్మించారు గానీ, వాటిల్లో మంచినీళ్లు, విద్యుత్ కనెక్షన్లు లేవు. వాననీళ్లు, మురుగునీళ్లు వెళ్లే వ్యవస్థ లేదు. రోడ్లతో అనుసంధానం కాలేదు. చాలా కాలనీలు ప్రస్తుత జనావాసాలకు దూరంగా ఉన్నందున.. చాలా వసతులు కల్పించాల్సి ఉంది. ఇటీవల అధికారులు వాటిపై సమీక్షించి లెక్కలు వేసి రూ.వేయి కోట్లకుపైగా నిధులు ఉంటే తప్ప ఆ ఏర్పాట్లు చేయటం సాధ్యం కాదని తేల్చారు. వాటి నిర్మాణం ప్రారంభించిన సమయంలో నాటి ప్రభుత్వం వేసిన అంచనాలు ఇప్పుడు పెరిగిపోయాయి. దీంతో వాటిని సవరించాల్సి ఉంది.


హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో

హైదరాబాద్ నగరం, దాని శివారు ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో లక్ష ఇళ్లను నిర్మించారు. వీటిల్లో కొన్నింటిలో లబ్ధిదారులు ఉంటుండగా, మిగతా కాలనీలు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయి. ఆయా కాలనీల్లో మంచినీటి, మురుగునీటి పారుదలకు కావాల్సిన ట్రంక్‌లైన్లు, విద్యుత్ అనుసంధాన వ్యవస్థ, వరదనీటి కాలువల కోసం దాదాపు రూ.650 కోట్లు కావాలి. పోలీసు స్టేషన్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్టాపులు, రేషన్ దుకాణాలు లాంటి వాటిని కూడా సమకూర్చాల్సి ఉంది. అందుకు మరికొన్ని నిధులు కావాల్సి ఉంటుంది. ఇక జీహెచ్ఎంసీ వెలుపల.. జిల్లాల్లో నిర్మించిన కాలనీల్లో మంచినీరులాంటి కనీస వసతులు కూడా లేవు. కాలనీలను నివాసయోగ్యంగా మార్చాలంటే రూ.456 కోట్లు కావాల్సి ఉంది.

మిగిలిన నిధులు ఏమయ్యాయో?

గత ప్రభుత్వం రూ.201 కోట్లను విడుదల చేసింది. వాటిల్లో రూ.39 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయి. మిగతా నిధులేమయ్యాయో తేలాల్సి ఉంది. గత ప్రభుత్వం విడుదల చేయగా పోనూ మిగిలిన మొత్తాన్ని ఇప్పుడు విడుదల చేయాల్సి ఉంది. అంచనా వ్యయాలు పెరిగినందున అదనంగా వాటి అవసరం ఏర్పడింది. నిధులు ఇవ్వటంలో జాప్యం జరిగే కొద్దీ.. ఆ ఇళ్లు నిరుపయోగంగా ఉండాల్సిందే. మరింత ఆలస్యమైతే.. నిర్మాణాలు కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది.

టుడేస్ గ్రాఫిక్



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వాడుకలో ఉన్న 7,168 భాషల్లో 3,078 (43%) భాషలు అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్నాయి. 8.8 కోట్ల మంది ప్రజలు ఈ భాషలను మాట్లాడుతున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.